www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 23-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 7 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: దశమి సా.4.44 తదుపరి ఏకాదశి, నక్షత్రం: ధనిష్ఠ మ.12.07 తదుపరి శతభిషం, వర్జ్యం: రా.6.55-8.26, దుర్ముహూర్తం: ఉ.11.48-12.38, అమృతఘడియలు: తె.4.00-5.31, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.57 సూర్యాస్తమయం: 6.29 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంటర్ ఫలితాలలో రికార్డు!



గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత ఉత్తీర్ణత నమోదు
ఫస్టియర్‌లో 66.89%, సెకండియర్‌లో 71.37% పాస్
అమ్మాయిల్లో 74.0%, అబ్బాయిల్లో 57.56% ఉత్తీర్ణత
ఫస్టియర్‌లో మేడ్చల్, సెకండియర్‌లో ములుగు జిల్లా ఫస్ట్
రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు నేటి నుంచే దరఖాస్తులు
14

ఫలితాలు విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం

పచ్చని కొండల్లో నెత్తుటేర్లు

కశ్మీరు లోయలో ఉగ్రవాదుల నరమేధం.. పర్యాటకులపై కాల్పులు


26 మంది దుర్మరణం.. 20 మందికి తీవ్ర గాయాలు

మృతుల్లో ఇద్దరు విదేశీయులు, ఇద్దరు స్థానికులు
హైదరాబాద్‌కు చెందిన మనీశ్ రంజన్ మృతి
మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్‌లో దారుణ ఘటన
సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు
పర్యాటకుల పేర్లు అడిగి మరీ కాల్పులు
మైదానం కావడంతో తప్పించుకోవడానికి వీల్లేక తుపాకీ గుళ్లకు బలైన పర్యాటకులు
సమాచారం తెలియగానే రంగంలోకి జవాన్లు
హెలికాప్టర్ల ద్వారా క్షతగాత్రుల తరలింపు
సమీప అటవీ ప్రాంతంలో కూంబింగ్
ఉగ్రదాడి తమ పనేనన్న టీఆర్‌ఎఫ్.. ఇది లష్కరే తాయిబా నుంచి ఉద్భవించిన ఉగ్ర సంస్థ
కాల్పులకు తెగబడిన వారు జంతువులు: ఒమర్
హుటాహుటిన శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా
గవర్నర్, సీఎం, ఉన్నతాధికారులతో సమీక్ష

పహల్గాం/న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: కశ్మీరు లోయలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో మంగళవారం పచ్చికబయళ్లలో తిరుగుతూ ప్రకృతి అందాలను చూసి పరవశిస్తున్న పర్యాటకులపై హఠాత్తుగా దాడికి తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసారన్ ప్రాంతంలోని కొండల మధ్యనున్న మైదాన ప్రాంతంలో పర్యటిస్తున్న వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. పచ్చని కొండల్లో నెత్తుటేర్లు పారించారు. ముష్కరుల దాడిలో 26 మంది మరణించారు. మరో 20 మందికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. మృతుల్లో ఇద్దరు విదేశీయులు (ఇజ్రాయెల్, ఇటలీ దేశస్థులు), ఇద్దరు స్థానికులు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బైసారన్ ప్రాంతంలో ఉల్లాసంగా తిరుగుతున్న 40 మందికి పైగా పర్యాటకులను సమీప అడవిలో నుంచి వచ్చిన ఉగ్రవాదులు చుట్టుముట్టారు. లోయ అందాలను

మిగతా 11వ పేజీలో...


ఆప్తులను కోల్పోయిన దుఃఖంతో ఓ బాధితురాలి శోకం


భర్త మృతదేహం చెంతన భార్య; దూరంగా మరో మృతదేహం (వృత్తంలో)

మృతుడు మంజునాథ్ (ఫైల్), దాడి జరిగిన ప్రాంతానికి తరలివస్తున్న బలగాలు




ఆ ఉగ్రమూకను వదిలిపెట్టం: మోదీ

సౌదీ నుంచి హుటాహుటిన ప్రధాని వెనక్కి
పహల్గాం దాడి క్రూరమైనది: ద్రౌపదీ ముర్ము
భారత్‌కు మా సంపూర్ణ మద్దతు: ట్రంప్
ఉగ్రవాదంపై సమిష్టిగా పోరాడదాం: ఖర్గే
కేంద్రం డొల్ల ప్రకటనలు కట్టిపెట్టాలి: రాహుల్
ఉగ్రమూకలపై కఠినంగా వ్యవహరించాలి: రేవంత్
11

మతం అడిగి మరీ మారణకాండ

పేర్లు అడిగి, ఖురాన్ సూక్తులు చెప్పించి
ముస్లింలు కాదని నిర్ధారించుకుని కాల్చివేత
హిందువులు, పురుషులే లక్ష్యంగా ఉగ్రవాదుల దాడి
హనీమూన్ జంట.. భార్య కళ్లముందే భర్త కాల్చివేత
మరో ఘటనలో కుమార్తె ఎదుటే తండ్రి హతం
రక్తంతో తడిచిన పహల్గాంలోని పచ్చిక బయళ్లు
11


ఆస్పత్రిలో ఓ క్షతగాత్రుడు


12

హీరో మహేశ్ బాబుకు ఈడీ నోటీసు

27న విచారణకు రావాలని పిలుపు
స్థిరాస్తి అక్రమాల ఆరోపణలున్న సురానా డెవలపర్స్ సంస్థకు మహేశ్ ప్రచారం
పారితోషికంగా రూ.5.9 కోట్లు.. దాంట్లో రూ.2.5 కోట్లు నగదుగా చెల్లింపు
ఇటీవలే సురానా ఆఫీసుల్లో ఈడీ సోదాలు

పెరిగిన కొలొరెక్టల్ క్యాన్సర్ ముప్పు!

కాంటినెంటల్ ఆస్పత్రి అధ్యయనంలో వెల్లడి
మూడు వేల మందికి కొలొనోస్కోపీ స్క్రీనింగ్
25.27 శాతం మందిలో కణితుల గుర్తింపు
తొలిదశలో తొలగిస్తే క్యాన్సర్‌కు చెక్
45 ఏళ్లు దాటిన వారు పరీక్షలు చేయించుకోవాలి.. డాక్టర్ గురు ఎన్ రెడ్డి
13

పీఎస్సార్ అరెస్టు

జత్వానీ కేసులో 'ఏ2'కు సీఐడీ ఝలక్
హైదరాబాద్‌లో వియ్యంకుడి ఇంట్లో ఉండగా అరెస్టు.. విజయవాడకు తరలింపు
నేటి ఉదయం కోర్టుకు సీనియర్ ఐపీఎస్
లిక్కర్ స్కామ్ దొంగల బట్టలు సగమే విప్పారు
మిగతావి విప్పేందుకు పూర్తిగా సహకరిస్తా
మద్యం కేసులో నాది విజిల్‌బ్లోయర్ పాత్ర
విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు
3

ఠారెత్తిస్తున్న ఎండలు

నిర్మల్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు
రాబోయే రెండురోజులు రాష్ట్రంలో 45 డిగ్రీలు దాటొచ్చన్న వాతావరణశాఖ
8 జిల్లాలకు రెడ్ అలెర్ట్..
మిగతా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ
14

సివిల్స్‌లో వరంగల్

ఇద్దరు ఓరుగల్లు బిడ్డలకు ఉత్తమ ర్యాంకులు
సాయి శివానికి 11, విజయసింహారెడ్డికి 46
1129 పోస్టులకుగాను 1009 మంది ఎంపిక
టాప్ 100 జాబితాలో ఏడుగురు తెలుగువారు
మొత్తం క్వాలిఫై అయినవారు.. 57 మంది
శ్రీకాకుళం జిల్లావాసి వెంకటేశ్‌కు 15వ ర్యాంకు
'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సాయం పొందినవారిలో ఏడుగురికి ర్యాంకులు
సివిల్స్ విజేతలకు సీఎం రేవంత్ అభినందనలు
తొలి ప్రయత్నంలోనే టాపర్‌గా యూపీ యువతి


సాయి శివాని


విజయసింహారెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎప్పటిలాగానే సివిల్స్ పరీక్షల్లో తెలుగువారు మరోసారి సత్తా చాటారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 57 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. టాప్-100 జాబితాలో ఏడుగురు తెలుగువారు ఉండగా.. వారిలో ఇద్దరు వరంగల్‌జిల్లా వాసులు! ఓరుగల్లు బిడ్డ ఇట్టబోయిన సాయిశివాని 11వ ర్యాంకుతో

మిగతా 12వ పేజీలో...

ఆపరేషన్ కర్రెగుట్టలు!

మూడు రాష్ట్రాల్లో 280 చ.కి.మీ. మేర నక్సల్స్‌కు కంచుకోటగా గుట్టలు
అందులో 50% భద్రాద్రి, ములుగు జిల్లాల్లోనే
హిడ్మాతో పాటు 3 వేల మంది నక్సల్స్ అక్కడే ఉన్నట్లు అనుమానాలు
పెద్ద ఎత్తున చుట్టుముట్టిన బలగాలు
నేడో, రేపో భారీ ఎన్‌కౌంటర్!
3


మావోయిస్టుల స్థావరంగా భావిస్తున్న కర్రెగుట్టలు

రూ.12,062 కోట్లు..
30,500 ఉద్యోగాలు

సీఎం జపాన్ పర్యటనతో రాష్ట్రానికి దిగ్గజ కంపెనీలు
రాష్ట్ర ప్రభుత్వంతో ఆయా సంస్థల ఒప్పందాలు
ముగిసిన రేవంత్ జపాన్ పర్యటన... నేడు తిరిగిరాక
చివరి రోజు హిరోషిమాను సందర్శించిన సీఎం బృందం
మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళి.. ఆ రాష్ట్ర శాసనసభ సభ్యులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగం
గర్వించే భవిష్యత్తును రూపొందిస్తాం
రాహుల్ లేఖకు ఎక్స్ వేదికగా రేవంత్ స్పందన
రోహిత్ వేముల చట్టం రూపకల్పనకు సంకేతం
13


జపాన్‌లోని హిరోషిమా స్మారక స్థలం ముందు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

విధి విధానాలు సిద్ధమయ్యాయి!

వాణిజ్య ఒప్పందానికి మార్గం సుగమం
మోదీ ప్రజాదరణ అసూయ కలిగిస్తోంది
ఈ మాట నేను ఆయనకే చెప్పాను
బైడెన్ ప్రభుత్వం పెత్తనం చేయబోయింది
భారత్‌ను చీప్ లేబర్ దేశంగా చూశారు
అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ వ్యాఖ్యలు
12

వాన్స్.. వంటల్లో బెస్ట్!


పిల్లలకు రామాయణ, మహాభారతాలంటే మక్కువ
భారతదేశ చరిత్రనూ చదివారు
ఇక్కడి ఆహారాన్ని ఇష్టంగా తింటారు
ఏపీ తోలుబొమ్మలు ఆకట్టుకున్నాయి: ఉషా వాన్స్
12


ALPHORES 35 YEARS EMPOWERMENT
The Pride of TELANGANA
ALPHORES JUNIOR COLLEGES
An ISO 9001:2008 & 2015 Certified Institution
PROVES THE LEAD AGAIN WITH THE
STATE BEST MARKS
IN IPE 1st & 2nd YEAR RESULTS-2025
Superb Greetings! Best Scorers
988 V. RISHITHA MEC-2533200111 MNCL C. Code 33214
987 B.GREESHMA CEC-2535202204 KNR C. Code 35239
997 J. ANJANA BiPC-2535210413 KNR C. Code 35259
996 K.RUTWIK MPC-2535200737 KNR C. Code 35231
988 V. AKSHAY VARDHAN MEC-2535201906 KNR C. Code 35230
MPC 995 M. RUTHWIKA
MPC 995 A. LAXMI PRASANNA
MPC 995 P. SRINITHYA REDDY
BiPC 995 S. KAVAL PREETH KOUR
MPC 994 V. PRASEEDHA
MPC 994 K.VARSHINI
MPC 994 M. KEERTHI
MPC 994 G. LAXMI PRASANNA
MPC 994 S. SEVITHA
MPC 994 S. KEERTHANA
MPC 994 T. KEERTHANA
MPC 994 V. HRUSHIKESH
MPC 994 M. AKSHITHA
MPC 994 S. KARTHIKEYA
MPC 994 V. SAHITHI
BiPC 994 SUMAYA KHANAM
MPC 993 JADHAV NAVYA SRI
MPC 993 P. VARNITH
MPC 993 E. PRASANNA
MPC 993 G. SRINIDHI
MPC 993 S. SRIVARSHINI
MPC 993 T. AKSHARA
MPC 993 T. SHARON RODHA
MPC 993 P. SAI SREE
MPC 993 G. VARSHINI
MPC 993 D. PRAGNA SRI
MPC 993 S. SRINIDHI REDDY
MPC 993 C. RUCHITHA REDDY
MPC 993 C. SANNITH
MPC 993 ABDUL ZEESHAN
MPC 993 V. AKSHAY
BiPC 993 M. SRI VIDHYA
BiPC 993 K. AKSHAYA
BiPC 993 S. SATHWIKA
ALPHORESIANS for SENSATION
STAFF for DEDICATION
PARENTS for COOPERATION
MPC 468 S. LAXMI PRIYA
MPC 468 N. KRUSHNA VENI
MPC 468 L. HASINI
MPC 468 S. LAHARI
MPC 468 G. TARUN
MPC 468 M. SWETHA
MPC 468 HAFSAH HASNAIN
MPC 468 THAHURA NOOR
MPC 468 A. SHASHIVARDHAN
MPC 468 A. NICHITHA
MPC 468 K. ANUPAMA
BiPC 438 A. SATYA BRAHMANI
MPC 468 T. ANWITA REDDY
MPC 468 D. NAGA SAGAR
BiPC 438 NABEELA TAHREEM
MPC 468 P. KEERTHI SREE
MPC 468 K. PALLAVI
BiPC 438 ZOHA MAHAVISH
MPC 468 J. PRASOONA SRI
MPC 468 J. PRANAV TEJA
BiPC 438 SAMA FIRDOUS
MPC 468 CH. AMITAVRAJ
MPC 468 G. SURYAPRAKASH
CEC 493 P. BHAVAGNYA
MEC 491 HT.NO. 2533101203 MNCL C. Code 33214 R. CHIDVILASA
MPC 468 HT.NO. 2533100763 MNCL C. Code 33214 G. HYANDAVI
The Eminent Academician Dr. V.NARENDER REDDY garu, Chairman, heartily congratulating the IPE 1st Year SUPERB SCORERS
Hearty Congratulations
HYDERABAD: SUCHITRA ALWAL 91608 61444 | GHATKESAR 91601 28444 | KARMANGHAT 92468 34441
NEW NALLAKUNTA 91608 67444 | HASTINAPURAM 91339 73444
KARIMNAGAR 91335 88857, 91602 94441 | JAGTIAL 92470 66444 | HANAMKONDA 91333 12830
MANCHERIAL 9160264443 | NIRMAL 91602 94446 | ARMOOR 91604 63444 | NIZAMABAD 91604 15444
Fabulous Record !
ALPHORESIANS
127 with >= 990 in II Year
25 with >= 436 in I Year BiPC
77 with >= 467 in I Year MPC

ఆపరేషన్ కర్రెగుట్టలు!

280 చ.కి.మీ మేర నక్సల్స్‌కు కంచుకోటగా గుట్టలు.. అందులో 50% తెలంగాణలోనే..

- భారీగా మావోయిస్టుల స్థావరాలు
- వాటిల్లో 3 వేల మంది నక్సల్స్!
- హిడ్మా ఉన్నట్లు అనుమానాలు
- చుట్టుముట్టిన 4 వేల బలగాలు
- హెలికాప్టర్లు, డ్రోన్లతో గాలింపు
- నేడో, రేపో భారీ ఎన్‌కౌంటర్?
- బిక్కుబిక్కుమంటున్న గ్రామాలు



మావోయిస్టుల స్థావరంగా భావిస్తున్న కర్రెగుట్టలు

చర్ల/వాజేడు/వెంకటాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్' పేరుతో 2026 మార్చికల్లా మావోయిజాన్ని తుడిచిపెట్టాలని సంకల్పించిన కేంద్ర బలగాలు.. మరో భారీ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో.. 280 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన కర్రెగుట్టల వైపు బలగాలు వేగంగా కదులుతున్నాయి. దశాబ్దాలుగా ఈ గుట్టలు నక్సలైట్లకు కంచుకోటలుగా ఉంటుండగా.. అబూజ్‌మడ్, ఇతర ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్లు పెరగడంతో.. ఉన్న క్యాడరంతా కర్రెగుట్టలపైకి చేరుకున్నట్లు భద్రతాబలగాలు ఉప్పందుకున్నాయి. దాంతో.. సోమవారం ఉదయం నుంచే సీఆర్‌పీఎఫ్-కోబ్రాతోపాటు.. బస్తర్ రీజియన్‌లోని ఏడు జిల్లాల డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్‌కు చెందిన సుమారు 4 వేల బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టడం ప్రారంభించాయి. అటు మహారాష్ట్రలోని ఇంద్రావతి నది సమీపంలో సీ-60 బలగాలు కూడా మోహరించినట్లు సమాచారం. 50% కర్రెగుట్టలు తెలంగాణలోని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చర్ల, ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు వైపు సుమారు 70 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. దీంతో.. కేంద్ర బలగాలు తెలంగాణ మీదుగా కర్రెగుట్టలకు చేరుకున్నట్లు తెలిసింది. అటు ఛత్తీస్‌గఢ్‌లోని హిడ్మా స్వస్థలమైన పూవర్తికి 20 కిలోమీటర్ల దూరంలోని పూజారి కాంకేర్, ఊసూరు, మద్దేడు నుంచి ఈ గుట్టలు మొదలవుతాయి.

ఎత్తులో పైచేయి ఎవరిది?

'ఆపరేషన్ కర్రెగుట్టలు' పోలీసు బలగాలకు అంత సులభమేమీ కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. 280 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ గుట్టల్లో చాలా వరకు నిటారుగా.. 30-50 మీటర్ల ఎత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మందుపాతరల అనుమానాలతో బలగాలు బాంబ్‌స్క్వాడ్ సాయంతో ముందుకు సాగుతుండగా.. బుధవారం కడపటి వార్తలందేసరికి.. రోప్ సాయంతో గుట్టలను అధిరోహించడం ప్రారంభించినట్లు తెలిసింది. వాస్తవానికి గుట్టల పైన ఉన్న వారిదే పైచేయిగా ఉంటుంది. పైనుంచి పేల్చే తూటాలు కిందివైపు వేగంగా దూసుకొస్తాయి. అదే.. కింద పేల్చే తూటాలు.. పైకి వెళ్లే కొద్దీ వాటి వేగం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే.. హెలికాప్టర్లు, డ్రోన్లు అందుబాటులో ఉండడం బలగాలకు కలిసి వచ్చే అవకాశాలున్నట్లు వివరిస్తున్నారు. కర్రెగుట్టలపై నక్సల్స్ బంకర్లలో కాపుకాస్తున్నారని, ప్రతిదాడికి సిద్ధంగా ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వారి వద్ద బీజీఎల్ లాంచర్లు, రాకెట్ లాంచర్లు ఉన్నట్లు పలు ఘటనలు రుజువు చేశాయి. ఈ నేపథ్యంలో హెలికాప్టర్లు, డ్రోన్లను వారు టార్గెట్ చేసుకునే ప్రమాదముందనే వాదనలూ ఉన్నాయి.

చరిత్రలోనే భారీ ఆపరేషన్!

మావోయిస్టు పార్టీ గెరిల్లా దళపతి హిడ్మా సహా.. పలువురు కీలక నేతలను కలిపి కర్రెగుట్టలపై ఉన్న స్థావరాల్లో 3 వేల మంది మావోయిస్టులు ఉన్నట్లు బలగాలు భావిస్తున్నాయి. ఎత్తుగా ఉండే ఈ గుట్టలపై.. మావోయిస్టు అగ్రనాయకుల బంకర్లు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే.. ప్రభుత్వం 'సేవ్ కర్రెగుట్టలు' ప్రచారాన్ని ప్రారంభించగానే.. మావోయిస్టులు ఈ గుట్టల చుట్టూ మందుపాతరలను అమర్చారని తెలుస్తోంది. అందుకే.. సామాన్య పౌరులెవరూ కర్రెగుట్టల వైపు రావొద్దంటూ నక్సల్స్ కరపత్రాలు ఇటీవల కలకలం రేపాయి. వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ మందుపాతరల కారణంగా మృతిచెందగా, పలువురు మంది గిరిజనులు గాయపడ్డారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉండడం.. 4 వేల మందితో బలగాలు ముందుకు సాగుతుండడంతో.. కర్రెగుట్టలపై ఏమైనా జరగొచ్చని, చరిత్రలోనే భారీ ఆపరేషన్‌గా నిలవొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

పీఎస్సార్ ఆంజనేయులు అరెస్టు

జత్వానీ కేసులో 'ఏ2'కు సీఐడీ ఝలక్

- హైదరాబాద్‌లో అదుపులోకి
- అరెస్టుచేసి విజయవాడకు తరలింపు



అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జత్వానీ అక్రమ అరెస్టు... ఆమె కుటుంబ సభ్యులకు వేధింపులు, బెదిరింపుల కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐపీఎస్ అధికారులు పీఎస్సార్, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీలపై ఇప్పటికే సస్పెన్షన్ వేటుపడింది. కాంతి రాణా, విశాల్ గున్నీ హైకోర్టును ఆశ్రయించి అరెస్టు నుంచి రక్షణ పొందారు. ఈ కేసులో ఏ2గా ఉన్న పీఎస్సార్ మాత్రం, 'డీజీ స్థాయిలో ఉన్న నన్ను ఎవరూ టచ్ చేయలేరు' అన్నట్లుగా ధీమాగా ఉండిపోయారు. కానీ... సీఐడీ అధికారులు అనూహ్యంగా ఝలక్ ఇచ్చారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేశారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం... హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ మండలం అమ్మాడాపూర్‌లో ఐదేళ్ల కిందట పీఎస్సార్ ఆంజనేయులు 2.20 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అందులోనే ఫామ్‌హౌస్ నిర్మించుకుని అక్కడే నివసిస్తున్నారు. అయితే, పీఎస్సార్ హైదరాబాద్ కుందన్‌బాగ్‌లో ఉన్న వియ్యంకుడి ఇంట్లో ఉన్నట్లు తెలుసుకున్న సీఐడీ అధికారులు మంగళవారం ఉదయం అక్కడికే వెళ్లి పీఎస్సార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను మొయినాబాద్ ఫార్మ్ హౌస్‌కు తీసుకెళ్లి... సోదాలు నిర్వహించారు. అక్కడ కొన్ని పత్రాలు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మధ్యాహ్నం విజయవాడ కానూరులో ఉన్న సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించి విచారించారు. బుధవారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించి... కోర్టులో హాజరు పరచనున్నారు.

ఇదీ కేసు నేపథ్యం...

జగన్‌కు సన్నిహితుడైన పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌ను ముంబైలో నమోదైన కేసు నుంచి బయటపడేసేందుకు అప్పట్లో భారీ స్కెచ్ వేశారు. ఆయనపై ఫిర్యాదు చేసిన నటి కాదంబరి జత్వానీని బెదిరించి దారికి తెచ్చుకుని... కేసు వాపస్ చేసుకునేలా స్కెచ్ గీశారు. ఇందులో... కీలకపాత్ర అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులుదే! రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాదంబరి జత్వానీ తనకు జరిగిన అన్యాయంపై విజయవాడ పోలీసులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. కుక్కల విద్యాసాగర్, పీఎస్సార్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీ, అప్పటి ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్యనారాయణ, పశ్చిమ జోన్ ఏసీపీ హనుమంతరావుతోపాటు మరి కొంతమందిపై కేసు నమోదైంది. ఆ తర్వాత కేసును సీఐడీకి బదిలీ చేశారు. విద్యాసాగర్ బెయిలుపై బయటకు వచ్చారు. అరెస్టు నుంచి కాంతిరాణా, విశాల్‌గున్నీకి హైకోర్టు తాత్కాలిక ఉపశమనం కల్పించింది.

ఈ కేసుతో నాకు సంబంధం లేదు?: పీఎస్సార్


కాదంబరి జెత్వానీ అక్రమ అరెస్టుతో తనకేమీ సంబంధం లేదని పీఎస్సార్ పేర్కొన్నట్లు తెలిసింది. సీఐడీ కార్యాలయంలో ఆయనను మంగళవారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ప్రశ్నించారు. "కాదంబరి జెత్వానీ బ్యాడ్ లేడీ. ఆమెను అరెస్టు చేసింది విజయవాడ పోలీసులు. ఇది లోకల్ పోలీసులకు సంబంధించిన కేసు. నన్ను ఎందుకు అరెస్టు చేశారు" అని ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. వాంగ్మూలంపై సంతకం చేసేందుకు నిరాకరించినట్లు తెలిసింది.

ఏపీలో 'గ్లాడియేటర్' పాలన : వైఎస్ జగన్

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో 'గ్లాడియేటర్' పాలన సాగుతోంది. చరిత్రలో తొలిసారిగా 'ఒక' మనిషిని ఇబ్బంది పెట్టేందుకు, ఇరికించేందుకు దొంగ సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్‌ఆర్ ఆంజనేయులును అరెస్టు చేయడం దానికి పరాకాష్ఠ" అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అన్నారు. తాడేపల్లిలో మంగళవారం జగన్ అధ్యక్షతన ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. "కూటమి వైసీపీ మీద బురద జల్లుతోంది. దుర్మార్గంగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. రోమన్ రాజుల కాలంలో గ్లాడియేటర్‌లను(మల్లయోధులు/కత్తిసాము చేసేవారు) వదిలి మనుషులను చంపుకొనే పోటీలను పెట్టేవారు. అదే తరహాలో భయాన్ని సృష్టించేందుకే చంద్రబాబు ప్రభుత్వం యత్నిస్తోంది' అని అన్నారు.

లిక్కర్ స్కామ్ దొంగల బట్టలు సగమే విప్పారు

- మిగతావీ విప్పేందుకు పూర్తిగా సహకరిస్తా
- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ దొంగల బట్టలు (సిట్ అధికారులు) సగమే విప్పారని .. మిగతా బట్టలు విప్పేందుకు తాను పూర్తిగా సహకరిస్తానని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. లిక్కర్ స్కామ్‌లో తనది విజిల్ బ్లోయర్ పాత్ర అని తెలిపారు. దొరికిన దొంగలు .. దొరకని దొంగలు..ఇద్దరూ తన పేరును ఈ వ్యవహారంలో బయటకు లాగుతున్నారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. మద్యం వ్యవహారంలో రూపాయి కూడా తాను ముట్టలేదని విజయసాయి తెలిపారు. కాగా, లిక్కర్ కేసును విచారిస్తున్న సిట్ ముందు హాజరయిన తర్వాత విజయసాయిరెడ్డి ఒక్కసారిగా జోరు పెంచారు. ఇంత కాలం కోటరీవల్లే తాను జగన్‌ను వీడానంటూ చెబుతూ వచ్చిన ఆయన, తన దిశను పూర్తిగా మార్చారు. తాను రాజకీయాలు వీడి వ్యవసాయం చేసుకుంటానని చేసిన ప్రకటనను కూడా జగన్ మీడియా కించపరచేలా వ్యాఖ్యానాలు చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను వ్యక్తిగతంగా అవహేస్యం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. లిక్కర్ స్కామ్‌లోని లోగుట్టును 'సిట్' ముందు విప్పేస్తానంటూ మంగళవారంనాటి ట్వీట్ ద్వారా ఆయన చెప్పకనే చెప్పేశారు. దీంతో.. కసిరెడ్డి రాజశేఖర రెడ్డి అరెస్టుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న 'తాడేపల్లి ప్యాలెస్'కు విజయసాయిరెడ్డి తీరు మరింత ఆందోళనకు గురిచేసిందని చెబుతున్నారు. కాగా, ఇటీవల వరుసగా విజయసాయిరెడ్డి చేస్తున్న ట్వీట్‌లకు జగన్ లక్ష్యంగా మారారని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. లిక్కర్ స్కామ్‌లో మిగతా బట్టలు విప్పేందుకు పూర్తిగా సహకరిస్తానని ఆయన అనడాన్ని.. బట్టలూడదీయిస్తానంటూ ఇటీవల జగన్ చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటర్‌గానే పలువురు భావిస్తున్నారు.

నేడే హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నిక

ఉదయం 8 గంటల నుంచి పోలింగ్.. మొదటి ప్రాధాన్య ఓటు వేస్తేనే చెల్లుబాటు

- పోస్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశాం
- రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి
- బీఆర్‌ఎస్‌పై ఈసీకి ఎఫ్‌జీజీ ఫిర్యాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక మంగళవారం జరగనుంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యుల కోసం బల్దియా ప్రధాన కార్యాలయంలోని భవన నిర్వహణ విభాగం గదిలో, 81 మంది కార్పొరేటర్ల కోసం లైబ్రరీ హాల్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన దృష్ట్యా.. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అందుకే కేంద్ర కార్యాలయ ఉద్యోగులకు సెలవు ఇచ్చామని పేర్కొన్నారు. దీనికి బదులుగా జూన్ 14 రెండో శనివారం పని దినంగా పరిగణిస్తామని ప్రకటించారు. మంగళవారం జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో) మంగతాయారుతో కలిసి ఎన్నికల ఏర్పాట్లను అనురాగ్ జయంతి వివరించారు. పోలింగ్‌లో మొదటి ప్రాధాన్య ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటవుతుందని తెలిపారు. పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఒక ఓటు ఎక్కువ పొందినవారు విజేతగా నిలుస్తారని చెప్పారు. బీజేపీకి ఓటు వేయకుంటే హిందువులు మిమ్మల్ని క్షమించరంటూ ఓటర్లనుద్దేశించి పలు ప్రాంతాల్లో అంటించిన పోస్టర్లను తొలగించామని తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, ఓటింగ్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు పాల్గొనవద్దంటూ ఆ పార్టీ అధిష్ఠానం ఆదేశించిన నేపథ్యంలో వారు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఇలా ఆదేశించిన బీఆర్ఎస్‌పై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఫిర్యాదు చేసింది. ఇక కాంగ్రెస్‌కు సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఉదయం ఆ పార్టీ ఓటర్లతో సమావేశమై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

జగన్ చెప్పారు.. నేను చేశాను!

- మద్యం ముడుపుల డబ్బులు

జగన్ ఓఎస్డీకే ఇచ్చాం!: రాజ్ కసిరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): "జగన్ ఆదేశించారు. నేను ఆచరించాను. మిథున్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, విజయసాయి రెడ్డి, వాసుదేవ రెడ్డి కలిసి మద్యం ముడుపుల పథకాన్ని రచించాం. జగన్ కార్యదర్శిగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు పలువురికి ఇందులో పాత్ర ఉంది" అని లిక్కర్ స్కామ్ సూత్రధారి రాజ్ కసిరెడ్డి అలియాస్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంగీకరించినట్లు 'సిట్' వెల్లడించింది. రాజ్ కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడించింది. ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ఆయనను ప్రశ్నించామని... నేరం, దాని వెనుక ఉన్న కుట్ర, ఇతరుల భాగస్వామ్యంపై అన్ని అంశాలు అంగీకరించిన రాజ్ కసిరెడ్డి, చివరికి నేరాంగీకరపత్రంపై సంతకం చేసేందుకు నిరాకరించారని 'సిట్' పేర్కొంది. రిమాండ్ రిపోర్టులో ఏముందంటే...

జగన్ చెబితేనే చేశా...

ప్రభుత్వానికి, పార్టీకి బాగా నిధులు వచ్చేలా మద్యం పాలసీపై వర్క్‌వుట్ చేసే బాధ్యతను అప్పటి సీఎం జగన్ నాకు అప్పగించారు. దీంతో... బేవరేజెస్ కార్పొరేషనే లిక్కర్ షాపులు ఏర్పాటు చేసి మద్యం వ్యాపారం చేసేలా కొత్త పాలసీని రూపొందించాం. ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి... తొలుత బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా, ఆ తర్వాత బేవరేజెస్, డిస్టిలరీస్ కమిషనర్‌గా నియమించారు. మద్యం వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకునేందుకు రూపొందించిన మా ప్లాన్‌ను అమలు చేసే బాధ్యతను అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న సత్యప్రసాద్‌కు అప్పగించాం. మద్యం ముడుపుల కుట్రకు 2019 అక్టోబరు 13న విజయసాయి ఇంట్లోనే కీలక భేటీ జరిగింది. విజయ సాయిరెడ్డి, పి.మిథున్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, మద్యం ప్రత్యేక అధికారి సత్యప్రసాద్ భేటీ అయ్యాం. మద్యం ఉత్పత్తి దారులు, డిస్టిలరీస్ నుంచి నెలకు కనీసం 50-60 కోట్లు ముడుపులు వచ్చేలా స్కీమ్ రూపొందించాం. 2019 డిసెంబరులో నేను, మిథున్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, బేవరేజెస్ ఎండీ వాసుదేవరెడ్డి సమావేశమయ్యాం. మద్యం సీసా బేసిక్ ధర ఆధారంగానే మాకు ఉత్పత్తిదారులనుంచి ముడుపులు వచ్చేలా ఫిక్స్ చేశాం. చీప్ లిక్కర్ బ్రాండ్‌లు సదరన్ బ్లూ, 9 హార్సెస్, ఆంధ్రా గోల్డ్, హెచ్‌డీ విస్కీలపై కేసుకు రూ.150 ముడుపులు చెల్లించేలా ఫిక్స్ చేశాం. దారుహౌజ్, రాయల్ ప్యాలెస్, బ్రిలియెంట్ బ్లెండ్‌ల నుంచి ఒక్కో కేసుకు 220, మ్యాన్షన్ హౌస్, రాయల్‌స్టాగ్ నుంచి ఒక్కో కేసుకు 350... ప్రీమియం బ్రాండ్లు అయిన టీచర్స్, 100 పైపర్స్ వంటి వాటిపై ఒక్కో కేసుకు రూ.600 చొప్పున ముడుపులు వసూలు చేయాలని నిర్ణయించాం.

డబ్బులు జగన్ ఓఎస్‌డీకే ఇచ్చాం

మేం నిర్ణయించిన మద్యం ముడుపుల ప్రకారం ప్రతి నెలా కనీసం రూ.50-60 కోట్లు వచ్చేవి. మద్యం బ్రాండ్ల సరఫరా, ప్రభుత్వ షాపుల్లో లిక్కర్ అమ్మకాలపై ప్రతి నెలా మాకు డేటా వచ్చేది. ఇందుకోసం అనూష, సైఫ్ అనే ఉద్యోగులను ఉపయోగించుకున్నాం. కంపెనీలు ముడుపుల సొమ్ము ఇచ్చాక... అవి నా దగ్గరకు చేరేవి. నేను ఆ డబ్బును తిరిగి ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీకి పంపించే వాడిని.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కశ్మీర్‌లో మళ్లీ ఉగ్రభూతం

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిలో 28 మంది పర్యాటకులు మృతిచెందడం అత్యంత విషాదకరమైనది. ఈ దారుణం జరిగిన బైసరన్ ప్రాంతాన్ని దాని ప్రకృతి సౌందర్యం కారణంగా మినీస్విట్జర్లాండ్ అని పిలుచుకుంటారు. అతికష్టంమీద చేరగలిగే ఈ ప్రదేశంలో పర్యాటకులంతా ఆహ్లాదంగా ఉన్న స్థితిలో ఉగ్రవాదులు విరుచుకుపడి ఈ మారణకాండకు ఒడిగట్టారు. తీవ్రంగా గాయపడినవారి సంఖ్య ఇరవై వరకూ ఉండవచ్చునని అంటున్నారు. రక్తపు మడుగులో పడివున్న తమవారిని రక్షించాలంటూ బంధువులు విజ్ఞప్తులు చేస్తున్న దృశ్యాలు మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. హనీమూన్ వచ్చిన నవదంపతుల్లో ఒకరు ఈ దారుణానికి బలైపోయారు. ఆ ప్రాంతానికి వాహనాలు చేరడం కష్టంకావడంతో బాధితులను ఆదుకోవడంలోనూ జాప్యం జరిగింది. అంబులెన్సుల్లోనూ, హెలికాప్టర్లలోనూ బాధితులను తరలించేలోగా, స్థానికులు కూడా కొందరిని గుర్రాలమీద ఆస్పత్రులకు చేర్చారట. ఈ ఊచకోతకు పాల్పడింది తానేనని రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే ఉగ్ర సంస్థ ప్రకటించుకుంది. పాక్ కేంద్రంగా పనిచేసే లష్కర్–ఎ–తోయిబా అనుబంధ సంస్థ ఇది. 2019 పుల్వామా ఘటన తరువాత, లోయలో జరిగిన అతిపెద్ద ఉగ్రదాడి ఇదే.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి తదితర పెద్దలంతా ఈ దారుణాన్ని ఖండించారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కూడా ఈ ఘోరంమీద విచారం ప్రకటించారు. జులై 3నుంచి దాదాపు నలభైరోజులుపాటు సాగే అమర్‌నాథ్ యాత్రలో ఈ మార్గం కూడా ఉన్నందున, గతంలో అమర్‌నాథ్ యాత్రికులపై ఇదేతరహాలో ఉగ్రవాదులు దాడిచేసిన ఘటన అందరికీ గుర్తుకువస్తున్నది. స్థానికులను సైతం ఈ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. వివిధ ప్రాంతాల్లో స్థానికులు కొవ్వొత్తుల ప్రదర్శనలు జరిపినట్టు వార్తలు వస్తున్నాయి. వేర్వేరు రాష్ట్రాలకు, విభిన్న రంగాలకు చెందినవారు ఈ ఘోరంలో ప్రాణాలు పోగొట్టుకున్నందువల్ల ఈ విషాదం దేశమంతా విస్తరించింది.

పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కోసం పనిచేస్తున్న ఈ ఉగ్ర సంస్థ పర్యాటకాన్ని, తద్వారా వస్తున్న ఆదాయాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడికి తెగబడింది. గత ముప్పైయేళ్ళలో ఎరగనివిధంగా ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే ఐదులక్షలమంది పర్యాటకులు ఈ కేంద్రపాలిత ప్రాంతానికి వచ్చారు. ప్రత్యేకప్రతిపత్తి రద్దు తరువాత రేగిన ఆగ్రహావేశాలు, అశాంతి తగ్గుముఖం పట్టి, కశ్మీర్‌లో పరిస్థితులు గాడిన పడడం, గత ఏడాది శాంతియుతంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకోవడం పొరుగు దేశానికీ, అది పోషిస్తున్న ఉగ్రసంస్థలకు కంటకింపుగా ఉంది. ఉపాధి కోసం వచ్చిన స్థానికేతరులమీద ఉగ్రవాదులు దాడులు చేసి కొందరిని చంపివేసిన ఘటనలు గతంలో లేకపోలేదు. కానీ, పర్యాటకులను ఊచకోతకోయడం ద్వారా దేశమంతటికీ ఒక హెచ్చరిక సందేశాన్ని పంపాలని, కశ్మీర్‌లో అడుగుపెట్టడానికి దేశవిదేశీయులంతా భయపడేట్టు చేయాలన్నది ఉగ్రవాదుల లక్ష్యంగా కనిపిస్తోంది.

కశ్మీర్‌లో శాంతికి పాకిస్థాన్ ప్రబలశత్రువని మరోమారు రుజువైంది. పలుసమస్యలు, కల్లోలాలతో తీసుకుంటున్న దేశాన్ని గాడినపెట్టలేని అక్కడి పాలకులు మళ్ళీ గతంలో మాదిరిగా కశ్మీర్ మీద విషం కక్కడం ఆరంభించారు. ఇటీవల జరిగిన ప్రవాస పాకిస్తానీ సదస్సులో షరీఫ్ సోదరులు, ఇతర ప్రముఖుల సమక్షంలో పాక్ ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలకు, ఇప్పటి ఘాతుకానికీ సంబంధం ఉన్నదని విశ్లేషకుల అభిప్రాయం. పాలనలో, నిర్ణయాల్లో పాకిస్థాన్ సైన్యానిదే పైచేయి అని ఆయన మాటలకు అర్థం. సైన్యానికి అల్లాహ్ అప్పగించిన కొన్ని కర్తవ్యాలు ఉన్నాయన్నారు. కశ్మీర్ గురించి జిన్నా గతంలో చేసిన వ్యాఖ్యలను మళ్ళీ గుర్తుచేశారు. కశ్మీర్‌మీద ఎన్నటికీ ఆశచావదు, అది మా జీవనాడి, ఏ శక్తీ దానిని మా నుంచి వేరుచేయలేదు అన్నాడాయన. భారత్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కశ్మీరీ సోదరులను మరిచిపోబోమని అన్నారు. హిందువులు, ముస్లింలు, భారతదేశం, బలూచిస్తాన్, ద్విజాతి సిద్ధాంతం ఇత్యాది చాలా విషయాలు స్పృశించాడాయన. మునీర్ వ్యాఖ్యల మీద భారత ప్రభుత్వంతో పాటు వివిధ పార్టీల నాయకులు కూడా స్పందించారు. గాడినపడుతోందనుకుంటున్న కశ్మీర్‌లో మళ్ళీ అగ్గిరాజేసేందుకు విశేష ప్రయత్నాలు జరుగుతున్నాయని పహల్గాం ఘటన హెచ్చరిస్తోంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, సయోధ్యతో, సమష్టిగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

శాంతి చర్చలు జరగాలి

రాజ్యాధికారమే లక్ష్యమని, అందుకు దీర్ఘకాలిక సాయుధ పోరాటమే ఏకైక మార్గమని ప్రకటించిన మావోయిస్టులు... కారణాలు ఏమైనా కావచ్చు, కాల్పులు విరమించి ప్రభుత్వాలతో చర్చలకు సిద్ధం కావడం అసాధారణ విషయమే. రెండుమూడు రోజులకొకసారి ఇరవై, ముప్పై మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో చనిపోతున్న వార్తలు ఈ మధ్య సర్వసాధారణమైపోయాయి. దానికి ప్రతిగా మందుపాతరలు పెట్టి పోలీసులను, ఇన్ఫర్మేషన్ ఇచ్చారనే పేరిట గిరిజనులను, దళితులను మావోయిస్టులు చంపడమూ చూస్తూనే ఉన్నాం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్చి 2026 నాటికి మావోయిస్టులందరినీ ఏరిపారేస్తామని తరచుగా ప్రకటనలు చేస్తున్నారు. రాబోయే సంవత్సర కాలంలో మరెన్ని భయానక పరిణామాలు చూడాల్సి వస్తుందోనని ఆందోళనపడుతున్న సమయాన శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టుల ప్రకటన అందరికీ ఊరట కలిగించింది. కేంద్ర ఆంక్షలు పెడుతోంది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది కానీ ఇది ఏదో ఒక రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు కాబట్టి కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని విశాల దృక్పథంతో వ్యవహరించి, శాంతి చర్చలను సఫలీకృతం చేయాలి.

దశాబ్దాలుగా జరుగుతున్న నక్సలైట్ల ఉద్యమ ఫలితంగా వేలాది నక్సలైట్లు చనిపోయారు. వందలాది పోలీసులు చనిపోయారు. అయితే ఈ ఉద్యమంలో అత్యధికంగా నష్టపోతున్నది అడవి బిడ్డలైన గిరిజనులే. నక్సలైట్లకు సహకరిస్తున్నారని పోలీసులు, పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇస్తున్నారని నక్సలైట్లు... గిరిజనులను చంపడం ఆనవాయితీగా మారింది. అత్యంత పేదరికాన్ని అనుభవిస్తూ, పనులు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులు నిత్యం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణంలో దినదిన గండంగా బతకాల్సి వస్తోంది. అసలే విద్యా, వైద్య వసతి, రహదారులు వంటి మౌలిక వసతులులేవు. వాటిని అడిగినా అణచివేసే పరిస్థితే ఉంటోంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలని సగటు గిరిజనులు కోరుకుంటున్నారు. శాంతి చర్చలు సాఫీగా జరిగి, మావోయిస్టులు కాల్పులు విరమించి, అజ్ఞాతాన్ని వీడి, ప్రజా ప్రవంతిలోకి రావాలని పౌర సమాజం కోరుకుంటోంది.

మావోయిస్టులు, వారికి మద్దతిస్తున్న గిరిజనులంతా ప్రభుత్వాలు నిర్మూలించాల్సిన శత్రువులన్నట్లుగా చేస్తున్న కేంద్ర హోంమంత్రి ప్రకటనలు సరైనవి కావు. మావోయిస్టులను అణచటం కోసం వేలాది భద్రతా దళాలను సంవత్సరాల తరబడి దండకారణ్యంలో ఉంచాల్సి రావడం, మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల పేరిట అమాయక గిరిజనులను చంపడం, ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేవి తప్ప, పెంచేవి కావు. మావోయిస్టులు శాంతి చర్చలకు రావడాన్ని అందిపుచ్చుకొని, చిత్తశుద్ధితో ఆహ్వానించి, సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రతినిధులు సమావేశం కావాలి. చర్చలు సామరస్యంగా జరిగి, సమస్య పరిష్కారం కావాలని ఆశిద్దాం.

– జి. రాములు
గౌరవ అధ్యక్షులు, తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం

వ్యవస్థలు కాదు, రాజ్యాంగమే సర్వోన్నతం



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

వ్యవస్థలు పరస్పరం గౌరవం కోల్పోయి ఒక దానిపై మరొకటి దాడి చేస్తే దేశంలో అరాచక పరిస్థితి నెలకొంటుందనడంలో సందేహం లేదు. వ్యవస్థలు బలహీనపడితే వర్తమానంలో ప్రయోజనాలు లభిస్తాయని భావించేవారుంటారు కాని దీనివల్ల దీర్ఘకాలికంగా దేశం నష్టపోతుందని వివేకవంతులు గ్రహిస్తారు. ఇవాళ దేశంలో సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్ విచక్షణాధికారాల్ని ప్రశ్నిస్తోంది. రెండవ ఉన్నత రాజ్యాంగాధినేత అయిన ఉపరాష్ట్రపతి సర్వోన్నత న్యాయస్థానాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అధికార పార్టీ ఎంపీ ఒకరు మరింత ముందుకుపోయి దేశంలో ప్రజల మధ్య యుద్ధాల్ని ప్రేరేపిస్తున్నారని ప్రధాన న్యాయమూర్తినే నేరుగా ఆక్షేపించారు. ఆ ఎంపీపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకునేందుకు అనుమతినివ్వాలని అటార్నీ జనరల్‌ను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కోరింది. తమ పార్టీ ఎంపీ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి నిమిత్తం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అన్నారు కాని ఆ ప్రజా ప్రతినిధి నోటికి అడ్డుకట్ట వేసే చర్యలు మాత్రం తీసుకోలేదు!

అసలు దేశంలో ఏం జరుగుతోంది? వ్యవస్థల మధ్య సమన్వయం ఎందుకు ఏర్పడడం లేదు? వ్యవస్థల మధ్య సంఘర్షణాయుత వైఖరి ఏర్పడుతోందని చెప్పేందుకు ఈ ఉదంతాలు తోడ్పడుతున్నాయి. అందుకు కారణం ఎవరన్నది మాత్రం చర్చనీయాంశం. మూడేళ్ల క్రితం వరకూ గవర్నర్‌గా ఉన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖడ్, బీజేపీ ఎంపీ నిశికాంత దుబే ఎవరూ ప్రేరేపించకుండానే సర్వోన్నత న్యాయస్థానాన్ని, భారత ప్రధాన న్యాయమూర్తిని తీవ్రంగా విమర్శిస్తారా అన్న అనుమానాలకు మాత్రం ఆస్కారం ఉన్నది. ఈ దేశంలో న్యాయస్థానాలను విమర్శించేందుకు అనేక కారణాలు ఉండవచ్చు. న్యాయవ్యవస్థలో కూడా అవినీతి ఉండవచ్చు. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు, కోర్టుల్లో విచారణ జరుగుతున్న తీరు, వాయిదాలు, ఆలస్యాలు ప్రశ్నార్థకం కావచ్చు. కాని న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టవల్సిన బాధ్యత మాత్రం అందరిపై ఉన్నది. ఎందుకంటే జరుగుతున్న పరిణామాలపై అంతిమంగా తీర్పు చెప్పవల్సింది మాత్రం న్యాయవ్యవస్థే. ఈ దేశంలో అనేకసార్లు ప్రభుత్వాలు పాల్పడిన అరాచకాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడిన ఘనత న్యాయ వ్యవస్థదే అన్నది స్పష్టం. అందువల్ల న్యాయ వ్యవస్థ తన్ను తాను మెరుగుపరుచుకునేందుకు తోడ్పడుతూ, అదే సమయంలో తన తప్పులు కూడా సవరించుకోవాల్సిన బాధ్యత చట్టసభలు, కార్యనిర్వాహక వర్గానికి మాత్రమే ఉన్నది.

ఈ దేశంలో గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగపరుస్తున్నారని వస్తున్న విమర్శలు కొత్తవి కావు. కాంగ్రెస్ హయాంలో ఈ వ్యవస్థ అమితంగా దుర్వినియోగమయింది. రామ్‌లాల్, కుముద్‌బెన్ జోషీ, రమేశ్ భండారీ లాంటి వారు వ్యవహరించిన తీరు చరిత్రలో నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టేందుకు గవర్నర్లను కాంగ్రెస్ ఉపయోగించుకున్న ఉదంతాలు ఎన్నో కదా. యూపీఏ ప్రభుత్వ హయాంలో బిహార్‌లో నితీశ్ కుమార్‌కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నప్పటికీ అప్పటి గవర్నర్ బూటాసింగ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. మన్మోహన్ సింగ్ మంత్రివర్గం ఈ సిఫారసును ఆమోదించింది. రాష్ట్రపతి పాలన ఆదేశాలపై సంతకాలు చేసే పత్రాలను రష్యా పర్యటనలో ఉన్న రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు పంపించి నడిరాత్రి సంతకాలు చేయించారు. సుప్రీంకోర్టు రాష్ట్రపతి పాలనను రద్దుచేసి నితీశ్ కుమార్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీనితో బూటాసింగ్ తన గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఇక్కడ గవర్నర్, రాష్ట్రపతి రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను దుర్వినియోగం చేసినట్టా కాదా? సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకపోతే ఏమయి ఉండేది? బూటాసింగ్ తర్వాత బిహార్ గవర్నర్‌గా ఉన్న గోపాలకృష్ణ గాంధీ, నితీశ్ ప్రభుత్వం ఎడా పెడా జారీ చేసిన అనేక ఆర్డినెన్స్‌లను నిలిపివేశారు. నితీశ్ కుమార్ చాలా సందర్భాల్లో తన తప్పుల్ని గ్రహించి సరిదిద్దుకున్నారు. గోపాలకృష్ణ గాంధీ మహాత్మాగాంధీ మనుమడు.

ఇదే గోపాలకృష్ణ గాంధీ పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు 2007లో నందిగ్రామ్‌లో తీవ్ర హింసాకాండ జరిగింది. పారిశ్రామిక ప్రయోజనాలకోసం సంకల్పించిన భూసేకరణను గ్రామస్తులు వ్యతిరేకించారు. పోలీసులే కాదు, సీపీఐ(ఎం) కార్యకర్తలు కూడా గ్రామస్తులపై హింసాకాండకు పాల్పడ్డారు. దీనిపై గవర్నర్ ఈ హింసాకాండపై ఆందోళన ప్రకటిస్తూ పత్రికా ప్రకటన చేయాల్సి వచ్చింది. సమస్య పరిష్కరించే పద్ధతి ఇది కాదని ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు గవర్నర్ సూచించారు. మహాశ్వేతాదేవి వంటి గొప్ప రచయిత్రి గవర్నర్‌కు ఫోన్ చేసి 'ఏదైనా చేయండి ప్లీజ్' అని అభ్యర్థించారు. గోపాలకృష్ణ గాంధీ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఇంటికి స్వయంగా వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకురావల్సిందిగా కోరారు. అప్పుడు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వానికి సీపీఐ(ఎం) మద్దతునిస్తోంది. 'కావాలంటే నన్ను తీసేయమని చెప్పండి' అని గోపాలకృష్ణ గాంధీ ముఖ్యమంత్రికి చెప్పారు. 'నేను అలాంటి వ్యక్తిని కాదు' అని బుద్ధదేవ్ భట్టాచార్య అన్నారు. ప్రధాని మన్మోహన్ సింగ్ బుద్ధదేవ్‌కు ఫోన్ చేసి 'మీకు గోపాలకృష్ణ గాంధీ కంటే మంచి గవర్నర్ దొరకడు. ఆయన ఆందోళనను అర్థం చేసుకోండి..' అని నచ్చజెప్పారు. చివరకు పరిస్థితి సద్దుమణిగింది. నందిగ్రామ్‌లో జరిగిన హింసాకాండ రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టు కూడా తీర్పునిచ్చింది. ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు చర్యలను తొలుత గవర్నర్, తర్వాత హైకోర్టు సరిదిద్దింది. గ్రామీణులకు అనుకూలంగా మాట్లాడి, హింసాకాండను అరికట్టిన గోపాలకృష్ణ గాంధీ లాంటి గవర్నర్‌లు ఇప్పుడు ఎంత మంది ఉన్నారు?

గవర్నర్ పదవిలో ఉన్న వ్యక్తి ప్రభుత్వం– ప్రతిపక్షానికీ మధ్య నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నట్లు కనపడాలి. యూపీఏ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ హయాంలో అన్ని వ్యవస్థలతో సహా గవర్నర్ వ్యవస్థను కూడా సరిదిద్దేందుకు నరేంద్రమోదీకి అవకాశం లభించింది. కాని ఆయన వ్యవస్థలను మెరుగుపరచడంలో ఆసక్తి చూపలేదు. అదే సమయంలో కాంగ్రెస్ దారిలోనే ఆ వ్యవస్థలను తనకు అనుకూలంగా ఉపయోగించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. ఎవరన్నా ప్రశ్నిస్తే గతంలో జరగలేదా అని నిలదీసేందుకు ఆస్కారం ఉన్నదని ఆయనకు తెలుసు. 'రాజకీయాల్లో సరైనది న్యాయవ్యవస్థకు సరైనదని అనిపించకపోవచ్చు' అని కాంగ్రెస్ నేతలు భావించేవారు. ప్రస్తుత ప్రభుత్వమూ అదే దారిలో నడుస్తోంది.



అసలు పార్లమెంట్, సుప్రీంకోర్టుల్లో ఏది గొప్ప అన్న చర్చ ఎందుకు తలెత్తుతోంది? చట్టసభలు, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ఈ మూడింటికీ రాజ్యాంగం వేర్వేరు అధికారాలను ఇచ్చింది. అవి తమ తమ పరిధుల్లో రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని కాపాడుతూ పనిచేయాల్సిందే.. వ్యవస్థల్ని గౌరవిస్తున్నారా లేదా అన్నది ప్రశ్న కాదు. రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నారా అన్నదే ప్రధానం. రాజ్యాంగ గౌరవాన్ని కాపాడితే అన్నీ సర్దుకుంటాయి.

న్యాయవ్యవస్థే చట్టాలు చేస్తే పార్లమెంట్ ఎందుకు.. ప్రభుత్వాన్ని వారే నడుపుకోవచ్చు కదా అని కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే పార్లమెంట్ నిజంగా చట్టాలు చేస్తోందా.. ప్రభుత్వాన్ని అడ్డుకుంటుందా అన్న విషయం చర్చించాల్సి ఉన్నది. అసలు పార్లమెంట్, సుప్రీంకోర్టుల్లో ఏది గొప్ప వ్యవస్థ అన్న చర్చ ఎందుకు తలెత్తుతోంది? చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఈ మూడింటికీ రాజ్యాంగం వేర్వేరు అధికారాలను ఇచ్చింది. ప్రతి ఒక్క వ్యవస్థ బాధ్యతలను నిర్దేశించింది. అవి తమ తమ పరిధుల్లో రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని కాపాడుతూ పనిచేయాల్సిందే.. ఈ మూడు వ్యవస్థలను నిర్దేశించే రాజ్యాంగమే అన్నిటికన్నా గొప్పది అని చెప్పక తప్పదు.

రెండేళ్ల క్రితం పంజాబ్‌లో గవర్నర్ అసెంబ్లీనే సమావేశపరిచేందుకు నిరాకరించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో ఆయన సభను సమావేశపరిచారు. ఆ తర్వాత మనీ బిల్లులతో సహా ఏడు బిల్లులను ఆమోదించకుండా తన వద్దే ఉంచుకున్నారు. దానిపై ప్రభుత్వం ఆర్టికల్ 32 క్రింద మళ్లీ కోర్టుకు వెళ్లింది. రాజ్యాంగంలోని అధికరణ 200 క్రింద గవర్నర్ బిల్లులను తన వద్ద ఉంచుకోవడానికి వీల్లేదని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తీర్పునిచ్చారు. తాజాగా తమిళనాడు గవర్నర్ విషయంలో కూడా సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ వ్యవహరించలేదు. గవర్నర్ తన వద్ద బిల్లులను ఇష్టం వచ్చినంతకాలం ఉంచుకునేందుకు వీలు లేదని స్పష్టం చేసింది. నిర్దిష్ట కాలపరిమితి లోపు వాటిపై నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. నిజానికి గతంలో దాదాపు మూడేళ్ల పాటు బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచిన ఉదంతాలు లేనే లేవు. సుప్రీంకోర్టును ప్రశ్నిస్తున్నవారు అసలీ పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఎందుకు ప్రశ్నించడం లేదు? రాష్ట్రపతిని కూడా సుప్రీం నిర్దేశిస్తుందని విమర్శిస్తున్నారు కాని రాష్ట్రపతి అనే వ్యక్తి కేంద్ర మంత్రివర్గ సిఫారసులకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందన్న విషయం వారు మరిచిపోతున్నారు. రాష్ట్రపతి పదవి వివాదంలో పడుతున్నదంటే అందుకు కారణం ఆయనను నిర్దేశించే కేంద్ర ప్రభుత్వానిదే కారణం. బూటాసింగ్ బిహార్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సిఫారసు చేసినప్పుడు ఉన్నతమైన వ్యక్తి అని ఎందరో భావించే అబ్దుల్ కలామ్ కూడా వివాదంలో పడ్డారు.

ప్రభుత్వంతో న్యాయవ్యవస్థకు సుహృద్భావ సంబంధాలు ఉండాలని దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్యతో అన్నారు. 'సుహృద్భావ సంబంధాలు అవసరం లేదు, సరైన సంబంధాలు ఉంటే చాలు' అని సీజేఐ జవాబిచ్చారు. ప్రభుత్వం, న్యాయవ్యవస్థల మధ్య సరైన సంబంధాలు ఉంటే బండి సక్రమంగా నడుస్తుంది. కాని న్యాయవ్యవస్థను తన దారికి అడ్డంగా తొలగించుకోవాలని ప్రభుత్వం భావిస్తే అది వేరే సంగతి. గతంలో ఇందిరాగాంధీ అలాంటి పని చేసి చరిత్రలో నియంతగా నిలిచిపోయారు. వ్యవస్థల్ని గౌరవిస్తున్నారా లేదా అన్నది ప్రశ్న కాదు. రాజ్యాంగాన్ని అయినా గౌరవిస్తున్నారా అన్నదే ప్రధానం. రాజ్యాంగ గౌరవాన్ని కాపాడితే అన్నీ సర్దుకుంటాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

డీలిమిటేషన్.. సమన్యాయం కావాలి!

రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, 170 ప్రకారం పార్లమెంట్‌లోని సభ్యుల సంఖ్య జనాభాను అనుసరించి ఉండాలి! జనాభా ముఖ్య ప్రాతిపదిక అయినప్పుడు రాష్ట్రాలలోని ఎంపీ సీట్ల విషయంలో హెచ్చు తగ్గులు ఉంటాయి. ఇదే ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో పెద్ద సమస్యగా మారింది.

దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాల నిర్ణయానుసారం కుటుంబ నియంత్రణ అమలు చేయడంల్ల లోక్‌సభ, శాసనసభల్లో దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గుతూ వచ్చాయి. మంచి చేసినందుకుగాను మాకు నష్టం వాటిల్లే రీతిలో డీలిమిటేషన్ నిర్ణయాలు జరిగాయని దక్షిణాది రాష్ట్రాల ప్రజలు వాపోతున్నారు. దేశ నిర్ణయాలలో తమ పాత్ర, జోక్యం క్రమేపీ తగ్గిపోతున్నాయని, ఈ ప్రాతిపదిక మూలాలను వారు ప్రశ్నిస్తున్నారు.



భారత ఎన్నికల సంఘం ఇచ్చిన సమాచారం ప్రకారం మొదటి సార్వత్రిక ఎన్నికలలో (1951–52) 489 (లోక్‌సభ) సీట్లు ఉన్నాయి. 1951 నుంచి 2004లో జరిగిన పెంపునకు (డీలిమిటేషన్ కమిషన్ నిర్ణయానుసారం) ప్రత్యేక ఫార్ములాగా ఐడియల్ జనాభా సంఖ్య అంటూ అనుసరించినట్లు లేదు. జనాభా ప్రాతిపదికన నిర్ణయాలు చేసినప్పుడు రాజకీయ సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు.

ఇదే విధంగా డీలిమిటేషన్‌ను సంస్కరిస్తే శాశ్వతంగా దక్షిణాది ప్రాంతాల వారికి గణనీయమైన నాయకత్వం, రాజకీయ పలుకుబడి–ప్రాముఖ్యత కేంద్రంలో ఉండకపోవచ్చనే వాదనను కూడా సహేతుకంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాధాకృష్ణన్, నీలం సంజీవరెడ్డి, వి.వి. గిరి, కె.ఆర్. నారాయణన్ వంటి వారు రాష్ట్రపతులుగా, పీవీ నర్సింహారావు, దేవెగౌడ వంటి వారు ప్రధాన మంత్రులుగా అయ్యారు. డీలిమిటేషన్– జనాభా ప్రాతిపదిక మీదనే కొనసాగితే ఇక అలాంటి అవకాశం ఉండకపోవచ్చు!

నిజమైన గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్ (జీడీపీ) ఏ విధంగానైతే ద్రవ్యోల్బణం ఆధారంగా (ఇన్‌ఫ్లేషన్) నిర్ణయించి, అన్ని రాష్ట్రాలకు లాభం కలిగిస్తారో; అదే విధమైన రీతిలో ఎక్కువ జనాభా ఉన్నా, అన్ని రాష్ట్రాలకు సంఖ్యాపరంగా లోక్‌సభ, విధానసభలలో న్యాయం చేసే అంశంపై కూడా కేంద్రం లోతుగా సమీక్షించి నిర్ణయం తీసుకోవాలి. 1977లో లోక్‌సభ సీట్లు 10.10 లక్షల సరాసరి జనాభాను పరిగణనలోకి తీసుకొని 543 సీట్లు ఏ విధంగా నిర్ణయించారో, ఇప్పుడు కూడా ఆ సూత్రాన్నే అనుసరిస్తే 680 సీట్ల వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణుల అంచనా! టోటల్ ఫర్టిలిటీ రేట్ – రాష్ట్రాల పరంగా కూడా అందుబాటులో ఉంటుంది కాబట్టి, ఈ సూత్రాన్ని అనుసరించి కొంతవరకు అన్ని రాష్ట్రాలకూ న్యాయం చేయొచ్చు! ఇంకా ఇంతకంటే మంచి ఫార్ములాలు ఉంటే నిర్ణయాలు– అందరికీ సంతృప్తి కలిగించే విధంగా తీసుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే– ఎవర్నీ చిన్నచూపు చూడటం లేదన్న విశ్వాసం ప్రజల్లో కలుగుతుంది! ప్రజా విశ్వాసమే– ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ!

– రావులపాటి సీతారాంరావు

తెలుగుకు పట్టిన గ్రహణం

ఒకప్పుడు భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన దేశం భారతదేశం. సాహితీ సమాలోచనం, ప్రజ్ఞా ప్రాభవాలు, సామర్థ్య నిరూపణం, నైపుణ్యాలను ఒడిసి పట్టుకోవడం, విచక్షణా శక్తి, విమర్శనా జ్ఞానసంపత్తి, కార్యకారణ సంబంధమైన హేతుబద్ధ జ్ఞానం, ఆధ్యాత్మిక చింతనతో ప్రపంచ దేశాలలో మేటిగా నిలిచిన దేశం మనది. అటువంటి ఈ దేశానికి ఏమైంది? ఎటువైపు ప్రయాణిస్తున్నది? భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు గడిచినా ఒక నిర్దిష్ట పాలనా విధానం, విశిష్ట విద్యాపద్ధతి, విద్యార్థి శీలనిర్మాణం, సర్వాంగ సంపూర్ణ మూర్తిమత్వ నిర్దేశం, వైద్యవిధానం ఏదీ లేదు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులకు దోచుకోవడం, దాచుకోవడం ఎక్కువైపోయింది. నీతి, నియమం, నిబద్ధత, నియంత్రణ, క్రమశిక్షణ మృగ్యమైపోయాయి.

ఒక దేశ ఔన్నత్యానికి, ప్రాగల్భ ఉత్తేజాలకు, సాహిత్య సమారాధనకు, సంపత్తికి గీటురాయి భాష, భాషా సంపత్తి, వైదుష్యం. పదేండ్ల తెలంగాణ పాలన పటాపంచలయింది. తెలంగాణ యాసను భాషంటూ మతిభ్రమింపజేసి పబ్బం గడుపుకొని కాలం వెళ్లదీసుకుంది. కాంగ్రెస్ పాలన వచ్చినా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలతో అంటకాగి పరువు, ప్రతిష్ఠ లేకుండా అవే వాచకాలను కటింగ్, పేస్టింగ్ చేసి కొనసాగిస్తున్నారు. ఇది నీతి లేని చర్య, నియమం తప్పిన విధానం. విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించే పద్ధతి.

ప్రపంచ దేశాలన్నీ ఒద్దికగా హద్దులు గీసుకొని ఎవరి మాతృభాషను వారు కాపాడుకుంటూ విద్యా వ్యవస్థను పటిష్ఠపరచుకుంటున్నారు. అమెరికాలో కూడా ప్రవాస భారతీయులు తెలుగు పరిరక్షణ దిశగా 'మనబడి' కార్యక్రమాన్ని కొనసాగించి మంచి ఫలితాలను గ్రహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకొచ్చిన దరిద్రమేమిటి? ప్రత్యేకించి తెలంగాణకు పట్టిన గ్రహణమెప్పుడు వీడుతుంది? కన్నతల్లిని కాదని పిన్నమ్మకు బంగారు గాజులు చేయించినట్టు, ఇంటర్మీడియెట్ స్థాయిలో రెండవ భాషగా తెలుగును కాదని సంస్కృతాన్ని చేర్చడమేమిటి? మార్కులు మిన్న, నైపుణ్యాలు సున్న పద్ధతిలో విద్యాభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది? ఈ ఉపద్రవం నుంచి తెలుగుజాతి బయటపడి బట్టకడుతుందా? విజ్ఞులు ఆలోచించాలి.

– సరోజన బండ, వర్జీనియా, అమెరికా

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

భద్రత కరువవుతున్న విశ్వనగరం

హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని ముఖ్యమంత్రులు హామీలిస్తూనే ఉన్నారు. విశ్వనగరం సంగతి దేవుడెరుగు కాని, గుంతలూ, పిచ్చికుక్కలు, రోడ్ల ఆక్రమణలు, మనిషి నడవడానికి జాగాలేని ఫుట్‌పాత్‌లు, వర్షం వస్తే జలమయమయ్యే రోడ్లు మాత్రం హైదరాబాద్‌లో ఉన్నాయి.

మహానగరంలో మహాసమస్యల శీర్షికన ఇదే పత్రికలో ఇదే పేజీలో అయిదేళ్ల కింద ఇదే రచయిత వ్యాసం ప్రచురితమైంది. ఈ అయిదేళ్లలో పరిస్థితులు మారలేదు కాని, సమస్యలు పెరిగాయి. ప్రస్తుతం రాష్ట్రాన్ని, నగరాన్ని పట్టిపీడిస్తున్న విషయాలు చూద్దాం. చెప్పుకోవడానికి సిగ్గుచేటుగా ఉన్న సంఘటన ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ఈ విశ్వనగర సందర్శన కోసం ఆనందంగా వచ్చిన ఓ జర్మన్ యువతి ఇక్కడ తన శీలం పోగొట్టుకుంది. హైదరాబాద్‌లో ఏమేం చూడాలనుకుందో, ఎన్ని జ్ఞాపకాలను డైరీలో రాసుకుని జర్మనీలో తన మిత్రులతో పంచుకోవాలనుకుందో, ఎన్ని అద్భుతాలను తన కెమెరాలో ఎక్కించుకుని ఆల్బంలో దాచుకోవాలనుకుందో కాని ఓ కామాంధుని కోర్కెకు బలయింది. ఈ దారుణానికి ఒడిగట్టింది ప్రయాణికులు వంద శాతం నమ్మకం ఉంచే టాక్సీ డ్రైవరు.

హైదరాబాద్ రోజురోజుకీ నేర నగరంగా మారుతుందన్న దాఖలాలు అనేకం ఉన్నాయి. రాష్ట్ర పోలీసు శాఖ ఇటీవల విడుదల చేసిన నేరాల నివేదిక 2024 ఈ విషయాన్ని బలపరుస్తోంది. రాష్ట్రంలో గత సంవత్సరం డిసెంబర్ 31 నాటికి 2945 అత్యాచారాలు జరిగాయి. రాష్ట్రంలో స్త్రీల పట్ల జరిగిన నేరాలు 2023లో 19,013 అయితే, 2024లో 19,222కు పెరిగాయి. స్త్రీల పట్ల జరిగిన నేరాల్లో కేవలం అత్యాచారాలే 28.94 శాతం పెరిగాయి. ఇవికాక హాస్టళ్లలో ఆత్మహత్యలు, కాలేజీల్లో ర్యాగింగులు, ఉద్యోగంలో శోషణ, రోడ్ల వెంబడి వేధింపులు ఉన్నాయి. అసలు ఎటుపోతున్నాం మనం! వీటితో పాటు సైబర్ నేరాలూ పెరిగాయి. సైబర్ సెక్యూరిటీ బ్యూరో లెక్కల ప్రకారం 2020లో 17,571 నేరాలు జరిగితే, అవి 2024లో 25,184 అయ్యాయి. అంటే 43.33 శాతం నేరాలు పెరిగాయి. ఇదే లెక్కన 2024లో స్త్రీలు, యువతులను ఎత్తుకుపోతున్న కేసులు 26.92 శాతం పెరిగాయి. కట్నాల వేధింపులు 8,973; పోక్సో చట్టం కింద జీవితఖైదు పడ్డవాళ్లు డెబ్బై ఏడుగురు...

ఇలా నేరాలు పెరుగుడే కాని తరుగుడు కనిపించడం లేదు.

రాష్ట్రం మొత్తం మీద నేరాలు చూస్తే అవి కూడా పెరుగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ నేర రికార్డుల ప్రకారం 2020లో 1,19,863 నేరాలు జరిగాయి. అవి 2021 నాటికి 1,25,479కి, 2022లో 1,31,988, 2023లో 1,38,312కు పెరిగాయి. గత ఏడాది జరిగిన నేరాలు 1,69,477. ఈ లెక్కన 2020లో జరిగిన నేరాల కన్నా దాదాపు 42 శాతం ఎక్కువ నేరాలు 2024లో జరిగాయన్నమాట. ఇవన్నీ నమోదయిన నేరాలు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 320 సెక్షను కొన్ని నేరాలు కోర్టు అనుమతి లేకుండా రాజీపడేవిగా పేర్కొంది. ఇలాంటి వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే నేరాల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది.

ఈ నేరాలు ఇంతగా ఎందుకు జరుగుతున్నాయి? మనం ఎందుకు అరికట్టలేకపోతున్నాం. స్త్రీల పట్ల ఇన్ని నేరాలు జరగడానికి కారణాలేమిటి? ఆగ్రహావేశాలు, అత్యాచారాలు, వివాహేతర సంబంధాలు, ఆ సంబంధాలకు బానిసలై భర్తనూ లేదా భార్యనూ, పిల్లలనూ ఎందుకు చంపుతున్నారన్నది సభ్య సమాజంతో పాటు ప్రభుత్వం ఆలోచించాల్సిన విషయం. నిర్భయ కేసులో చట్టాన్ని మార్చి శిక్షాస్మృతులను బలపరిచాం. ఏమయింది? అత్యాచారం చేసే వారికి భయం కలగడం లేదు.



చట్టాలు బలంగా ఉన్నాయి. శిక్షలు కటువుగా ఉన్నాయి. అయినా నేరాలు ఇంతగా ఎందుకు జరుగుతున్నాయి? మనం ఎందుకు అరికట్టలేకపోతున్నాం? చట్టాల పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. నేరం చేస్తే శిక్ష ఈ విధంగా ఉంటుందన్న భయం ప్రజల్లో కలగాలి. అలాగే కేసులను త్వరగా పరిష్కరించాలి.

చట్టాలు బలంగా ఉన్నాయి. నేరాలకు శిక్షలు కటువుగా ఉన్నాయి. నేరస్తులను కటకటాల్లోకి నెట్టే పోలీసులున్నారు. నిందితులను శిక్షించే కోర్టులున్నాయి. అయినా ఖండాంతరాలు దాటి మన నగరాన్ని చూసి జ్ఞాపకాలు మూటకట్టుకుందామనుకున్న జర్మన్ యువతిపై అత్యాచారం ఎందుకు జరిగింది? దిశపై అత్యాచారం ఎందుకు జరిగింది? ఉరుకొండలో భర్తతో కలిసి దైవదర్శనానికి వెళ్లిన యువతిని అతని ముందే అత్యాచారం ఎందుకు చేశారు? పోక్సో చట్టం కిందకు వచ్చే నేరాలు అసలు ఎందుకు జరుగుతున్నాయి. నేరాలు చేయడానికి ధైర్యం ఎక్కడ నుంచి వస్తోంది? భయం ఎందుకు లేదు?

ఈ నేపథ్యంలో చట్టాల సవరణ కాదు, వాటి పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. నేరం చేస్తే శిక్ష ఈ విధంగా ఉంటుందన్న భయం ప్రజల్లో కలగాలి. అలాగే నేరం చేసిన వారి, మహిళ బతుకును నాశనం చేసిన వారి కేసులను త్వరగా పరిష్కరించాలి. ఆ నేరాలకు బాధ్యులైన వారి గురించి విస్తృత ప్రచారం జరగాలి. దీనికి తోడు నేరం జరిగే అవకాశమున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, టాక్సీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు నేరాల మీద అవగాహన కలిగించాలి. అలాగే అత్యాచార కేసుల్లో కోర్టులు స్త్రీకి కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కఠినంగా శిక్షించాలి. అలాగే గ్రామాల్లో నేరాలు జరిగితే పంచాయతీలు పెట్టి తీర్పు చెప్పడం కాదు, పోలీసులకు అప్పగించి తగు విధంగా శిక్షపడేలా చేయాలి. విదేశీ యువతులపై అత్యాచారాల కేసుల్లో ప్రజాప్రతినిధులు, మంత్రులు, ముఖ్యమంత్రి చొరవ తీసుకుని కాలయాపన జరగకుండా శిక్షపడేలా చూడాలి.

■ డా. పి.మాధవరావు
ఐక్యరాజ్యసమితి మాజీ సీనియర్ సలహాదారు

పుస్తకాల చెలిమి

మల్లెపూల వర్ణమాలల్ని అల్లుకొని
విజ్ఞాన సౌరభాల్ని విచ్చుకుంటున్న
పుస్తక పువ్వుల్ని తనివితీరా ఆస్వాదిద్దాం


పుస్తకం హస్తభూషణం కాదనీ
మస్తిష్కానికి నేస్తమనీ
కలాలు గర్జించే వరకూ
కవిత్వ బలాలు శాసించే వరకూ
నిరంతరంగా... తరంతరంగా
పాటై పల్లవిద్దాం
మాటై ముచ్చట పెడదాం
ఆటై అల్లరి చేద్దాం...

మనసున మనసై ఘూర్ణిల్లటానికి
మనిషిని మనిషిగా పూర్ణించటానికి
మంచి పుస్తకాల్ని మనువాడుదాం
మనలో అర్థాంగి పుస్తకమే అందాం
విజ్ఞాన వికాసాల్ని పొత్తంగా కందాం

పాశ్చాత్య పోకడల్లో
చెదలు చెదలుగా
రాలుతున్న మెదళ్ళనూ
బిజీ బిజీగా శ్వాసిస్తున్న
గుండె గదులనూ
పుస్తక పఠనాలతో పూద్చేద్దాం..
సెల్లుతో చిల్లుపడకుండా
జ్ఞానాన్ని దర్శిద్దాం


మానసిక ఒత్తిళ్లను
చీకటి పొత్తిళ్లలో వొదిలేసి
రేపటి కలల కుచ్చిళ్లలో దాగిన
ఆనంద గ్రంథాల్ని
పేజీలు పేజీలుగా తెరుద్దాం


– కటుకోఝ్వల రమేష్
(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)





మంగళవారం ఉష్ణోగ్రత
గరిష్ఠం 39.4
కనిష్ఠం 26.1


మూడేళ్లుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఫలితాలు (శాతంలో)














ఫస్ట్.. సెకండ్.. బాలికలే టాప్

ఇంటర్ ఫలితాల్లో మరోసారి అమ్మాయిల హవా

- ఉత్తమ ఫలితాల సాధనలో మేటి
- ప్రథమ సంవత్సరంలో మేడ్చల్ ఫస్ట్
- రంగారెడ్డి జిల్లాకు రెండో స్థానం
- ఏడో స్థానంలో హైదరాబాద్
- సెకండియర్‌లో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు
- 20వ స్థానంలో హైదరాబాద్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాల్లో గ్రేటర్‌లో అమ్మాయిలు మరోసారి సత్తాచాటారు. పలుచోట్ల ప్రైవేట్ కాలేజీ విద్యార్థులతో పోటీపడి ప్రభుత్వ కళాశాలలకు చెందిన పిల్లలు అత్యధిక మార్కులు సాధించారు. గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఫస్టియర్ జనరల్ విభాగంలో 2,25,789 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 1,66,047 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 59,742 మంది ఫెయిలయ్యారు. అలాగే సెకండియర్‌లో 2,00,158 హాజరుకాగా, 1,48,512 మంది పాసయ్యారు. ఇందులో 51,646 మంది ఫెయిలయ్యారు. ఫస్టియర్ ఒకేషనల్‌లో మూడు జిల్లాల నుంచి 9,045 మంది హాజరు కాగా, 5,559 మంది ఉత్తీర్ణత పొందరు. ఇందులో 3,486 మంది ఫెయిలయ్యారు. అలాగే సెకండియర్ ఒకేషనల్‌లో 7,743 మంది హాజరుకాగా.. 5,559 మంది పాసయ్యారు. ఇందులో 2,184 మంది ఫెయిలయ్యారు.

విజయదుందుభి మోగించిన బాలికలు


రంగారెడ్డి జిల్లాలో ఫస్టియర్ జనరల్


మిగతా 8వ పేజీలో..

ఫస్టియర్‌లో మేడ్చల్ స్టేట్ ఫస్ట్

ఇంటర్ ఫలితాల్లో ఎప్పటిలాగే గ్రేటర్ పరిధిలోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో మొదటి వరసలో నిలిచి తమ సత్తాను చాటుకున్నాయి. ఫస్టియర్‌లో 77.59 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లా స్టేట్ ఫస్ట్‌గా నిలిచింది. రంగారెడ్డి జిల్లా 76.95 శాతంతో రెండో స్థానం సంపాదించింది. హైదరాబాద్ జిల్లా 67 శాతం ఉత్తీర్ణతతో 7వ స్థానం దక్కించుకుంది. సెకండియర్‌లో మేడ్చల్ జిల్లా 78.08 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 3వ స్థానంలో నిలవగా, 77.72 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లా నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. కాగా, హైదరాబాద్ జిల్లా 67.05 పాస్ పర్సంటేజీతో 20వ స్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా, 2023 వార్షిక ఫలితాల్లో మేడ్చల్ జిల్లా ఫస్టియర్, సెకండియర్ జనరల్ విభాగంలో 75 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అలాగే రంగారెడ్డి జిల్లా 73 శాతంతో స్టేట్ సెకండ్ ర్యాంకును సొంతం చేసుకుంది. కాగా, 2024లో ఫస్టియర్‌లో 71.7 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే 71.58 శాతంతో మేడ్చల్ జిల్లా రెండోస్థానం దక్కించుకుంది. సెకండియర్‌లో మేడ్చల్ జిల్లా 79.31 శాతంతో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవగా 77.63 శాతంతో రంగారెడ్డి జిల్లా మూడో స్థానం దక్కించుకుంది. కాగా, 2024లో ఫస్టియర్‌లో హైదరాబాద్ జిల్లా 60.13 శాతం ఉత్తీర్ణతతో 10వ స్థానంలో, సెకండియర్‌లో 65.82 శాతం ఉత్తీర్ణతతో 12వ స్థానంలో ఉండడం గమనార్హం.

మూడేళ్లుగా హైదరాబాద్ జిల్లా ఒకేషనల్ ఫలితాలు (శాతంలో)







సనాబేగం
కంప్యూటర్ సైన్స్ ఫస్టియర్
489/500



ధనుష్
ఎంపీసీ ఫస్టియర్
468/470
జీహెచ్ఈఎల్



అవంతిక
ఎంపీసీ ఫస్టియర్
468/470
హయత్‌నగర్

కష్టాలను చూసి.. పట్టుదలతో రాసి..

- సత్తాచాటిన నిరుపేద విద్యార్థులు
- ఇంటర్‌లో అత్యధిక మార్కులు సొంతం
- పలు ప్రభుత్వ కళాశాలల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత

8



ఆ మీటర్ల మ్యాటరేంది?

- దుండిగల్ ఘటనపై దక్షిణ డిస్కం విచారణ
- లైన్ ఇన్‌స్పెక్టర్, మీటర్ రీడర్లకు మెమోలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అడ్డదారిలో విద్యుత్ మీటర్ల జారీపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ విచారణకు ఆదేశించింది. మీటర్లు అన్నీ ఒకే గదిలో ఉన్నా గుర్తించకపోవడం, రెండు నెలల క్రితం వరకు బిల్లులు జారీ చేసినా ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడంపై అధికారులు సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మన్, మీటర్ రీడర్లకు మెమోలు జారీచేశారు. మీటర్లు జారీ చేసిన సెక్షన్‌లో పనిచేస్తున్న ఏఈ నెల రోజుల క్రితం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఆ 30 విద్యుత్ మీటర్ల కోసం నోటరీ డాక్యుమెంట్లతో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన చిన్న చిన్న గదుల కోసం వేర్వేరు పేర్ల మీద దరఖాస్తు చేసినట్లు గుర్తించామని డిస్కం ఉన్నతాధికారులు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన గదులను రెవెన్యూ అధికారులు కూల్చివేయడంతో మీటర్లు అన్నింటినీ ఓ గదిలో పెట్టారు. స్థానికంగా ఇద్దరి మధ్య తలెత్తిన స్థలవివాదంలో విద్యుత్ మీటర్ల బాగోతం బయటపడింది. 30 మీటర్లు ఒకే గదిలో ఉన్నా స్థానిక సిబ్బంది బిల్లులు జారీ చేయడంపై డివిజన్ స్థాయిలో అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

మన్నె క్రిశాంక్‌కు మాదాపూర్ పోలీసుల నోటీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు మాదాపూర్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై మన్నె క్రిశాంక్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మాదాపూర్ పోలీసులు తన ఫోన్ అడుగుతున్నారని తెలిపారు. అలాగే గచ్చిబౌలి పోలీసులు కూడా అడుగుతున్నారని, ఒకటే ఫోన్ ఎంత మందికి ఇవ్వాలని ఆయన అసహనం వ్యక్తం చేశారు. గతంలోనే ఒక కేసు విషయమై మాదాపూర్ పోలీసులు తన ఫోన్‌ను సీజ్ చేశారని, ఇప్పటికీ అది వారి వద్దే ఉందని తెలిపారు. గతంలో గచ్చిబౌలి పోలీసులు తనకు నోటీసులు ఇచ్చినప్పుడు సోషల్ మీడియా అని కాకుండా సోడా మీడియా కన్వీనర్ అని టైప్ చేశారని, మాదాపూర్ పోలీసులు ఇచ్చిన దాంట్లోనూ అదే పదం ఉందని తెలిపారు. బహుశా వీటిని సీఎం కార్యాలయం నుంచి పంపుతున్నారేమోనని క్రిశాంక్ ఆరోపించారు.



పనిచేయని సీసీ కెమెరాలు ఎందుకు?

ప్రజాధనం వృథా.. ఏడాదిగా బాలుడి జాడ కనిపెట్టలేకపోతున్నారు..

పోలీసులపై హైకోర్టు అసంతృప్తి

6

ఉప్పల్‌లో నేడు బిగ్ ఫైట్

సన్‌రైజర్స్-ముంబై ఇండియన్స్ మ్యాచ్



6

బ్రాండెడ్ పేరుతో నకిలీ ఉత్పత్తులు

ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేస్తున్న ముఠా ఆటకట్టు

ముగ్గురు నిందితుల అరెస్ట్



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

రూ.1,200కోట్ల విలువైన ప్రభుత్వ స్థలానికి రక్షణగా ఫెన్సింగ్ : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లో రూ.1200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలానికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. హద్దులు నిర్ణయించి చేపట్టిన పనులను శనివారం లోగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 ఏసీబీ కార్యాలయం ఎదుట సర్వేనంబర్ 102/1లో ఉన్న 12 ఎకరాల ఖాళీ ప్రభుత్వ స్థలంలో అధికారులు డీజీపీఎస్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్రమణకు గురికాకుండా సదరు స్థలానికి హద్దులు నిర్ణయించారు. కాగా, రూ.35 లక్షలతో జీఐ షీట్స్ ఐరన్ పోల్స్‌తో చేపట్టిన పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది కూలీలను పెట్టి డే అండ్ నైట్ పనులు చేపట్టి ఫెన్సింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. స్థలం ప్రభుత్వానికి సంబంధించినదిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, డీఈ సంజీవ్, ఏఈ శ్రీధర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మార్నింగ్ నుంచే మాడుతోంది!

42 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రతలు

- మంటపుట్టిస్తున్న వేడిగాలులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే నిప్పులు చెరుగుతున్నాడు. గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు చేరడంతో బయటకు వచ్చేందుకు నగరవాసులు వణికిపోతున్నారు. ఇంట్లో ఏసీ లేకుండా గంటకూడ ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని మోతీనగర్‌కు చెందిన రత్నం రాజు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 వరకు వేడిగాలుల కారణంగా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతోంది. కార్వాన్, గోషామహల్, ముషీరాబాద్, మూసాపేట, హఫీజ్‌పేట, మూసారాంబాగ్, హబ్సిగూడ, లింగంపల్లి, యూసుఫ్‌గూడ రహ్మత్‌నగర్, రాజేంద్రనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో 41.6 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ 30 నాటికి గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలవరకు నమోదయ్యే అవకాశాలుంటాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఎండలకు ఏసీలు, కూలర్ల వినియోగం పెరగడంతో గ్రేటర్‌జోన్‌లో మంగళవారం విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో 4 వేల మెగావాట్లకు చేరింది.



ఎండ వేడికి చేయి అడ్డుపెట్టుకుని వెళ్తున్న యువతి

సాయంత్రం శివార్లలో వర్షం

దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం ప్రాంతాల్లో సాయంత్రం 10 నుంచి 15 నిమిషాల పాటు వర్షం కురిసింది. గడ్డిఅన్నారం కమలానగర్‌లో ఈదురు గాలులకు భారీ రావిచెట్టు పడటంతో ఓ కారు పాక్షికంగా ధ్వంసమైంది. మరో రెండురోజుల పాటు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

కుమార్తెకు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేకే భర్తను చంపేసింది

- చెల్లెలు, ఆమె భర్తతో కలిసి ఘాతుకం
- కూకట్‌పల్లి ఘటనలో వివరాలు వెల్లడించిన ఏసీపీ

హైదర్‌నగర్,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): కుమార్తెకు భర్త కుదిర్చిన పెళ్లి ఇష్టం లేకపోవడం, ఇద్దరి మధ్యా సఖ్యత ఉండకపోవడంతో అతడిని చంపేసి పూడ్చిపెట్టింది. భర్తను చంపి.. శవాన్ని పూడ్చిన కేసు వివరాలను కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు మంగళవారం వెల్లడించారు. మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలం పాత లింగాయపల్లికి చెందిన బోయిని సాయిలు(45)కు, కవిత(42)తో 20ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె శ్వేత, కుమారుడు బన్నీ ఉన్నారు. దంపతుల మధ్య సఖ్యత లేకపోవడంతో సాయిలు పిల్లలతో పాత లింగాయపల్లిలోనే పనిచేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. ఇటీవల కుమార్తె శ్రావ్యకు సాయిలు చెల్లెలు కుమారుడితో పెళ్లి నిశ్చయించినట్లు కవితకు తెలిపాడు. సాయిలు చూసిన సంబంధం కవితకు నచ్చలేదు. దీంతో తరచూ అతడిని అవమానిస్తూ మాట్లాడేది. అంతేకాకుండా, చెల్లెలు జ్యోతి, ఆమె భర్త మల్లేష్‌తో కలిసి సాయిలు హత్యకు

మిగతా 6వ పేజీలో..

విద్యుత్ బిల్లు బకాయి పేరిట వృద్ధుడికి బురిడీ

రూ. 3.99లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాడు

వీడియో కాల్‌లో ఉండి మస్కా కొట్టిన వైనం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు బకాయిల పేరిట జరుగుతున్న సైబర్ మోసాలు ఆగడం లేదు. మీ విద్యుత్ బిల్లు బకాయి ఉంది, వెంటనే చెల్లించకపోతే సరఫరా నిలిపేస్తామని మాటలతో హడలెత్తించి.. అమాయకుల బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కాజేయడం సైబర్ కేటుగాళ్లకు అలవాటుగా మారింది. ఇదే క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడి(78)ని బురిడీ కొట్టించిన ఓ సైబర్ నేరగాడు.. అతని వద్ద నుంచి ఏకంగా రూ.3.99 లక్షలు కాజేశాడు. బాధిత వృద్ధుడితో వీడియో కాల్ మాట్లాడుతూ మోసానికి పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం డీసీపీ కవిత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన బాధిత వృద్ధుడి ఫోన్‌కి ఇటీవల గుర్తు తెలియని నెంబర్ నుంచి కాల్ వచ్చింది. వృద్ధుడు ఆ కాల్‌కు స్పందించగా.. తనని తాను విద్యుత్ శాఖ ఉద్యోగిగా పరిచయం చేసుకున్న అవతలి వ్యక్తి.. విద్యుత్ బిల్లు బకాయిలను వెంటనే చెల్లించాలని చెప్పాడు. లేనిపక్షంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించాడు. అయితే, తాను బిల్లులు చెల్లించానని, ఎలాంటి బకాయిలు లేవని బాధితుడు పదేపదే చెప్పాడు. ఆపై, బాధితుడికి వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాడు.. రికార్డుల్లో తేడాలు ఉండి ఉంటాయని, వాటిని సరిచేసేందుకు తాను పంపిన లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించాడు. ఇదంతా నిజమని నమ్మిన బాధిత వృద్ధుడు.. ఆ లింక్ ఓపెన్ చేసి సైబర్ నేరగాడి సూచనల మేరకు విద్యుత్ మీటర్, బిల్లు చెల్లింపునకు సంబంధించిన వివరాలు నమోదు చేశాడు. ఈ క్రమంలో బాధితుడు క్రెడిట్ కార్డు ద్వారా బిల్లు చెల్లించినట్లు తెలుసుకున్న సైబర్ నేరగాడు ఆయా వివరాలు తీసుకుని వీడియో కాల్‌లో ఉండగానే విడతల వారీగా రూ.3.99లక్షలు కొట్టేశాడు. ఆయా లావాదేవీలకు సంబంధించిన మెసేజ్‌లు చూసుకుని బాధిత వృద్ధుడు ప్రశ్నించేలోపే సైబర్ నేరగాడు కాల్ కట్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధిత వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

సీఎం ప్రజావాణి పనితీరు అద్భుతం

- నాగాలాండ్ ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం కితాబు
- ప్రజావాణికి 371 దరఖాస్తులు

బేగంపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణి పనితీరు అద్భుతం.. బేషుగా ఉందని నాగాలాండ్ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కొనియాడారు. మంగళవారం మహాత్మాజ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో సీఎం ప్రజావాణిని నాగాలాండ్ అధికారుల బృందం సందర్శించింది. ప్రజావాణిలో ఫిర్యాదులు సేకరించడం, వాటిని ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు పంపడం, డెస్క్ ఆఫీసర్స్ విధులు, హెల్ప్‌డెస్క్, ఫిర్యాదుల ట్రాకింగ్ పనితీరు, తాగునీటి సౌకర్యం, ప్రభుత్వం అందించే రూ.5 భోజన కేంద్రాన్ని నాగాలాండ్ అధికారుల బృందం పరిశీలించింది. సీఎం ప్రజావాణి గురించి రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య వారికి వివరించారు. ఈ విధానాన్ని నాగాలాండ్ రాష్ట్రంలో అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. నాగాలాండ్ రాష్ట ఉన్నతాధికారుల బృందంలో కుశఫితూ, వికొవెనోచాలే, అవేలురుహో, అత్‌సంగ్లా తదితరులున్నారు. కాగా, మంగళవారం మహాత్మా జ్యోతిబాఫూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణికి మొత్తం 371 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



సీఎం ప్రజావాణి గురించి నాగాలాండ్ అధికారులకు వివరిస్తున్న చిన్నారెడ్డి, దివ్య

జీహెచ్ఎంసీ కార్యాలయం పరిసరాల్లో..

నేడు, శుక్రవారం ట్రాఫిక్ మళ్లింపులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో బుధ, శుక్రవారం ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ పేర్కొన్నారు. ఈనెల-23న జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ నిర్వహిస్తుండగా.. 25న లెక్కింపు నిర్వహిస్తారు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఓటింగ్‌లో పాల్గొనున్నారు. వీఐపీల మూవ్‌మెంట్ ఎక్కువగా ఉంటుండంతో వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అక్కడి టీ జంక్షన్ మూసివేస్తున్నట్లు ప్రకటించారు. లిబర్టీ, బషీర్‌బాగ్ ఫ్లై ఓవర్ నుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి జంక్షన్, బీఆర్‌కె భవన్ వైపునకు మళ్లిస్తున్నట్లు తెలిపారు.. ఈ మళ్లింపులు ఈనెల-23, 25న అమల్లో ఉంటా యని స్పష్టం చేశారు.


మెడికవర్ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటి కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మెడికవర్ ఆస్పత్రిలో గ్రీన్ ఇనిషియేటివ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ భూమి దినోత్సవాన్ని పురస్కరించుకొని 'డిఫారెస్టేషన్ నుంచి రీఫారెస్టేషన్ వరకు సంప్రదాయ పద్ధతుల నుంచి డిజిటల్ మార్గాల్లోకి' అనే ధ్యేయంతో గ్రీన్ ఇనిషియేటివ్‌ను మంగళవారం మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో వైద్యులు మొక్కలు నాటి, వాటిని స్వయంగా కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రమ్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ శశిధర్, గ్రీన్ ఇండియా ఫౌండర్ శ్రీ సంతోష్, రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

కుమార్తెకు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేకే

భర్తను చంపేసింది

(5వ పేజీ తరువాయి)

పథకం వేసింది. ఈనెల 12న ఊరువెళ్లిన కవిత ఉద్యోగం చూపిస్తానని భర్తను తీసుకొచ్చి, ఓ బిల్డింగ్ వద్ద వాచ్‌మన్‌గా కుదిర్చింది. గత శుక్రవారం రాత్రి భర్త సాయిలు, కవిత, ఆమె సోదరి జ్యోతి, మల్లేశ్ నలుగురూ మిత్రాహిల్స్‌లో జ్యోతి ఇంటి దగ్గర మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న సాయిలుకు కవిత, జ్యోతి కరెంటు వైర్‌తో షాక్ ఇచ్చి హత్యకు ప్రయత్నించారు. అతడు మృతిచెందక పోవడంతో సోదరి సాయంతో మెడకు తువ్వాలను చుట్టి, ఆపై వృషణాలపై తన్ని హత్య చేశారు. మృతదేహాన్ని ఓ పట్టాలో చుట్టారు. ఆటోలో తీసుకెళ్లి జోగిపేట దగ్గర శ్మశానంలో పడేసేందుకు యత్నించారు. అనుమానం వచ్చిన ఆటోడ్రైవర్ వారిని ఊరిలో లేదా, ఎక్కించుకున్న చోటే దింపుతానని చెప్పి, మిత్రాహిల్స్‌లో వదిలిపెట్టాడు. దీంతో కవిత, జ్యోతి, మల్లేష్‌లు మృతదేహాన్ని మిత్రహిల్స్ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో పాతిపెట్టారు. సాయిలు మృతదేహాన్ని తరలించిన ఆటోడ్రైవర్ ఫిర్యాదుతో విషయం బయటకు వచ్చింది. కేపీహెచ్‌బీ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సాయిలు మృతదేహాన్ని వెలికితీయించి, కూకట్‌పల్లి తహసీల్దార్ సమక్షంలో గాంధీ ఆస్పత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అందజేశారు. పోలీసులకు సమాచారం అందించిన ఆటోడ్రైవర్ నాయక్‌కు రివార్డు అందిస్తున్నట్లు ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డీఐ రవికుమార్, ఎస్‌ఐలు లింగం, మన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలైన అత్తపై కోడలి దాష్టీకం


అత్తపై దాడికి పాల్పడుతున్న కోడలు సంధ్యారాణి (సీసీ ఫుటేజీ)

మన్సూరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలోని అత్తపై కోడలు దాష్టీకాన్ని ప్రదర్శించింది. భార్య ఆర్తనాదాలు విన్నా ఏమీ చేయలేని స్థితిలో అంధుడైన భర్త. ఈ ఘటన నాగోల్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... నాగోల్ బండ్లగూడలోని మధు రానగర్ కాలనీలో నివాసముంటున్న పసుపులేటి సంతోష్‌రెడ్డి, రాములమ్మ(80), భార్యాభర్తలు. వారి పెద్దకుమారుడు పసుపులేటి వేణుగోపాల్‌రెడ్డికి అతడి భార్య సంధ్యారాణికి గొడవలు జరిగి ఐదేళ్ల నుంచి వేరుగా ఉంటున్నారు. ఇరువురు ఆస్తి విషయంలో కోర్టులో కేసు వేయగా, ఆ కేసు కోర్టులో నడుస్తోంది. తనను అత్తింటి వారు ఇంట్లోకి రానివ్వడం లేదంటూ సంధ్యారాణి కోర్టును ఆశ్రయించగా ఇంట్లోకి వెళ్లొచ్చంటూ ఆర్డర్ ఇచ్చింది. ఆర్డర్ కాపీనీ తీసుకుని సంధ్యారాణి ఈ నెల 18న బంధువులు అమరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రావును వెంటబెట్టుకుని ఇంటికి వెళ్లింది. కోర్టు ఆర్డర్ చూసిన సంధ్యారాణి అత్తమామలు అడ్రస్ వేరుగా ఉందని వెళ్లి పోమన్నారు. ఆగ్రహించిన కోడలు సంధ్యారాణి.. అత్త రాములమ్మపై దాడి చేయగా, మెడ, నడుము భాగంలో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో సమీపంలోని ఆస్పత్రిలోచికిత్స పొందుతోంది. నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే వారు పట్టించుకోక పోవడంతో, కోడలు తమపై దాడి చేసిన సీసీ ఫుటేజీ ఆధారంతో ఎల్బీనగర్ ఏసీపీకి ఫిర్యాదు అందజేశారు. ఏసీపీ కృష్ణయ్య కేసు నమోదు చేయాలని నాగోల్ పోలీసులను ఆదేశించారు. అయితే నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఏసీపీ ఎందుకు ఫిర్యాదు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని వృద్ధ దంపతులు ఆవేదన చెందారు. ఈ విషయమై నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. కేసు కోర్టులో ఉన్నందున తాము కల్పించుకోబోమని, కోర్టులోనే తేల్చుకోవాలని చెప్పారు.

మెంతికూర కట్టలో పాము



మాదన్నపేట కూరగాయల మార్కెట్‌కు రైతు తీసుకువచ్చిన మెంతికూర కట్టలో పాము ప్రత్యక్షమైంది. మార్కెట్‌కు వచ్చిన యువకులు పామును గుర్తించి చంపారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

-సైదాబాద్,ఆంధ్రజ్యోతి

ఇంద్రారెడ్డికి నివాళి



పట్లోళ్ల ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పి.కార్తీక్ రెడ్డి, కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, కొలన్ సుభాష్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తాను మరణించి 25 సంవత్సరాలు అవుతున్నా, రంగారెడ్డి జిల్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి హోంశాఖ మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని ఆయన తనయుడు, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ సర్కిల్ కన్వీనర్ కొలన్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తాలో ఇంద్రారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఇంద్రారెడ్డి చిత్రపటానికి కార్తీక్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, మైలార్‌దేవుపల్లి, రాజేంద్రనగర్ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్, పోరెడ్డి ధర్మారెడ్డి, సీనియర్ నాయకులు జాలిగం చిత్తారి, రావుల జంగయ్య, వనం శ్రీరాంరెడ్డి, నోముల రాము యాదవ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, లక్ష్మీ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

● గాంధీనగర్‌లో స్వర్గీయ ఇంద్రారెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు దుంబాల ఉమారెడ్డి, పచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంద్రారెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు.

అనధికార షెడ్ల కూల్చివేత



ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో అక్రమంగా వెలిసిన షెడ్లను కూల్చివేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ మదుభన్ కాలనీని ఆనుకొని ఉన్న ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ రెసిడెన్షియల్ ఏరియాలో అనధికారికంగా వెలిసిన ఐదు భారీ షెడ్లను మంగళవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. నివాస సముదాయాల్లో పరిశ్రమల షెడ్లను వేయడంతో ఈ కూల్చివేత్తలు చేపట్టారు. ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో సుమారు 200 షెడ్లు ఉన్నాయని, వారికి నోటీసులు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. నివాస సముదాయాల్లో ఎవరూ పరిశ్రమల షెడ్లు వేయొద్దన్నారు.

బాధితుల ఆందోళన

ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో తాము స్థలాలు కొనుగోలు చేసి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి షెడ్లు వేసుకుంటే వాటిని అధికారులు కూల్చివేస్తున్నారని బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో చాలా చోట్ల పరిశ్రమల షెడ్లు ఉన్నప్పటికీ మళ్లీ ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో కూల్చివేత్తలు చేపడుతున్నారని వాపోయారు.

వీటి పరిస్థితేంటి?

రాజేంద్రనగర్ సర్కిల్ లక్ష్మీగూడ ఎర్ర కుంట కింది భాగంలో సుమారు వందకు పైగా అనధికార పరిశ్రమల షెడ్లు ఉన్నాయి. అవి కూడా జనావాసాల మధ్య ఉన్నాయి. వాటి జోలికి అధికారులు వెళ్లడం లేదు. అత్తాపూర్ నుంచి పీడీపీ చౌరస్తాకు వెళ్లే ప్రధాన మార్గంలో మంత్రా మాల్‌కు విశాల్ మార్ట్‌కు మధ్య పెద్ద షెడ్డు ప్రస్తుతం వేస్తున్నారు. ఆ షెడ్డు జోలికి కూడా అధికారులు వెళ్లడం లేదు. హైదర్‌గూడ చౌరస్తాలో పిల్లర్ నెంబర్ 145వద్ద భారీషెడ్డును ప్రస్తుతం వేస్తున్నారు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అనధికార షెడ్లపై చర్యలు తీసుకుంటాం



ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో నివాసాల కోసం కొనుగోలు చేసిన స్థలాల్లో పరిశ్రమల షెడ్లు వేస్తున్నారు. అందుకే కూల్చివేస్తున్నాం. చాలా షెడ్లు ఆ ప్రాంతంలో ఉన్నప్పటికీ నోటీసులు ఇస్తున్నాం. మా దగ్గర సరైన సిబ్బంది లేకపోవడం వల్ల అన్నింటినీ కూల్చ లేకపోతున్నాం. లక్ష్మీగూడ ఎర్ర కుంట కింది భాగంలో ఉన్న పరిశ్రమల షెడ్లను కూడా పరిశీలిస్తాం. హైదర్‌గూడ చౌరస్తాలో నిర్మిస్తున్న షెడ్డుతో పాటు మంత్రా మాల్ పక్కన ఉన్న షెడ్డుకు కూడా నోటీసులు ఇస్తాం. ఉన్నతాధికారులకు కూడా ఈ విషయాన్ని చెప్పాం. అనుమతి లేని షెడ్లు ఎక్కడ వేసినా ఊపేక్షించేది లేదు. అన్నింటిపై చర్యలు తీసుకుంటాం.

\- కె. రవికుమార్, డిప్యూటీ కమిషనర్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/38aS9saలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

బంగ్లాదేశీయులకు బర్త్ సర్టిఫికెట్లు

- హైదరాబాద్ శివారు మున్సిపాలిటీల్లో నయా దందా
- పోలీసుల అదుపులో కంప్యూటర్ ఆపరేటర్

నార్సింగ్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గతంలో జీహెచ్ఎంసీలో డబ్బులిస్తే చాలు.. నగరంలో పుట్టినట్టుగా బర్త్ సర్టిఫికెట్ ఎవ్వరికైనా ఇచ్చేది. జీహెచ్ఎంసీ బర్త్ సర్టిఫికెట్లలో జరుగుతున్న అక్రమాలు బట్టబయలు కావడంతో అక్రమార్కులు శివారు మున్సిపాలిటీలను ఎంచుకున్నారు. గతంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వ్యక్తే ప్రస్తుతం నార్సింగ్ మున్సిపాలిటీలో అక్రమాలకు తెరలేపాడు. డబ్బులు తీసుకొని బంగ్లాదేశీయులకు బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయడం గమనార్హం. విదేశీయులకు బర్త్ సర్టిఫికెట్లు జారీ చేసిన నార్సింగ్ మున్సిపాలిటీలోని కంప్యూటర్ ఆపరేటర్‌ను తాజాగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.

గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో చార్మినార్ జోన్ పరిధిలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్ సుధీర్‌ను ఓ మున్సిపల్ కమిషనర్ తన వెంట నార్సింగ్ మున్సిపాలిటీకి తీసుకొచ్చాడు. సదరూ కమిషనర్ వెళ్లిపోయినా సుధీర్ మాత్రం నార్సింగ్ మున్సిపాలిటీలోనే తిష్టవేశాడు. నార్సింగ్ మున్సిపాలిటీలో పూర్తిగా ఆన్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో బర్త్ సర్టిఫికెట్ల జారీలో అక్రమాలకు తెరలేపాడు. నగర శివారులో నివాసముంటున్న బంగ్లాదేశీయులు ఇక్కడే పుట్టినట్టుగా బర్త్ సర్టిఫికెట్లు సృష్టించాడు. ఒక్కో బర్త్ సర్టిఫికెట్‌కు రూ.5లక్షల మేర వసూళ్లకు పాల్పడిన్నట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బర్త్ సర్టిఫికెట్ల దందా చేసే ముఠాను అదుపులో తీసుకున్నారు. ఈ ముఠాలో సుధీర్‌తో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాలో మరికొందరూ ఉన్నట్లు అనుమానాలున్నాయని, ఎంత మందికి నకిలీ బర్త్ సర్టిఫికెట్లను జారీ చేశారనే కోణంలో పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

మంగళ్‌హాట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఖైరతాబాద్ ప్రాంతానికి చెందిన బీబి జైనాబ్(44) అనే మహిళ ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్. మంగళవారం తన కూతురితో కలిసి ద్విచక్ర వాహనంపై ఖైరతాబాద్ నుంచి అబిడ్స్ వైపు వస్తుండగా నిజాం కాలేజ్ నుంచి మహబూబ్‌నగర్ స్కూల్ వైపు వెళ్తున్న టీఎస్ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి కళ్ల ముందు చనిపోవడంతో షాక్‌కు గురైన కూతురు వివరాలు చెప్పేందుకు ఇబ్బంది పడిందని పోలీసులు తెలిపారు. మహిళ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆర్టీసీ బస్ డ్రైవర్ అబ్దుల్ రియాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణలో ఉంది.

'తెలంగాణ, ఏపీలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తాం'

బర్కత్‌పుర, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీలో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని ఉమ్మడి ఏపీ మున్సిపల్ కౌన్సిలర్ చాంబర్ మాజీ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర హెచ్చరించారు. మోదీని విమర్శించే నైతిక హక్కు వై.ఎస్.షర్మిళకు లేదన్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధికి మోదీ ప్రభు త్వం నిధులు కేటాయిస్తుండగా సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిళ విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. మోదీకి ప్రజల ఆదర ణ ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తుండడంతో చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ, తమిళనాడు, కర్నాటకలో బీజేపీ అధికారంలోకి రానున్నదని, దీనిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఇకనైనా మోదీపై విమర్శలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

'వైద్యులకు పదోన్నతులు కల్పిస్తాం'

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు పదోన్నతులు కల్పిస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం(టీవీవీ) ఆధ్వర్యంలో వైద్యులతో కలిసి కమిషనర్ అజయ్ కుమార్‌తో చర్చలు జరిపారు. ఈచర్చలు సఫలం కావడంతో సీనియారిటీ ప్రకారం పదోన్నతులకు కమిషనర్ సుముఖం తెలపడంతో టీవీవీ వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. త్వరలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న వైద్యుల సీనియారిటీ జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈసందర్భంగా టీవీవీ నాయకులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, డాక్టర్ రావుఫ్‌ల, డాక్టర్ సంగిత్ డాక్టర్ రాకేష్, డాక్టర్ దివ్య, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఆమీర్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్వేత, డాక్టర్ శృతి, డాక్టర్ శరణ్య తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

కఠిన శిక్షలతోనే నేరస్తుల్లో భయం

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



సిబ్బందికి రివార్డులు అందజేస్తున్న కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల కేసుల్లో.. నిందితులకు కఠిన శిక్షలు పడినప్పడే నేరస్తులు, అంతరాష్ట్ర స్మగ్లర్స్‌లో భయం వస్తుందన్నారు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేసిన అధికారులకు నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో మంగళవారం రివార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సంగారెడ్డిలో ఎక్సైజ్ అధికారులు మంచి పనితీరును కనబరిచారని, కేసులు నమోదు చేయడంలోనే కాకుండా విచారణ సమర్ధ వంతంగా నిర్వహించి, కఠిన శిక్షలు పడేలా చేశారని గుర్తు చేశారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధించడానికి ఎక్సైజ్ సిబ్బంది మరింత సమర్ధ వంతంగా పనిచేసి శాఖకు గుర్తింపు తేవాలని సూచించారు. గతంలో సంగారెడ్డిలో పనిచేసిన ఇన్‌స్పెక్టర్ జె.మధుబాబు, శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు అధికారులను అభినందించి క్యాష్ రికార్డులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఖురేషీ, ఎస్‌టీఎఫ్ సూపరింటెండెంట్స్ నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్ రావు, అడిషనల్ ఎస్పీ భాస్కర్ గౌడ్, డీఎస్పీలు తిరుపతి యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

అత్తాపూర్ శ్రీ అభిదా విద్యార్థుల ప్రతిభ



ఎ.రిషికా రెడ్డి | జి.యశస్విని | ఎస్.ఉమిక | ఓ కావ్యామృత | ఆకాంక్ష

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్తాపూర్ శ్రీ అభిదా జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారు. ఎంపీసీ విభాగంలో గౌని యశస్విని, అనుగుండ రిషికా రెడ్డి, మోతుకూరి సంజన, సావంత్ ఉమిక, వి.శ్రీరామ్ 470 మార్కులకు 466 సాధించారు. వీరితో పాటు 25 మంది విద్యార్థులు 470 మార్కులకు గాను 465 సాధించారు. మరో 46 మంది విద్యార్థులు 470 మార్కులకు 464 సాధించారు.

బైపీసీలో ఆశ్రేయ మనోజ్, అక్షర రెడ్డి, శశికిరణ్‌రెడ్డి 440 మార్కులకు 435 గాను సాధించారు. వీరితో పాటు 14 మంది విద్యార్థులు 440 మార్కులకు 434 సాధించారు. బైపీసీ విద్యార్థులందరూ 430 పైచిలుకు సాధించడం విశేషం. సీనియర్ ఇంటర్మీడియట్ విభాగం విద్యార్థులు కూడా ప్రతిభ చాటారు. ఎంపీసీలో ఓ కావ్యామృత 1000 మార్కులకు 993 సాధించారు. ఎం.కౌశిక్ 991, త్రిశాల్ 990 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. బైపీసీలో ఆకాంక్ష 1000 మార్కులకు 990 సాధించారు. అనేక మంది విద్యార్థులు 990కి పైగా మార్కులు సాధించడం గర్వకారణం. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లి దండ్రులను శ్రీ అభిదా విద్యాసంస్థ డైరెక్టర్ అలమంద శ్రీనివాసరావు, డీన్ రవి కుమార్, ఆర్కే, ప్రిన్సిపాల్ నర్సింహరావు, భార్గవి దేశ్‌పాండే అభినందించారు. శ్రీ అభిదా విద్యా రంగంలో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఐఐటీ, జేఈఈ., నీట్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంలో తమ సంస్థ కృషి చేస్తోందని అలమంద శ్రీనివాసరావు తెలిపారు.

విజ్ఞాన్ విద్యార్థుల ప్రభంజనం



ఇటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో విజ్ఞాన్ కళాశాల చైర్మన్ గౌరి సతీష్



మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మిఠాయిలు తినిపిస్తున్న గౌరీ సతీష్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మంగళవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో విజ్ఞాన్ కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులతో ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.మౌనిక 1000 మార్కులకు 986, ఎంఈసీలో జీపీసీ రెడ్డి 984, సీఈసీలో ఎల్ వాత్సల్య 970, పి.కామాక్షి బైపీసీలో 961, తేజశ్రీ 959, ఉజ్మా సుల్తానా 955, బి.హాసిని 955, టీజీ కమాల్వేరి 952, శిఫా బేగం 950 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను మెహతాద్దున్ 447 మార్కులు, సార్థక్ 444, మహ్మద్ షర్ఫీ 441, సీఈసీలో 500 మార్కులకు ఎస్.శివాని 479, ముస్కన్ బేగం 462, నూస్రత్ బేగం 455, జి.లోకేష్ 444 మార్కులు సాధించారు. బైపీసీలో ఉత్తమ మార్కులు సాధించి విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఒత్తిడి లేని ప్రణాళికలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యనందించడమే ఈ విజయానికి కారణమని విజ్ఞాన్ కళాశాల చైర్మన్ గౌరి సతీష్ అన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

శ్రీ మేధా విజయ భేరి



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అత్తాపూర్ శ్రీ మేధా జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్‌లో జి.అతిధి 1000 మార్కులకు గాను 993 సాధించారు. జూనియర్ ఇంటర్‌లో సయ్యద నిధా షర్మీన్ 500 మార్కులకు 492, భావేష్ చౌదరి 470 మార్కులకు 466, షబ్నమ్ బైరవ 440 మార్కులకు 432, జి.కార్తీక్ 500 మార్కులకు 487 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విజయాలకు కారణమైన విద్యార్థులను, ఉపాధ్యాయులను కళాశాల ప్రిన్సిపాల్ సుజాత అభినందించారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కళాశాల చైర్మన్ వీఎస్ అయ్యన్న బాబు, రమేశ్ యాదవ్, ప్రవీణ్ సింగ్ తెలిపారు.



బండారి హన్సిక | ఫాతిమా అన్సారీ | సాయి సింధూరి

రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల..

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలలో ఎంపీసీ చదువుతున్న బుద్వేల్‌కు చెందిన బండారి హన్సిక 1000 మార్కులకు 973 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. బైపీసీలో ఫాతిమా అన్సారీకు 984, సీఈసీలో కేతావత్ పూజా నాయక్ 952, బైపీసీలో రఘునాం సాయి సింధూరి 983 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.

నార్సింగ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల విజయభేరి



ఆర్.హర్షిత్ (ఎంపీసీ) 993/1000 | పి.మధుమిత (బైపీసీ) 993/1000

నార్సింగ్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నార్సింగ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు విజయభేరి మోగించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు 467/470 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో నార్సింగ్‌కు చెందిన హర్షిత 993/1000, బైపీసీలో పి.మధుమిత 993/1000 మార్కులు సాధించారు. వీరు టాపర్లుగా నిలిచారు. వరికొంతమంది ద్వితీయ, తృతీయ ర్యాంకుల్లో నిలిచారు.

● మొదటి సంవత్సరంలో ముగ్గురు విద్యార్థినులు 467/470, నలుగురు విద్యార్థినులు 466/470, ఎంపీసీలో ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీలో ఇద్దరు విద్యార్థులు 437/440, ముగ్గురు విద్యార్థినులు 436/440, మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉన్నతాధికారులు అభినందించారు.

రాజేంద్రనగర్ గురుకులలో..



బూక్యా రాజ్ కుమార్ | ఆర్.సాయి కుమార్

రాజేంద్రనగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (ఐఐటీ స్టడీ సెంటర్) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బూక్యా రాజ్‌కుమార్ 1000మార్కులకు 987 సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. బోడ సతీష్‌కు 985, శంకరుడు 985, అశీష్ పునీత్ 984, పవన్ కళ్యాణ్ 984, చెర్ల ప్రేంకుమార్‌కు 984 మార్కులు వచ్చాయి.

బైపీసీలో..: బైపీసీలో ఆర్. సాయికుమార్ 1000 మార్కులకు 986 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. బానోత్ దిలీప్982, పత్లావత్ సందీప్ 982 సాధించారు.

కష్టాలను చూసి.. పట్టుదలతో రాసి..

● ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన నిరుపేద విద్యార్థులు
● పలు ప్రభుత్వ కళాశాలల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత


రాజేంద్రనగర్/సరూర్‌నగర్/బోరబండ/కేపీహెచ్‌బీకాలనీ/నార్సింగ్/సికింద్రాబాద్/మారేడ్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆర్థిక పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన పలువురు నిరుపేద విద్యార్థులు పరీక్షలను పట్టుదలతో రాశారు. తల్లిదండ్రుల కష్టాలను తీర్చేందుకు అహోరాత్రులు కష్టపడ్డారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రైవేట్ విద్యార్థుల కంటే పైచేయి సాధించి విజయదుందుభి మోగించారు. పలు ప్రభుత్వ కాలేజీల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత నమోదైంది.

రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సెంటర్‌లో..

రాజేంద్రనగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల(ఐఐటీ స్టడీ సెంటర్)లో చదివిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో కలిపి 177 మంది పరీక్షలు రాయగా.. 169 మంది ఏ-గ్రేడ్‌లో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ విజయ రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. 8 మంది విద్యార్థులు బి గ్రేడ్ సాధించినట్లు చెప్పారు. ఎంపీసీ ఫస్టియర్‌లో రమావత్ సిపాయికి 470 మార్కులకు 467, కె.నర్సింహ, రమావత్ రాహుల్‌కు 466 మార్కులు వచ్చినట్లు వారు చెప్పారు.

గుర్రంగూడ మైనారిటీ కాలేజీలో వందశాతం ఉత్తీర్ణత

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో ఉన్న బాలాపూర్ మైనారిటీ గురుకుల జూనియర్ కాలేజీ వందశాతం ఉత్తీర్ణత సాధించింది. సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో నడుస్తున్న కాలేజీ నుంచి 47 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్ష రాయగా.. 47 మంది (100%) ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఫస్టియర్‌లో 56 మందిలో 53 మంది (93%) పాసైనట్లు చెప్పారు. సెకండియర్ సీఈసీలో ముదస్సిర్ అహ్మద్ 969 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలవగా, 966 మార్కులతో కె.రణిత్ ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు.



రమావత్ సిపాయి(467) | ముదస్సిర్ అహ్మద్, సీఈసీ (969) | ఎ.చైతన్య హరిణి, బైపీసీ (437) | ఎస్.హిమబిందు, బైపీసీ (437) | ఆర్.అర్చన, బైపీసీ (437)

ప్రియాంక గుప్తా, బైపీసీ (990) | ఆర్. హర్షిత్, ఎంపీసీ (993) | మధుమిత, బైపీసీ (993) | అక్షయ ఎంపీసీ (469) | డి. మమత, ఎంపీసీ (992)

470కి 468 మార్కులు

హయత్‌నగర్ టీనగర్‌లో కాలనీలో నివసిస్తున్న అవంతిక ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్‌లో 470 మార్కులకు 468 మార్కులు సాధించింది. ఆమె తండ్రి ఇబ్రహీంపట్నం మండలంలోని రాందాసుపల్లిలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అవంతిక మాట్లాడుతూ ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించడమే తన లక్ష్యమని తెలిపింది.

బోరబండ గురుకుల విద్యార్థినులు..

బోరబండలోని తెలంగాణ గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఫస్టియర్‌లో బైపీసీ విభాగంలో 440 మార్కులకు ఎ.చైతన్య హరిణి437, ఎస్.హిమబిందు 437, ఆర్.అర్చన 437 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు కె.శ్రీలత 466, ఎస్.అఖిల 466 మార్కులు సాధించారు. బైపీసీ సెకండియర్‌లో బి.శ్రీకళ 984, ఎం.హేమ 976, ఎం. స్వప్న 975 మార్కులు, ఎంపీసీ విభాగంలో పి.గంగ 974 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.విజయ తెలిపారు.

ప్రతిభ కనబరిచిన పేదింటి పిల్లలు

ఇంటర్ ఫలితాల్లో కొందరు పేదింటి పిల్లలు ప్రతిభ కనబరిచారు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రియాంక గుప్తా బైపీసీ సెకండియర్‌లో 1000కి 990 మార్కులు సాధించింది. అమృతకుమారి ఎంపీసీ విభాగంలో 1000కి 973 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో ఎం.జ్యోతిలక్ష్మి 470కి 466, వై.మౌనిక 470కి 452 మార్కులు సాధించింది.

నార్సింగ్ సోషల్ వెల్ఫేర్ కాలేజీలో..

నార్సింగ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల ఇంటర్ ఫలితాల్లో విజయభేరి మోగించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు 470 మార్కులకు 467 సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో నార్సింగ్‌కు చెందిన హర్షిత 1000కి 993, బైపీసీ సెకండియర్‌లో పి.మధుమిత 1000కి 993 మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో 470కి 467 మార్కులను ముగ్గురు విద్యార్థులు సాధించారు. నలుగురు 466 మార్కులు పొందారు. మణికొండకు చెందిన అక్షయ ఫస్టియర్ ఎంపీసీలో 470కి 469 మార్కులు సాధించింది.

నిరుపేద పిల్లలు.. విద్యా కుసుమాలు

బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన సాయికీర్తి వెస్ట్ మారేడుపల్లిలోని మెడ్‌జీ క్లాసెస్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. తాజాగా విడుదలైన పరీక్ష ఫలితాల్లో 470 మార్కులకు 466 మార్కులు సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన సాయికీర్తి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడంతో స్థానికులు అభినందించారు. లాలాపేట్ శాంతినగర్‌కు చెందిన ఏ.వాసవి ఎంపీసీ ఫస్టియర్‌లో 465 మార్కులు సాధించింది. సికింద్రాబాద్ మహేంద్రాహిల్స్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదువుతున్న మమత ఎంపీసీ సెకండియర్‌లో 992 మార్కులు సాధించింది.



తల్లిదండ్రులతో సాయికీర్తి, వాసవి

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విజ్ఞాన్ విద్యార్థులు



బి. లహరిక(993) | టి. రోహిత్ (991) | జి. ఆదిత్య(990) | జి. సంజన(977)

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో నిజాంపేట, మేడ్చల్ విజ్ఞాన్ జూనియర్ కాలేజీ బ్రాంచ్‌లలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చాటారని సంస్థ వైస్ చైర్మన్ రాణీ రుద్రమదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో బి.లహరిక 993, ఎస్.అఖిల 991, టి.రోహిత్ 991, జి.ఆదిత్య 990, ఎం.ఉమారాణి 988, సీహెచ్ ఆస్మిత 987, జి.రాహుల్ 985 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఎ.అక్షయ 467, బి.చంద్రశేఖర్ రెడ్డి 467, ఆర్. సాయి శ్రీనివాస్ 467, ప్రశాంతి ఠాకూర్ 465, ఎన్.జాన్వీ 464, ఎ.వెన్నెల 464, బి.చాత్రిక 464, పి.వేద ఋషి 464, జి.ఉమేష్ చంద్ర 464, సీహెచ్.శరణ్య 463, పి.రితిక 463, యు.శ్రీ రమ్య వర్షిత 463, ఐ రితికా రెడ్డి 462, వి.లక్ష్మీ ప్రసన్న 462, ఈ మైథిలి 462, కె.శ్రీకర్ 462, సీహెచ్ నవ్య శ్రీ 461, పి.శ్రీజ 460, కె.లోకేశ్వర్‌రెడ్డి 460 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీ గ్రూప్‌లో సీనియర్ ఇంటర్‌లో అత్యధికంగా 977 మార్కులు, జూనియర్ ఇంటర్ బైపీసీ గ్రూపులో 440 మార్కులకు అత్యధికంగా 430 మార్కులు సాధించారని వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్, ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫస్ట్.. సెకండ్.. బాలికలే టాప్

(5వ పేజీ తరువాయి)

విభాగంలో బాలురు మొత్తం 39,503 మంది పరీక్ష రాయగా, 28,537 (72.24 శాతం) పాసయ్యారు. ఇదే అమ్మాయిలు 37,464 మంది పరీక్షకు హాజరుకాగా, 30,690 మంది (81.92 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మేడ్చల్ జిల్లాలో 36,502 మంది బాలురు పరీక్ష రాయగా, 26,842 మంది (73.54 శాతం) పాసయ్యారు. 30,764 మంది బాలికలకు గాను 25,348 మంది (82.40 శాతం) ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో బాలురు 41,657 మంది పరీక్షకు హాజరుకాగా, 24,971 మంది (60.00 శాతం) మంది పాసయ్యారు. అమ్మాయిలు 39,899 మంది పరీక్ష రాస్తే 29,659 మంది (74.03 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే, సెకండియర్‌లో రంగారెడ్డి జిల్లాలో 34,884 మంది బాలురకు, 25,711 మంది (73.70 శాతం) పాసయ్యారు. 32,702 మంది బాలికలకు 26,815 మంది (82.00 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 33,193 బాలురకు హాజరుకాగా, 24,748 (74.56 శాతం) మంది పాసయ్యారు. ఇదే జిల్లాలో 28,312 మంది అమ్మాయిలు పరీక్ష రాస్తే, 23,274 మంది (82.21 శాతం) ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో 35,041 మంది బాలురు పరీక్ష రాస్తే 20,927 మంది (59.72 శాతం) పాసయ్యారు. ఇదే జిల్లాలో అమ్మాయిలు 36,026 మంది పరీక్షకు హాజరు కాగా 27,037 మంది (75.00 శాతం) పాసయ్యారు.

మూడేళ్లుగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఒకేషనల్ కోర్సు ఫలితాలు



గచ్చిబౌలి-కొండాపూర్ ఫ్లైఓవర్ పనులను మే 15లోగా పూర్తి చేయండి

ఇంజనీరింగ్ అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు చేపట్టిన ఫ్లైఓవర్ పనులను మే 15వ తేదీ లోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయంలో కమిషనర్ ప్రాజెక్టు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, భూ సేకరణ అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కలెక్టర్‌లతో ఎస్ఆర్‌డీపీ పనులపై సమీక్షించారు. శిల్పా లే ఔట్ రెండో దశఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో సర్వీస్ రోడ్డు పూర్తిచేయడానికి 5 ఆస్తుల సేకరణ పూర్తయితే మే 15 వరకు అందుబాటులోకి తీసుకురావచ్చని చీఫ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి 5 ఆస్తులను సత్వరమే సేకరించాలన్నారు. శాస్త్రిపురం, ఫలక్‌నుమా ఆర్‌ఓబీ పనులు పనులు కొనసాగుతున్నాయని, జూన్ వరకు పూర్తవుతాయని చీఫ్ ఇంజనీర్ తెలిపారు. రైల్వే పనులు త్వరగా పూర్తి చేసేందుకు రైల్వే చీఫ్ ఇంజనీర్‌తో సమన్వయం చేసుకొని ఆర్‌ఓబీ పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఎస్ఆర్‌డీపీ ద్వారా చేపట్టిన పనులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు జోనల్ కమిషనర్‌లు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఎప్పటికప్పుడు పెండింగ్ భూ సేకరణపై జోనల్ స్థాయిలో సమీక్షించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ప్రాజెక్టు సీఈ భాస్కర్‌రెడ్డి, భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్, ప్రాజెక్టు ఎస్ఈలు, ఈఈలు, డిప్యూటీ ఈఈలు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బిగ్ ఫైట్

● నేడు సన్‌రైజర్స్-ముంబై ఇండియన్స్ మ్యాచ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ ఐపీఎల్ సీజన్‌లోనే నగరంలో జరిగే ఆసక్తికర మ్యాచ్‌కు ఉప్పల్ స్టేడియం ముస్తాబైంది. ఐపీఎల్ ఫ్రాంచైజీల్లోని బిగ్-3 టీమ్‌ల్లో ఒకటైన ముంబై ఇండియన్స్‌తో సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ బుధవారం తలపడనుంది. ముంబై మాజీ సారథి రోహిత్ శర్మతోపాటు లోకల్ క్రికెటర్ తిలక్ వర్మ బ్యాటింగ్ విన్యాసాలు చూసేందుకు అభిమానులు ఆసక్తితో వేచి చూస్తున్నారు. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్స్‌లో తిలక్, నితీశ్ కుమార్ రెడ్డి, సూర్యకుమార్ యాదవ్‌తోపాటు ఇరు జట్ల క్రికెటర్లు తీవ్రంగా చెమటోడ్చారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ముందు జాగ్రత్తగా స్టేడియంలోని పిచ్‌పై కవర్లు కప్పి ఉంచారు.

బ్రాండెడ్ పేరుతో నకిలీ ఉత్పత్తులు

ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేస్తున్న ముఠా ఆటకట్టు

ముగ్గురు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ పేరుతో నకిలీ ఉత్పత్తులు తయారు చేసి ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేస్తున్న ఢిల్లీ సైబర్ ముఠా ఆటకట్టించారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి పలు కంపెనీలకు చెందిన సోప్‌బార్స్-80, స్కిన్ కేర్ సబ్బులు 20, ల్యాప్‌టాప్, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైమ్ డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్ రిజిస్టర్డ్ కంపెనీ ప్రారంభించి చర్మ సౌందర్య, జుట్టు సంరక్షణకు సంబంధించిన కాస్మెటిక్స్ తయారు చేసి విక్రయిస్తున్నారు. అదే పేరుతో నకిలీ ఉత్పత్తులు తయారు చేసి కొంతమంది ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేసి విక్రయిస్తున్నారు. దీన్ని గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు బృందం సాంకేతిక ఆధారాలు సేకరించింది. ఆన్‌లైన్‌లో నకిలీ వస్తువులు మార్కెటింగ్ చేస్తున్న వెబ్‌సైట్‌ను గుర్తించారు. ఢిల్లీకి చెందిన నిందితులు నిఖిల్, మోహిత్ శర్మ, సోనూకుమార్‌గా గుర్తించారు. వారు కాపీ రైట్స్ ఉల్లంఘించి వేరే వారి ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఢిల్లీకి వెళ్లిన పోలీసు బృందం నిందితులను అరెస్టు చేసి పిటీ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు.

పనిచేయని సీసీ కెమెరాలు ఎందుకు?

● ఏడాదిగా బాలుడి జాడ కనిపెట్టలేకపోతున్నారు ● పోలీసులపై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామంటూ లెక్కలు చెప్పడం కాదని, అవి శాంతిభద్రల పరిరక్షణకు ఉపయోగపడనప్పుడు ఎన్ని ఉన్నా ఏం లాభమని హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. హైదరాబాద్‌కు చెందిన ఓ బాలుడి అదృశ్యం కేసు విచారణ సందర్భంగా పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. బాలుడు ఇంటి నుంచి బయటికి వస్తే సీసీ కెమెరాల్లో కనిపిస్తుంది కదా అని ప్రశ్నించింది. నిర్వహణ లేకుండా తూతూమంత్రంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజాధనం ఎందుకు వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. తన కుమారుడు లచ్చన్న అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన పోలవరపు రాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి. వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఏడాదిగా బాలుడి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ సీసీటీవీ కెమేరాల నిర్వహణపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఏడాదిగా బాలుడి ఆచూకీ కనిపెట్టలేకపోతున్నారని, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది.

వృద్ధుడి మూత్రపిండాలకు అరుదైన శస్త్రచికిత్స

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాడైన మూత్రపిండాలు, మూత్రనాళానికి అరుదైన చికిత్స చేసి పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ వృద్ధుడి ప్రాణాలు కాపాడారు ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు. వృద్ధుడికి 2023లో మూత్రపిండాల్లో రాళ్లు తీయడానికి శస్త్రచికిత్స చేశారు. తర్వాత అతడి మూత్రనాళాలు పూర్తిగా పూడుకుపోయాయి. దీంతో క్రియాటినిన్ పెరిగిపోయి, విపరీతమైన నొప్పి, తరచూ జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు కిడ్నీలు పాడవడంతో తాత్కాలికంగా ట్యూబ్‌లు (నెఫ్రోస్టమీలు) అమర్చి బయటి నుంచి మూత్రం పంపేవారు. ఇటీవల అతడు ఏఐఎన్‌యూకు వచ్చాడు. వైద్యులు అతడిని పరీక్షించి మూత్రనాళాలు పూడుకుపోయినట్లు గుర్తించారు. అతడి అపెండిక్స్‌ను పూడుకుపోయిన మూత్రనాళం స్థానంలో అమర్చామని రోబోటిక్ సర్జన్, యూరాలజిస్టు డాక్టర్ సయ్యద్ మహమ్మద్ గౌస్ వివరించారు. రోగి కిడ్నీలకు అధునాతన శస్త్రచికిత్సలు చేశామని, ప్రస్తుతం వృద్ధుడు కోలుకున్నాడని ఆస్పత్రి ఎండీ డాక్టర్ సి. మల్లికార్జున తెలిపారు.

పారిశ్రామికవేత్త ఇంట్లో చోరీ కేసు ఛేదనకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి అమ్మవారి ఆలయం వద్ద పారిశ్రామికవేత్త ఇంట్లో చోరీ కేసు ఛేదించడానికి నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి ఇండస్ట్రియలిస్ట్ హేమరాజు దంపతులకు నేపాలీ పనిమనుషులు మత్తు మందు కలిపిన డ్రింక్స్ ఇచ్చినట్లు సమాచారం. వారు అపస్మారకస్థితిలోకి చేరుకోగానే అర్ధరాత్రి 12 గంటల సమయంలో బీరువా లాకర్‌ను పగులగొట్టి బంగారం, నగదు తీసుకొని యజమాని కారులోనే పారిపోయారు. చోరీలో నేపాల్‌కు చెందిన ఓ మహిళ, నలుగురు పురుషులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. కారును సంతోష్‌నగర్ ఐఎస్ సదన్ వద్ద వదలి పారిపోయారు. కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నేపాలీయులు అక్కడి నుంచి ఆటోలో వెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలను జల్లెడపడుతున్నారు. హేమరాజు దంపతులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు కోలుకున్న తర్వాత చోరీ అయిన సొత్తు ఎంత అనేది తెలియనున్నది. నేపాలీలో నగరం నుంచి పారిపోకుండా సరిహద్దులలో పోలీసులు నిఘా పెట్టినట్టు తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల మారణహోమాన్ని నిలిపివేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని ఊసాలార్, కర్రెగుట్టను చుట్టుముట్టి పోలీసులు నిర్వహిస్తున్న మారణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని పలు పౌర ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ లక్ష్మణ్.గడ్డం, ఎన్.నారాయణరావు, భారత్ బచావో అధ్యక్షుడు గాదె ఇన్నయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు నాగభూషణం, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి, తెలంగాణ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు శ్రీహరి, విరసం కార్యవర్గ సభ్యుడు రాములు, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి షేక్ షావలి తదితరులు మాట్లాడారు. ఎదురుకాల్పులు, హత్యాకాండను నిలుపుదల చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావాలని, రాహుల్‌గాంధీ కూడా చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.



పురస్కార గ్రహీతలతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ధర్మారావు

'ఇట్కలా' విశ్వ తెలుగు వెలుగు పురస్కారాలు ప్రదానం

పంజాగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాలలో విశేష సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులకు సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక, సారస్వత సంఘం(ఇట్కలా) 2025 విశ్వ తెలుగు వెలుగు పురస్కారాలను అందజేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ మృదంగ విద్వాంసుడు డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, లయన్ ఏ.నటరాజ్, రైల్వే మాజీ జీఎం సి. రామకృష్ణ, డాక్టర్ బింగి నరేందర్‌గౌడ్‌కు పురస్కారాలను అందజేశారు. తెలుగు భాష, సంస్కృతిని పెంపొందిస్తున్న సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కె. ధర్మారావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో పురస్కారాల కమిటీ కన్వీనర్ వాస్తు ప్రవీణ, పి.కృష్ణాది శేషు తదితరులు పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకం

బర్కత్‌పుర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకం అని ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు. వారి జీవితాలు, పోరాట పటిమను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సామాజిక మార్పునకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మంగళవారం నిజాం కళాశాల ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, విద్య సమానత్వం కోసం వారు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ మాట్లాడుతూ మహనీయుల జీవితాలు విద్యార్థులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రేణుక, కో-ఆర్డినేటర్ డాక్టర్ మెలిస్సా తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

బర్కత్‌పుర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ. 7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. కాకతీయ, శాతావాహన, పాలమూరు, మహాత్మాగాంధీ తెలంగాణ యూనివర్సిటీల పరిధిలోని కళాశాలలు ప్రాక్టికల్, థియరీ పరీక్షలను బైకాట్ చేశాయని, దీని వల్ల జాతీయ యూనివర్సిటీల ప్రవేశ పరీక్షల్లో తెలంగాణ విద్యార్థులు సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

సదుపాయాల కల్పనలో లోకో పైలట్‌లు, రన్నింగ్ స్టాఫ్‌నకు అధిక ప్రాధాన్యం

బర్కత్‌పుర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే సిబ్బందికి సదుపాయాల కల్పనలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ మేనేజర్ లోకేష్ విష్ణోయ్ తెలిపారు. మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో లోకో పైలట్‌లు, రన్నింగ్ స్టాఫ్‌కు కల్పిస్తున్న సదుపాయాలను మీడియాకు వివరించారు. వారికి అన్ని రకాల వసతులతో విశ్రాంతి గదులు ఏర్పాటు చేశామన్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రన్నింగ్ రూమ్‌లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే 24 మందికి సౌకర్యవంతమైన వసతి కల్పిస్తున్నామన్నారు. సిబ్బందికి పరిశుభ్రపరమైన ఆహారం, రీడింగ్ రూమ్, ధ్యానం కోసం యోగా గది అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ కమల్‌కాంత్, సీనియర్ డీఓఎం విద్యాధర్, సీనియర్ డీఎస్సీ నీలాపావని, సీనియర్ డీసీఎం అనురుద్ పామర్, సీనియర్ డీఈ కో-ఆర్డినేషన్ దుర్గాప్రసాద్, సీనియర్ డీఎంఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా సరఫరా చేస్తున్న నిషేధిత దగ్గు సిరప్ బాటిళ్లు స్వాధీనం

● నలుగురు నిందితుల అరెస్టు

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కోడిన్ ఆధారిత దగ్గు సిరప్స్ అక్రమంగా విక్రయిస్తున్న ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పట్టుకున్నారు. ఓ మహిళ నిషేధిత కోడిన్ పాస్ఫేట్ సిరప్ విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. నిఘా పెట్టారు. స్కూటీపై ఆమె 13 బాటిళ్లు తీసుకెళ్తుండగా మౌలాలి బ్రిడ్జి వద్ద పట్టుకున్నారు. ఆమె పేరు రజని అని తేలింది. విచారించగా విద్యానగర్‌లోని జనరిక్ మెడికల్ షాపు నుంచి తీసుకెళ్తున్నట్టు తెలిపింది. అధికారులు ఆ మెడికల్ షాపులో తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో కోడిన్ సిరప్ బాటిళ్లు లభించాయి. వాటిని ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారని విచారించగా.. ఓల్డ్‌బోయినపల్లి ఆర్ఆర్‌నగర్‌లో హిమాలయ ఫార్మసీ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఆ షాపులో తనిఖీ చేయగా 80 బాటిళ్ల నిషేధిత కోడిన్ ఫాస్ఫేట్ సిరప్‌లు లభించాయి. ఫార్మసీని సీజ్ చేశారు. రజని, అన్‌మోల్‌కుమార్, సింఘాల్, దినేష్‌కుమార్ గోయల్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఏఈఎస్ జె.జీవన్ కిరణ్, సీఐ బాలరాజు, ఎస్ఐ రవి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు డి.సరిత, కె.ప్రభాకర్, బి.గోవింద్‌సింగ్, పి.రేణుక, ఇ. తిరుపతిరావు, ఇ.నరేష్‌రెడ్డి, ఐ.శ్రీకాంత్ పాల్గొన్నారు.

శానిటరీ ప్యాడ్ల ఫ్యాక్టరీపై బీఐఎస్ దాడులు

ఐఎస్ఐ ముద్రలేని 30 వేల ప్యాడ్ల జప్తు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ఐ మార్కులేని శానిటరీ ప్యాడ్లు సరఫరా చేస్తున్న ఓ కేంద్రంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కుషాయిగూడలోని ఓ కేంద్రంలో మంగళవారం జరిపిన సోదాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 30 వేల ప్యాడ్లు, 7 వేలకు పైగా లేబుల్ కవర్లకు ఐఎస్ఐ మార్కు లేనట్లు గుర్తించిన అధికారులు వాటిని జప్తు చేశారు. మహిళల ఆరోగ్య రక్షణ కోసం ఐఎస్ 5405:2019 ప్రమాణాలున్న శానిటరీ ప్యాడ్లను భారత ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ గెజిట్ ద్వారా బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. బీఐఎస్ ధ్రువీకరణ పొందకుండా అమ్మినా, తయారు చేసినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కుషాయిగూడలోని ఓ కేంద్రంలో ఎలాంటి ధ్రువీకరణ లేకుండా పెద్ద ఎత్తున శానిటరీ న్యాప్‌కిన్లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో సోదాలు నిర్వహించినట్లు బీఐఎస్ హైదరాబాద్‌శాఖ సంచాలకులు పీవీ శ్రీకాంత్ తెలిపారు.





ఓ వైపు ఉద్యోగం చేస్తూ.. మరో వైపు గృహిణిగా ఇంటి వ్యవహారాలను చూసుకొంటూ సివిల్స్‌లో 451 ర్యాంకు సాధించారు నగరానికి చెందిన రాపర్తి ప్రీతి. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆమె... చిన్నప్పటి నుంచీ తన తండ్రి కష్టాన్ని చూసి పెరిగారు. నాన్న తనపై పెట్టుకున్న నమ్మకం... భర్త ప్రోత్సాహం... కోచింగ్ లేకుండానే సివిల్స్ ర్యాంకు సాధించిన ప్రీతిని 'నవ్య' పలుకరించింది.

వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ

"మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మాది. మధ్య తరగతి కుటుంబం. ఆర్థికంగా చాలా వెనుకబడి ఉండడంతో కుటుంబం కోసం మా అమ్మ అర్చన, నాన్న రాపర్తి నందకిశోర్ చాలా కష్టపడ్డారు. అన్నయ్య, నేను... ఇద్దరు సంతానం. నేను కీస్ హైస్కూల్‌లో చదివాను. 2016లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యాను.

పాపను చూసుకొంటూ...

సివిల్స్‌కు నేను ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. 2019లో మొదటిసారి సివిల్స్ పరీక్ష రాస్తే... మెయిన్స్ వరకు వెళ్లాను. 2021లో నాకు పెళ్లయింది. నా పెళ్లి తరువాత మా నాన్న చనిపోయవారు. నాకు మూడేళ్ల పాప. తనను చూసుకొంటూనే ఉద్యోగం చేసుకుంటున్నాను. కొవిడ్ నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ కావడం కాస్త కలిసొచ్చింది. ఇంట్లో పాపను, కుటుంబాన్ని చూసుకుంటూ ఉద్యోగం చేసుకొనే అవకాశం లభించింది.

మావారి ప్రోత్సాహంతో...

ఎలాగైనా సివిల్స్ సాధించాలన్నది నా కల. మావారు ఆదిమూలం శివప్రసాద్ నాకు అండగా నిలిచారు. నన్ను ప్రోత్సహించారు. అయితే చంటిపాప, ఇంటి పనులు, ఉద్యోగం... వీటన్నిటితో సివిల్స్‌కు సన్నద్ధమవ్వడం సాధ్యం కాదేమోననే సందేహం కలిగింది. అదే విషయం ఆయనకు చెబితే... 'ఇంటి పనులు, ఉద్యోగం వదిలేసైనా సరే సివిల్స్ కోచింగ్‌కు వెళ్లమన్నారు. సివిల్స్ పరీక్ష రాసి నాలుగేళ్లు అవుతుందని, కొత్త తరంతో పోటీపడడం కష్టమని అన్నాను. కానీ ఆయన నాలో స్ఫూర్తి నింపారు. దాంతో రెండేళ్ల కిందట పట్టుదలగా సివిల్స్ కోసం ప్రిపరేషన్ ప్రారంభించాను.

ఆన్‌లైన్‌లోనే...


కోచింగ్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే సమాచారం సేకరించాను. నాకున్న సందేహాలను కూడా ఆన్‌లైన్ ద్వారానే నివృత్తి చేసుకున్నా. వర్క్ ఫ్రమ్ హోమ్ నాకు చాలా కలిసివచ్చింది. అప్పుడప్పుడూ ఆఫీసుకు వెళ్లేదాన్ని. మా కుటుంబం కూడా అండగా నిలిచింది. అన్నీ సమన్వయం చేసుకుంటూ కష్టపడ్డాను. ఇంటర్వ్యూకు ఎంపికయినప్పుడు కూడా ఎలాంటి కోచింగ్‌కూ వెళ్లలేదు. ఇంటర్వ్యూ విధానం... జవాబులివ్వాల్సిన పద్ధతి తదితర విషయాలన్నీ ఆన్‌లైన్‌లోనే తెలుసుకున్నా.

హైడ్రా గురించి ఆరా...

ఇంటర్వ్యూలో హైడ్రా గురించి అడిగారు. తెలంగాణలో చిన్న జిల్లాల ఏర్పాటుతో లాభనష్టాలు, రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోవడానికి గల కారణాలను కూడా అడిగారు. ఇక నేను చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి సంబంధించి ప్రశ్నలు వేశారు. ఎక్కడా తడబడకుండా నాకు తెలిసిన విషయాలను చెప్పాను. ఇంటర్వ్యూ నాకు చాలా సంతృప్తినిచ్చింది. 451 ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. ర్యాంకు వస్తుందని ఊహించలేదు. చంకలో బిడ్డ, ఉద్యోగం, కుటుంబం... అన్నీ చూసుకొంటూ సివిల్స్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వడం కష్టమే. కానీ... నా లక్ష్యం ముందు అవన్నీ చిన్నవే అనిపించాయి."

• బయ్యు దామోదర్

విన్నర్



'గోడలకు ఉన్న బీటలు బలహీనతలు కావు... అవి కాంతి లోపలికి రావటానికి కారణాలు'... శక్తి దూబేకు అత్యంత ఇష్టమైన మాటలివి. ఆమె దృష్టిలో బలహీనతలనేవి పరాజయాలకు కారణాలు కావు. కొత్త కొత్త మార్గాలను అన్వేషించటానికి మార్గాలు. ఈ మాటలను గాఢంగా నమ్మిన శక్తి దూబే మంగళవారం యూపీఎస్‌సీ విడుదల చేసిన జాబితాలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.

మార్పు కోరే 'శక్తి'

సాధారణంగా యూపీఎస్‌పీ పరీక్షలో మొదటి ర్యాంకుల్లో నిలిచినవారు ఏళ్ల తరబడి చదువుతూనే ఉంటారని, బయట ప్రపంచాన్ని పట్టించుకోరని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ శక్తి దూబే ప్రస్థానం చూస్తే వారి అభిప్రాయం కచ్చితంగా మారుతుంది. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ)లో చదువుతున్న సమయంలో హాస్టల్‌లో స్నేహితులతో కూర్చుని మన చుట్టూ జరిగే అనేక విషయాల గురించి చర్చించటం, అర్ధరాత్రి దూరంగా ఎక్కడో పోలీస్ సైరన్ వినిపిస్తే 'నాకు ఏం పర్వాలేదు' అనుకోవటం లాంటి రకరకాల ఘటనలు ఆమెను ముందుకు నడిపించాయి. విజేతగా నిలిచేలా చేశాయి. శక్తి స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్. ఆమె తండ్రి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తారు. తల్లి గృహిణి. ప్రయాగ్‌రాజ్‌లో స్కూలు చదువు పూర్తయిన తర్వాత శక్తి వారణాసిలోని బీహెచ్‌యూలో చేరారు. అక్కడ హాస్టల్ వాతావరణం తనకు అనేక పాఠాలు నేర్పిందంటారు శక్తి. 'స్టూడెంట్ డిబేటింగ్ కమిటీ'కి నేతృత్వం వహించటంవల్ల ఆమెకు అనేక కొత్త విషయాలు తెలియటం మొదలయింది. "నాకు వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలనే కోరిక ఉండేది. వాటిని ఎలా మెరుగుపరచాలనే విషయాన్ని ఆలోచించేదాన్ని" అంటారు శక్తి.

స్ఫూర్తి అదే...

యూపీఎస్‌సీ పరీక్షలు రాయాలనే స్ఫూర్తి ఇతరులను చూసి వస్తుంది. కుటుంబంలో ఎవరైనా సివిల్ సర్వెంట్స్ ఉంటే వస్తుంది. కానీ శక్తికి మాత్రం క్యాంపస్‌లో రాత్రిళ్లు అదనపు క్లాసులకు వెళ్లివస్తున్నప్పుడు పోలీస్ జీప్ సైరన్ విన్నప్పుడు వచ్చింది. "దూరంగా ఎక్కడో పోలీస్ పెట్రోల్ వాహనం సైరన్ వింటే నాకు చాలా ధైర్యం కలిగేది. 'పబ్లిక్ సర్వీస్‌లో ఉంటే ప్రజలకు ఎంతో ధైర్యం ఇవ్వవచ్చు' అనే ఆలోచన నాలో చాలా ఆలోచనలు రేకెత్తించింది" అంటారు శక్తి. "ఆ ఆలోచన పదేపదే రావడంతో నా కుటుంబ సభ్యులతో ఈ విషయం గురించి మాట్లాడాను. ధైర్యం కలగటం అనేది భావోద్వేగాలకు సంబంధించిన విషయం. కానీ దాని

> "దూరంగా ఎక్కడో పోలీస్ పెట్రోల్ వాహనం సైరన్ వింటే నాకు చాలా ధైర్యం కలిగేది. 'పబ్లిక్ సర్వీస్‌లో ఉంటే ప్రజలకు ఎంతో ధైర్యం ఇవ్వవచ్చు' అనే ఆలోచన నాలో చాలా ఆలోచనలు రేకెత్తించింది."

వెనక ఒక బలమైన లాజిక్ ఉంది. ఈ రెండూ కలిసి ఉన్నాయి కాబట్టే యూపీఎస్‌సీ పరీక్షలు రాయాలనుకున్నాను. అమ్మ, నాన్న నాకు అండగా నిలిచారు" అన్నారు శక్తి.

ఆ కవితలు...

శక్తికి కవితలు రాయటం ఒక అలవాటు. సాధారణంగా కవయిత్రులు భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. కానీ శక్తి దానికి పూర్తి విరుద్ధం. తన అభిప్రాయాలను చాలా సూటిగా, స్పష్టంగా చెబుతారు. సామాన్య ప్రజల అవసరాలను పట్టించుకోకుండా చేసే సంస్కరణలవల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదనేది ఆమె స్పష్టమైన అభిప్రాయం. "మన దేశంలో పోలీసు వ్యవస్థ 1861 పోలీస్ చట్టం పరిధిలోనే ఇంకా పని చేస్తోంది. ఆ సమయంలో ఈ చట్టాన్ని ప్రజలను నియంత్రించడానికి ప్రవేశపెట్టారు. సేవ చేయటానికి కాదు. ప్రస్తుతం మన అవసరాలు వేరు. వాటికి తగ్గట్టుగా మారాలి. పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు కానిస్టేబుల్ స్థాయి నుంచి మొదలవ్వాలి. ఉన్నతాధికారుల నుంచి కాదు" అంటారు శక్తి. యూనిఫాం సివిల్‌కోడ్ విషయంలో కూడా ఆమెకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. "యూపీ విషయాన్నే తీసుకుందాం. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు అనేక రకాల ఇబ్బందులు పడుతూ ఉంటారు. యూనిఫాం సివిల్ కోడ్‌వల్ల మహిళలకు సమాన హక్కులు లభిస్తాయి. గృహ హింస, కట్నాల కోసం వేధింపులు తగ్గుతాయి" అంటారామె. అయితే దీనిని అమలు చేయటం అంత సులభం కాదనే విషయం కూడా శక్తికి తెలుసు.

"ఒకేసారి యూనిఫాం సివిల్‌కోడ్‌ను అమలు చేస్తే విమర్శలు, వ్యతిరేకత రావచ్చు. అందరి అభిప్రాయాలూ తీసుకొని నిదానంగా ప్రవేశపెడితే మంచిది" అంటారామె. యూపీఎస్‌సీలో ఆమె అంతర్జాతీయ సంబంధాలను ఒక సబ్జెక్ట్‌గా ఎంచుకున్నారు. ప్రస్తుత ప్రపంచంలో మన దేశానికి ఉన్న ప్రాధాన్యత గురించి ఆమెకు స్పష్టమైన అవగాహన ఉంది. "పర్యావరణ విషయంలో మనం ఇతరులకు మార్గదర్శకంగా ఉన్నాం. అంతర్జాతీయ సోలార్ అలయెన్స్ లాంటి వాటికి నేతృత్వం వహిస్తున్నాం" అని చెబుతున్నారు శక్తి.

చిత్రజ్యోతి
SINCE 1965



జూన్ 14న గద్దర్ అవార్డులు

తెలుగు సినీ రంగంలో అవార్డుల ప్రధానోత్సవానికి రంగం సిద్ధమైంది. జూన్ 14న గద్దర్ తెలుగు ఫిల్మ్ అవార్డులను అందించనున్నట్లు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో నిర్వహించిన గద్దర్ అవార్డుల జ్యూరీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గద్దర్ అవార్డులను ఇవ్వడానికి 15మందితో కూడిన జ్యూరీ ని ఏర్పాటుచేశామన్నారు. ఆ జ్యూరీ కమిటీ 2024 ఏడాదిలో వచ్చిన సినిమాలలో కొన్నింటిని ఎంపిక చేసి మే చివరి నాటికి "గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు" కమిటీకి పంపుతుందన్నారు. ఆ తరువాత జ్యూరీ పంపిన వివరాలను పరిశీలించి, అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కాగా మంగళవారం ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన జ్యూరీ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గద్దర్ సినిమా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నభూతో న భవిష్యత్తు అన్నట్టుగా జరపాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రపంచ స్థాయిలో సినిమా అవార్డుల ఫంక్షన్ ఏ విధంగా నిర్వహిస్తారో అందుకు ఏమాత్రం తగ్గకుండా గద్దర్ సినిమా అవార్డుల కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాదులో నిర్వహించబోయే గద్దర్ చలనచిత్ర అవార్డుల ఫంక్షన్ గురించి ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకొనే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని కమిటీ సభ్యులు, అధికారులకు సూచించారు. రాగద్వేషాలకు అతీతంగా అవార్డులకు సినిమాలను ఎంపిక చేయాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. సినీ పరిశ్రమకు కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టిన వ్యక్తుల పేరిట అవార్డులు ఇస్తున్నామని, ఇవి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు.

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)

మంచి సినిమా చేశాననే తృప్తినిచ్చింది

- విజయశాంతి



'ఓ మంచి సినిమా చేశాననే తృప్తిని 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' ఇచ్చింది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు సీనియర్ నటి విజయశాంతి. కల్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలై సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా విజయశాంతి మీడియాతో మాట్లాడుతూ 'చాలా విరామం తర్వాత ఒక శక్తిమంతమైన పాత్రలో నటించాను. ప్రేక్షకులు విజయశాంతిని ఎలాంటి పాత్రలో చూడాలని అనుకున్నారో ఈ సినిమాతో అది నెరవేరింది. ఇప్పుడు యాక్షన్ అనేది ఒక రకంగా నాకు ఛాలెంజ్. అయినా చేశాను. పోలీస్ పాత్రలకు నేనైతేనే బాగుంటుందని ప్రేక్షకులు కూడా బలంగా ఫిక్స్ అయిపోయారు. తల్లీకొడుకుల బంధాన్ని, వారికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఈ సినిమాలో బలంగా చూపించాం. చాలా మంది మహిళలు ఫోన్ చేసి సినిమా అద్భుతంగా ఉంది అని అంటున్నారు' అని చెప్పారు.

ఆస్కార్ అవార్డులు.. సరికొత్త మార్పులు



వచ్చే ఏడాది జరగనున్న 98వ ఆస్కార్ అవార్డు వేడుక వివరాలను కమిటీ ప్రకటించింది. 2026 మార్చి 15న ఈ వేడుకను నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే, కొన్ని నూతన నిబంధనలను ప్రవేశపెట్టింది. ఓటింగ్ విధానంలో కఠిన నిబంధనలతో మార్పులు చేసింది. ఇకపై సినిమాకు ఓట్ చేసే ముందు నామినేట్ అయిన ప్రతీ చిత్రాన్నీ అకాడమీ సభ్యులు తప్పనిసరిగా వీక్షించాలని పేర్కొంది. ఈ విధానం సరిగ్గా అమలు పరిచేందుకు అకాడమీ సభ్యుల వాచింగ్ హిస్టరీపై నిఘా ఉంచనుంది. అలాగే, అఛీవ్‌మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కేటగిరినీ ప్రవేశపెట్టడంతో పాటు, ఈ విభాగంలో రెండు దశల్లో ఓటింగ్ జరుగుతుందని వెల్లడించింది. ఆస్కార్ కోసం పోటీపడుతున్న చిత్రాలను వచ్చే ఏడాది జనవరి 22న ప్రకటించనున్నారు.

ఇకపై ఏఐ చిత్రాలకూ అవార్డులు

ఇటీవల సినిమాల్లో కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని వాడుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చే ఏడాది నుంచి ఏఐ కేటగిరీలో తెరకెక్కిన చిత్రాలకూ పురస్కారాలు అందించనున్నారు. అయితే, ఈ సాంకేతికతతో తెరకెక్కిన చిత్రాల వల్ల ఇతర సినిమాల విజయావకాశాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆస్కార్ కమిటీ పేర్కొంది. మానవసృజనకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసింది.

యాక్టర్‌నే కాదన్నారు



'ఇండస్ట్రీలోకి రాకముందు నా జాతకం చూపిస్తే 'నువ్వు యాక్టర్‌వి కాలేవు' అని చెప్పారు. నేను అవన్నీ పట్టించుకోలేదు. మా అమ్మ తన కొడుకు ఏమైపోతాడో అని అలా జాతకం చూపించారు. కానీ నేను నా మీద నమ్మకంతో ఇండస్ట్రీలోకి వచ్చాను. చేసే పని మీద నమ్మకం పెట్టుకుంటున్నానంతే' అని అన్నారు హీరో ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా ప్రియదర్శి మీడియాతో మాట్లాడుతూ 'కామన్ మ్యాన్ పాత్ర ఎక్కువ మందికి కనెక్ట్ అవుతుందని నా నమ్మకం. 'మల్లేశం', 'సారంగపాణి' లాంటి సగటు జీవి పాత్రలను మన చుట్టూ చూస్తుంటాం. ఓ కామన్ మ్యాన్ కథే ఈ సినిమా. జాతకాలు నమ్మాలి అని కానీ, నమ్మకూడదు అని కానీ మేం చెప్పలేదు. ఒకరి నమ్మకాలను ఇంకొకరి మీద రుద్దితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూపించాం' అని చెప్పారు.

బుమ్రా, మంధానకు విజ్డెన్ అవార్డులు




లండన్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విజ్డెన్ లీడింగ్ క్రికెటర్ అవార్డు దక్కింది. గతేడాది పురుషుల క్రికెట్‌లో ప్రదర్శన ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. మొత్తం మూడు ఫార్మాట్లలో బుమ్రా 86 వికెట్లు తీశాడు. వెస్టిండీస్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగానూ నిలిచిన విషయం తెలిసిందే. గతంలో భారత్ నుంచి సచిన్, సెహ్వాగ్, విరాట్ కోహ్లీలకు ఈ పురస్కారం దక్కింది. ఇక, మహిళల క్రికెట్‌లో స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన లీడింగ్ క్రికెటర్‌గా అవార్డుకు ఎంపికైంది. గతేడాది ఆమె అన్ని ఫార్మాట్లలో కలిపి 1659 పరుగులు చేసి టాప్‌లో నిలిచింది. ఇక టీ20 ఫార్మాట్‌లో లీడింగ్ క్రికెటర్‌గా విండీస్ బ్యాటర్ నికోలస్ పూరన్‌ను ప్రకటించారు. 21 టీ20ల్లో అతను 464 పరుగులు సాధించాడు.

టైటిల్ చేరువలో హంపి

8వ రౌండ్ డ్రా


పుణె: మహిళల చెస్ గ్రాండ్ ప్రీలో తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి సంయుక్తంగా టాప్‌లో కొనసాగుతూ టైటిల్‌కు చేరువైంది. మంగళవారం జరిగిన 8వ రౌండ్‌లో అలీనా కష్లిన్స్కయా (పోలెండ్)తో గేమ్‌ను హంపి డ్రా చేసుకొంది. సలోమ్ మెలియా (జార్జియా)తో గేమ్‌ను ద్రోణవల్లి హారిక, సలిమోవా (బల్గేరియా)తో గేమ్‌ను వైశాలి డ్రా చేసుకొన్నారు. కాగా, చైనా గ్రాండ్‌మాస్టర్ జు జినర్ చేతిలో దివ్యా దేశ్‌ముఖ్ ఓటమిపాలైంది. మొత్తంగా 8 రౌండ్ల నుంచి హంపి, జు జినర్ చెరో 6 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచి టైటిల్ కోసం పోటీపడుతున్నారు. దివ్య (5) మూడో స్థానంలో, హారిక (4) ఐదో స్థానంలో ఉన్నారు. టోర్నీలో మరో రౌండ్ మాత్రమే మిగిలి ఉంది.

నందిని, జ్యోతికి స్వర్ణాలు




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగమ్మాయిలు యర్రాజి జ్యోతి, అగసర నందిని జాతీయ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలతో మెరిశారు. ఈ ప్రదర్శనతో వీళ్లిద్దరు.. వచ్చేనెల కొరియాలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్స్‌కు అర్హత సాధించారు. మంగళవారం కొచ్చిలో జరిగిన ఈ పోటీల్లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి 13.23 సెకన్లలో రేసు పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. హెప్టాథ్లాన్‌లో నందిని 5813 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. పోల్‌వాల్ట్‌లో దేవ్ కుమార్ మీనా జాతీయ రికార్డును బద్దలుకొట్టి స్వర్ణం గెలిచాడు. మహిళల 400 మీటర్ల పరుగులో రూపల్ చౌధురి, పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజాస్ అశోక్ స్వర్ణాలు నెగ్గారు.

తల్లిదండ్రులైన జ్వాల దంపతులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వెటరన్ షట్లర్ గుత్తా జ్వాల, తమిళ నటుడు విష్ణు విశాల్ దంపతులు తల్లిదండ్రులయ్యారు. జ్వాల ఆడబిడ్డకు జన్మనిచ్చిందని విష్ణు సోషల్ మీడియా ద్వారా తెలిపాడు. వీరి పెళ్లి 2021లో జరిగింది.

పెళ్లి కాని మిశ్రా.. భార్యను వేధించాడట!



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ అమిత్ మిశ్రా (42)కు విచిత్రమైన అనుభవం ఎదురైంది. విశ్రాకు వివాహం కాకపోయినా.. కట్నం కోసం భార్యను వేధించాడంటూ అతడిపై కేసు నమోదైందనే వార్త నెట్‌లో చక్కర్లు కొడుతోంది. దీంతో ఈ వార్తలను మిశ్రా ఖండించాడు. రూ. కోటి పరిహారం కోరుతూ అమిత్‌పై భార్య కేసు వేసిందని, పెళ్లి సమయంలో కట్నం కింద రూ. 10 లక్షల నగదు, కారు డిమాండ్ చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొందట. ఇది పూర్తిగా తప్పుడు వార్త అని మిశ్రా చెప్పాడు. అసలు తనకు పెళ్లి కాలేదన్న విషయం అందరికీ తెలుసన్నాడు. తనకు సంబంధంలేని కథనాలకు తన ఫొటోను వాడితే చట్టపరంగా చర్యలు తీసుకొంటానని హెచ్చరించాడు.

'రోస్టర్' వల్లే కామెంట్రీ చేయలేదు

వ్యాఖ్యాత హర్షా భోగ్లే

న్యూఢిల్లీ: ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లకు తనను పక్కనబెట్టారనే వార్తలను కామెంటేటర్ హర్షా భోగ్లే ఖండించాడు. రోస్టర్ విధానం కారణంగా సోమవారం కోల్‌కతా-గుజరాత్ మ్యాచ్‌లో కామెంట్రీ చేయలేదని ఎక్స్‌లో తెలిపాడు. సొంత జట్టుకు క్యూరేటర్ సహకరించకపోతే నైట్‌రైడర్స్‌ను మరో సిటీకి తరలించాలని భోగ్లే, సైమన్ డౌల్ సూచించినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈడెన్‌లో జరిగే మ్యాచ్‌లకు వీరిద్దరినీ పక్కనబెట్టాలని బెంగాల్ క్రికెట్ సంఘం.. బీసీసీఐకి లేఖ రాసింది. ఫలితంగానే ఈడెన్‌లో గుజరాత్‌తో మ్యాచ్‌కు భోగ్లే దూరమయ్యాడన్న వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలోనే భోగ్లే పైవిధంగా స్పందించాడు.

ఆధిక్యంలో బంగ్లా

సిల్హట్: నజ్ముల్ షంటో (60 బ్యాటింగ్) ఆదుకోవడంతో.. జింబాబ్వేతో తొలి టెస్ట్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ పోరాడుతోంది. వర్ష ప్రభావితమైన మూడో రోజైన మంగళవారం ఓవర్‌నైట్ స్కోరు 57/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 194/4 స్కోరు చేసింది. మొత్తంగా బంగ్లా 112 పరుగుల ఆధిక్యంలో ఉంది. మోమినుల్ హక్ (47), హసన్ జాయ్ (33) ఫర్వాలేదనిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 191, జింబాబ్వే 273 రన్స్ చేశాయి.

నేటి మ్యాచ్ — వేదిక హైదరాబాద్
హైదరాబాద్ x ముంబై — రా.7.30 నుంచి

రైజర్స్ గెలిస్తేనే..?

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భీకర బ్యాటింగ్ లైనప్ కలిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలకడలేమి ఆటతో తడబాటుకు గురవుతోంది. బుధవారం ముంబై ఇండియన్స్‌తో తమ 8వ మ్యాచ్ ఆడనున్న రైజర్స్‌కు ఇక్కడ నుంచి ప్రతీ పోరులో తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఒక్కటి ఓడినా ప్లేఆఫ్స్ ఆశలు అడుగంటుతాయి. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఐదింట్లో ఓడి 9వ స్థానంలో ఉన్న రైజర్స్ రాత మారాలంటే టాపార్డర్ బ్యాటర్లు సమష్టిగా రాణించాల్సి ఉంది. మరోవైపు హ్యాట్రిక్ విజయాలతో ఊపులో ఉన్న ముంబై తమ సొంతగడ్డ వాంఖడేలో రైజర్స్‌ను ఓడించి అన్ని విభాగాల్లో పైచేయి కనబర్చింది. రోహిత్ ఫామ్‌లోకి రావడం కూడా ఆ జట్టుకు పెద్ద సానుకూలాంశం.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	8	5	3	0	10	0.472
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
ముంబై	8	4	4	0	8	0.483
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	8	2	6	0	4	-0.633
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఢిల్లీ సిక్సర్

లఖ్‌నవూపై ఘన విజయం
రాహుల్, పోరెల్ అర్ధసెంచరీలు



పేసర్ ముకేశ్‌కు నాలుగు వికెట్లు



1 ఐపీఎల్‌లో వేగంగా (130 ఇన్నింగ్స్) 5వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా రాహుల్. వార్నర్ (135)ను అధిగమించాడు.

లఖ్‌నవూ: తాజా సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నిలకడ కొనసాగుతోంది. ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఆరో విజయంతో పట్టికలో గుజరాత్‌తో పోటీపడుతోంది. ఇక తన పాత జట్టుపై కేఎల్ రాహుల్ (42 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 57 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో చెలరేగాడు. అంతకుముందు బౌలింగ్‌లో ఢిల్లీ పేసర్ ముకేశ్ కుమార్ (4/33) అద్భుత ప్రదర్శనతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఏమాత్రం కుదురుకోలేకపోయింది. ఫలితంగా మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (33 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 52), మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 45), ఆయుష్ బదోని (21 బంతుల్లో 6 ఫోర్లతో 36) ఆకట్టుకున్నారు. ఛేదనలో ఢిల్లీ 17.5 ఓవర్లలో 161/2 స్కోరు చేసి గెలిచింది. అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 51), కెప్టెన్ అక్షర్ పటేల్ (20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 34 నాటౌట్) రాణించారు. మార్‌క్రమ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ముకేశ్ నిలిచాడు.

రాహుల్, పోరెల్ దూకుడు: ఛేదనను ఢిల్లీ ధాటిగా ఆరంభించింది. ప్రతీ బ్యాటర్ మెరుగ్గా ఆడడంతో లఖ్‌నవూ బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. ఆరంభం నుంచే ఓపెనర్లు అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్ (15) బౌండరీలపైనే దృష్టి సారించారు. తొలి ఓవర్‌లోనే కరుణ్ రెండు ఫోర్లు, పోరెల్ ఫోర్‌తో 15 రన్స్ సమకూరాయి. అయితే నాలుగో ఓవర్‌లో సిక్సర్ సాధించిన కరుణ్‌ను మార్‌క్రమ్ బౌల్డ్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పోరెల్‌కు రాహుల్ కలవడంతో ఢిల్లీ ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. ఆరో ఓవర్‌లో చెరో ఫోర్‌తో పవర్‌ప్లేను జట్టు 54/1తో ముగించింది. ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో 7-9 ఓవర్ల మధ్య బౌండరీ రాలేదు. ఈ జోడీ కూడా షాట్లకు వెళ్లలేదు. చివరకు పదో ఓవర్‌లో పోరెల్ ఫోర్‌తో స్కోరు ముందుకు కదిలింది. తర్వాతి ఓవర్‌లోనే చెరో సిక్సర్ బాదడంతో 16 రన్స్ వచ్చాయి. అలాగే పోరెల్ 33 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేశాడు. అయితే మార్‌క్రమ్ మరోసారి లఖ్‌నవూకు రిలీఫ్‌నిస్తూ పోరెల్ వికెట్ తీశాడు. అప్పటికే రెండో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. అక్షర్ రాగానే ధాటిని ప్రదర్శించాడు. బిష్ణోయ్ ఓవర్‌లో అక్షర్ రెండు సిక్సర్లతో జట్టు చకచకా లక్ష్యం వైపు సాగింది. 16వ ఓవర్‌లో శార్దూల్ 14 రన్స్ ఇవ్వడంతో సమీకరణం 24 బంతుల్లో 19కి మారింది. ఇద్దరూ మరింత జోరు చూపడంతో 13 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. అలాగే రాహుల్ 40 బంతుల్లో ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు.

శుభారంభం దక్కినా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు మార్‌క్రమ్, మిచెల్ మార్ష్ ఆడిన తీరుకు మిగతా బ్యాటర్లకు సంబంధం లేకుండా పోయింది. ఈ జోడీ క్రీజులో ఉన్నంత సేపు లఖ్‌నవూ భారీ స్కోరు చేసేలా కనిపించింది. పది ఓవర్లపాటు ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ చెత్త బంతులను బౌండరీలుగా మల్చడంతో తొమ్మిది పరుగుల రన్‌రేట్‌తో స్కోరు సాగింది. కానీ మధ్య ఓవర్లలో పేసర్ల ధాటికి టపటపా వికెట్లు కోల్పోవడం జట్టును దెబ్బతీసింది. కెప్టెన్ పంత్ (0) చేతికి గాయం కావడంతో ఏడో నెంబర్‌లో బరిలోకి దిగాడు. ఆరంభంలో మార్‌క్రమ్ వేగం చూపాడు. అతను నాలుగో ఓవర్‌లో 4,6 బాదగా, మార్ష్ ఆరో ఓవర్‌లో సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 51 పరుగులతో మెరుగ్గా కనిపించింది. విప్రజ్ ఓవర్‌లో సిక్సర్ సాధించిన మార్‌క్రమ్ 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. చివరి ఆరు ఇన్నింగ్స్‌లో అతడికిది నాలుగో ఫిఫ్టీ కావడం విశేషం. కానీ పదో ఓవర్‌లో మార్‌క్రమ్‌ను పేసర్ చమీర అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక్కడి నుంచి లఖ్‌నవూ అనూహ్యంగా తడబడింది. రెండు వరుస ఫోర్లతో జోరు మీదున్న నికోలస్ పూరన్ (9) కోసం పేసర్ స్టార్క్‌కు బంతినివ్వడం ఫలితాన్నిచ్చింది. వరుసగా ఐదో ఇన్నింగ్స్‌లోనూ పూరన్‌ను స్టార్క్ అవుట్ చేయగలిగాడు. 14వ ఓవర్‌లో సమద్ (2), మార్ష్ (45)లను వెనక్కి పంపి ముకేశ్ ప్రత్యర్థికి గట్టి ఝలకిచ్చాడు. 12 పరుగుల వ్యవధిలోనే ముగ్గురు అవుటవడంతో మిల్లర్ (14 నాటౌట్), బదోని జాగ్రత్త కనబర్చారు. ముకేశ్ ఓవర్‌లోనే బదోని సులువైన క్యాచ్‌ను స్టబ్స్ అందుకోలేకపోయాడు. చివరి ఓవర్‌లో బదోని హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్నా, అతడితో పాటు పంత్‌ను ముకేశ్ అవుట్ చేశాడు. ఆఖరి పది ఓవర్లలో 72 పరుగులే చేయడంతో లఖ్‌నవూ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) స్టబ్స్ (బి) చమీర 52, మార్ష్ (బి) ముకేశ్ 45, పూరన్ (బి) స్టార్క్ 9, సమద్ (సి అండ్ బి) ముకేశ్ 2, మిల్లర్ (నాటౌట్) 14, బదోని (బి) ముకేశ్ 36, పంత్ (బి) ముకేశ్ 0, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 20 ఓవర్లలో 159/6; వికెట్ల పతనం:** 1-87, 2-99, 3-107, 4-110, 5-159, 6-159; **బౌలింగ్:** అక్షర్ 4-0-29-0, స్టార్క్ 4-0-25-1, ముకేశ్ 4-0-33-4, చమీర 3-0-25-1, విప్రజ్ 1-0-14-0, కుల్దీప్ 4-0-33-0.

ఢిల్లీ: అభిషేక్ పోరెల్ (సి) మిల్లర్ (బి) మార్‌క్రమ్ 51, కరుణ్ నాయర్ (బి) మార్‌క్రమ్ 15, కేఎల్ రాహుల్ (నాటౌట్) 57, అక్షర్ పటేల్ (నాటౌట్) 34, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 17.5 ఓవర్లలో 161/2; వికెట్ల పతనం:** 1-36, 2-105; **బౌలింగ్:** శార్దూల్ 2-0-28-0, దిగ్వేష్ 4-0-24-0, ప్రిన్స్ 2.5-0-23-0, మార్‌క్రమ్ 3-0-30-2, అవేశ్ 3-0-19-0, బిష్ణోయ్ 3-0-36-0.

అలుపన్నది లేదా.. సోనా!



- రూ.లక్ష దాటిన పసిడి ధర
- ఢిల్లీలో మరో రూ.1,800 పెరిగి రూ.1,01,600కు తులం బంగారం
- సరికొత్త రికార్డు గరిష్ఠానికి చేరిక

న్యూఢిల్లీ: పసిడి పరుగు ఆపట్లేదు. రూ.లక్ష మైలురాయినీ దాటేసి సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్తోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి(99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం మరో రూ.1,800 పెరిగి రూ.1,01,600కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,01,100కు ఎగబాకింది. ఈ రెండు స్వచ్ఛత లోహాల రేటు రూ.లక్ష మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు తులం బంగారం ధర రూ.22,650 (దాదాపు 29 శాతం) పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో దీని ధర వేగంగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకుతోడు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు నిల్వలు పెంచుకునేందుకు ఎగబడుతుండటం దేశీయంగా గోల్డ్ డిమాండ్‌ను మరింత పెంచింది. ఈనెలాఖరున (ఏప్రిల్ 30) అక్షయ తృతీయ కూడా. హిందువులు ఈ పండుగను పసిడి కొనుగోలుకు మంచి రోజుగా భావిస్తారు.

ఎంసీఎక్స్‌లోనూ రూ.లక్ష క్రాస్

మన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లోనూ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు (ఆగస్టు డెలివరీ) ధర సైతం రూ.లక్ష దాటేసింది. ఎక్స్ఛేంజీలో గోల్డ్ రేటు గడిచిన ఏడాది కాలంలో 41 శాతం పెరిగింది. ఎంసీఎక్స్ 2003 నవంబరులో గోల్డ్ కాంట్రాక్ట్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించింది. అప్పట్లో 10 గ్రాముల రేటు రూ.5,858గా ఉంది. గడిచిన 21 ఏళ్లలో ధర 17 రెట్లకు పైగా పెరిగింది.

3,500 డాలర్లకు ఔన్స్ గోల్డ్

అంతర్జాతీయ మార్కెట్లోనూ గోల్డ్ సరికొత్త శిఖరానికి ఎగబాకింది. స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 75.55 డాలర్లు లేదా 2.2 శాతం పెరుగుదలతో 3,499.92 డాలర్ల వద్ద ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర ఏకంగా 83.76 డాలర్లు లేదా 2.44 శాతం వృద్ధితో తొలిసారిగా 3,500 డాలర్ల స్థాయికి చేరింది. ఔన్స్ సిల్వర్ 32.70 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వడ్డీ రేట్ల తగ్గింపునకు సంబంధించి యూఎస్ ఫెడరల్ రిజర్వ్ జీరోమ్ పావెల్‌పై ఒత్తిడి తెస్తుండటం బంగారం ధరను సరికొత్త గరిష్ఠానికి ఎగదోసింది.

మిడ్ మార్కెట్ జీసీసీ హబ్‌గా భారత్

హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలపైనే దృష్టి
నాస్కామ్-జిన్నోవ్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ క్రమంగా మిడ్ మార్కెట్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)కు కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం మన దేశంలోని వివిధ నగరాల్లో 480కు పైగా మిడ్ మార్కెట్ జీసీసీలు ఉన్నాయి. దేశంలో ఇప్పటి వరకు ఏర్పాటైన జీసీసీల్లో ఇవి నాలుగో వంతని నాస్కామ్-జిన్నోవ్ సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ఒక నివేదిక తెలిపింది. 'ఇది చాలా పెద్ద మార్కెట్. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వార్షిక టర్నోవర్ 10 కోట్ల డాలర్ల నుంచి 100 కోట్ల డాలర్ల వరకు ఉన్న మిడ్ మార్కెట్ కంపెనీలు 1.3 లక్షల నుంచి 1.5 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో 30,000 నుంచి 40,000 కంపెనీలు జీసీసీలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇది భారత్‌కు మంచి అవకాశం' అని ఆ నివేదిక పేర్కొంది.

కీలక కేంద్రాలుగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై: మధ్య రకం కంపెనీల్లో ఎక్కువ కంపెనీలు తమ జీసీసీలను బెంగళూరు, హైదరాబాద్, చెన్నైల్లో ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్)గా అందించే కంపెనీలు, ప్రొడక్ట్ ఆధారిత మిడ్ సైజ్ కంపెనీలు తమ జీసీసీల ఏర్పాటుకు బెంగళూరుపై మొగ్గు చూపుతున్నాయి. డిజిటల్, ఇంజనీరింగ్ రంగాలకు చెందిన మిడ్ మార్కెట్ కంపెనీల జీసీసీలకు హైదరాబాద్, చెన్నై కేంద్రాలుగా మారుతున్నాయి. మౌలిక సదుపాయాలు, స్థానిక ప్రభుత్వాల ప్రోత్సాహం, నిపుణులైన ఉద్యోగుల అందుబాటూ ఇందుకు తోడవుతున్నాయి.

భారత ఈ-కామర్స్‌పైనా అమెరికా కన్ను

అమెజాన్, వాల్‌మార్ట్‌లపై ఆంక్షలు తొలగించాలని ఒత్తిడి

వద్దంటున్న కిరాణా వ్యాపారులు

రిలయన్స్ రిటైల్, డీమార్ట్‌లకూ ముప్పే



న్యూఢిల్లీ: దాదాపు 12,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.10.65 లక్షల కోట్లు) స్థాయికి చేరిన దేశీయ ఈ-కామర్స్‌పైనా అమెరికా కన్నేసింది. తన అమెజాన్, వాల్‌మార్ట్ కంపెనీలకూ భారత్ ఈ-కామర్స్ మార్కెట్ తలుపులు బార్లా తెరవాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది. ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలోనూ ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విషయాన్ని గట్టిగా ప్రస్తావించినట్టు సమాచారం. అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) జామీసన్ గ్రీర్ కూడా ఈ విషయంలో పట్టుదలతో ఉన్నారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గించడంతో పాటు వివక్షాపూరితమైన ఆంక్షలనూ తొలగించాని డిమాండ్ చేశారు.

ఎందుకంటే?

దేశీయ ఈ-కామర్స్ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. క్విక్ కామర్స్ కంపెనీలైతే దేశంలోని దాదాపు 100 ప్రధాన నగరాల్లోకి చొచ్చుకుపోయాయి. ఈ మార్కెట్లో ప్రస్తుతం అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ భారత అనుబంధ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌దే హవా. మరో అమెరికా రిటైల్ దిగ్గజం అమెజాన్ కూడా ఈ రంగంలో నువ్వా నేనా అన్నట్టు పోటీపడుతోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం విదేశీ ఈ-కామర్స్ సంస్థలు ఇతర సంస్థల వస్తు,సేవలకు మార్కెట్ వేదికలుగా మాత్రమే పని చేయాలి. అవి నేరుగా వస్తువులను తయారు చేసి.. స్టోర్ చేసి తమ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు వీల్లేదు. వివక్షాపూరితమైన ఈ ఆంక్షలను ఎత్తివేయాలని అమెరికా ప్రస్తుతం మోదీ సర్కారుపై ఒత్తిడి చేస్తోంది.

కిరాణాకు ఉరితాడే!

ఈ విషయంలో ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోతే దేశంలోని కిరాణా దుకాణాలకు అది ఉరితాడులా మారుతుందని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) హెచ్చరిస్తోంది. ఈ-కామర్స్ సంస్థల అడ్డగోలు ధరలు, డిస్కౌంట్‌లకు తట్టుకోలేక గత రెండు మూడేళ్లలో దాదాపు 10 లక్షల కిరాణా దుకాణాలు మూతపడిలక్షల మంది ఉపాధి లేక రోడ్డున పడిన విషయాన్ని గుర్తు చేసింది. అమెరికా ఈ-కామర్స్ దిగ్గజాలకూ సమాన అవకాశాలు కల్పించడం అంటే రిలయన్స్ రిటైల్, డీమార్ట్ వంటి దేశీయ రిటైల్ దిగ్గజాలకూ ముప్పని హెచ్చరించింది.

పెరగనున్న సిమెంట్ ధర

4% వరకు పెరిగే అవకాశం: క్రిసిల్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సిమెంట్ పరిశ్రమకు బాగానే కలిసొస్తుందని క్రిసిల్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ధర 2 నుంచి 4 శాతం, గిరాకీ 6.5 నుంచి 7.5 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. కీలక మౌలిక ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు 10 శాతం పెరగడం, గ్రామీణ గృహ నిర్మాణ రంగం పుంజుకోవడం, ఈ సంవత్సరం సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాలు ఇందుకు కలిసి రానున్నాయి.

నిరాశపరిచిన 2024: గత ఆర్థిక సంవత్సరం (2023-24) సిమెంట్ పరిశ్రమకు పెద్దగా కలిసి రాలేదు. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గిరాకీ 4.5 నుంచి 5.5 శాతం మాత్రమే పెరిగింది. లోక్‌సభ ఎన్నికలు, భారీ వర్షాలు ఇందుకు ప్రధాన కారణం. దీంతో గత ఆర్థిక సంవత్సరం ధరలు కూడా పరిశ్రమను బాగా నిరాశ పరిచాయి. తెలుగు రాష్ట్రాల్లో ఒక దశలో ప్రముఖ కంపెనీల 50 కిలోల సిమెంట్ బస్తా రూ.300కి కూడా పడిపోయింది. ప్రసుతం కోలుకుని రూ.350 నుంచి రూ.360 మధ్య ట్రేడవుతోంది.

ఆరో రోజూ మార్కెట్ ముందుకే..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 416 పాయింట్ల మేర ఎగబాకి 79,824 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 187.09 పాయింట్ల లాభంతో 79,595.59 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41.70 పాయింట్ల వృద్ధితో 24,167.25 వద్ద ముగిసింది. బ్యాంకింగ్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) కొత్త పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. గడిచిన ఆరు సెషన్లలో సెన్సెక్స్ 5,748.44 పాయింట్లు (7.78 శాతం), నిఫ్టీ 1,768.1 పాయింట్లు (7.89 శాతం) బలపడ్డాయి. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.33.55 లక్షల కోట్ల వృద్ధితో రూ.427.37 లక్షల కోట్లకు (5.02 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ @ రూ.15 లక్షల కోట్లు: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరో రికార్డును నమోదు చేసింది. బ్యాంక్ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) తొలిసారిగా రూ.15 లక్షల కోట్ల మైలురాయికి చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడో లిస్టెడ్ కంపెనీ ఇదే. బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఒక దశలో 2.23 శాతం పెరిగి రూ.1,970.65 వద్ద సరికొత్త జీవితకాల రికార్డును నమోదు చేసింది. చివరికి షేరు ధర 1.78 శాతం లాభంతో రూ.1,961.90 వద్ద స్థిరపడింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.15.01 లక్షల కోట్లుగా నమోదైంది.

ఈ నెల 28 నుంచి ఏథర్ ఎనర్జీ ఐపీఓ: విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీదారు ఏథర్ ఎనర్జీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని మాత్రం బాగా తగ్గించుకుంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా నిధుల సేకరణను కంపెనీ గతంలో ప్రకటించిన రూ.3,100 కోట్ల నుంచి రూ.2,626 కోట్లకు తగ్గించుకుంది.

బిజినెస్

హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ. 4,307 కోట్లు

ఒక్కో షేరుకు రూ.18 డివిడెండ్

న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.4,307 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 8.1 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో ఆదాయం 6.1 శాతం పెరిగి రూ.30,246 కోట్లకు చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ ఆదాయం 6.5 శాతం వృద్ధితో రూ.1,17,055 కోట్లకు, నికర లాభం 11 శాతం వృద్ధితో రూ.17,390 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.18 చొప్పున డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

కొత్తగా 2,665 నియామకాలు

పరిశ్రమ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా హెచ్‌సీఎల్ టెక్ గత ఆర్థిక సంవత్సరం 2,665 కొత్త నియామకాలు చేపట్టింది. దీంతో ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 2,23,420కు చేరింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా ప్రతి మూడు నెలలకు 2,000 మంది చొప్పున ఫ్రెషర్స్‌ను నియమించుకోనున్నట్టు హెచ్‌సీఎల్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	400
చిత్తూరు	440	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	117
వరంగల్	120	గుంటూరు	105
కరీంనగర్	120	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	80
కర్నూలు	120	నెల్లూరు	85
విశాఖపట్నం	111	అనంతపురం	85
గోదావరి	117		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,350 ▲	92,900 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	91,000 ▼	99,000 ▼
విశాఖపట్నం	1,00,950 ▲	92,900 ▲	1,11,000 ▲
రాజమండ్రి	1,01,350 ▲	92,900 ▲	99,400 ▲
ప్రొద్దుటూరు	1,00,000 ▲	92,090 ▲	98,500 ▼
ముంబై	98,484 ▲	90,211 ▲	95,607 ▼

పచ్చని కొండల్లో నెత్తుటేర్లు



ఉగ్రదాడి జరిగిన ప్రాంతానికి వెళ్తున్న భద్రతా బలగాలు


ఉగ్రదాడిలో చనిపోయిన ఓ పర్యాటకుడు

(మొదటిపేజీ తరువాయి)

ఆస్వాదిస్తున్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. చాలామంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలతో అక్కడ భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండడంతో బాధితులను తరలించడం కష్టమైంది. బైసారన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా స్థలానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ల ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. తర్వాత 26కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాదాపు ఐదుగురు ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. "నా భర్త తలలోకి తుపాకీ గుండు దూసుకెళ్లింది. మరో ఏడుగురు కూడా తీవ్రంగా గాయపడ్డారు" అని ఓ మహిళ పీటీఐ వార్తా సంస్థకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి, కాపాడాలని వేడుకున్నారు. ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగానే భయంతో పరుగులు తీసినప్పటికీ.. పెద్ద మైదాన ప్రాంతం కావడంతో తప్పించుకోవడానికి దారిలేకపోయిందని మరో మహిళ చెప్పారు. ఉగ్రవాదులు పేరు అడిగి మరీ కాల్చి చంపారని మరో మహిళ వెల్లడించారు. బైసారన్‌లో ఉగ్రదాడి జరిగిన సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉన్నారు. దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులను పటిష్ఠ భద్రత నడుమ పహల్గాం క్లబ్‌కు తరలించారు. అనంతనాగ్ జిల్లా యంత్రాంగం, పోలీసులు, అంబులెన్సులను ఘటనా స్థలానికి రప్పించారు. సైనికులు, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు బైసారన్ చేరుకున్నారు. పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ముష్కరులను మట్టుబెట్టేందుకు సమీప అటవీ ప్రాంతాన్ని భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. పెద్దఎత్తున ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టాయి. ఉగ్రదాడికి సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు గాను అనంతనాగ్, శ్రీనగర్‌లో అత్యవసర కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఓ వైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటనలో ఉండగా మరోవైపు ప్రధాని మోదీ సౌదీ పర్యటనకు వెళ్లిన సమయంలో కశ్మీరులో పర్యాటకులపై ఉగ్రమూకలు దాడులకు పాల్పడడం గమనార్హం.


గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానిక వ్యక్తి

హైదరాబాద్ వాసి మృతి

ఉగ్రదాడిలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి మృతి చెందారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఉద్యోగి మనీశ్ రంజన్ కుటుంబ సభ్యులతో కలిసి కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. బైసారన్ పర్యటనలో ఉండగా.. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆయన మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత నౌకాదళ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్(26) కూడా మరణించినట్లు అధికారులు తెలిపారు. హరియాణాకు చెందిన వినయ్‌కు కోచిలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ నెల 16న ఆయనకు వివాహమైనట్లు అధికారులు చెప్పారు. కశ్మీరు పర్యటనకు వెళ్లిన ఆయన ఉగ్రదాడిలో మరణించారు.

- ఈ ఉగ్రదాడి తమ పనేనని 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' సంస్థ ప్రకటించింది. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా నుంచి టీఆర్ఎఫ్ ఉద్భవించింది. జమ్మూకశ్మీరులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇది పుట్టుకొచ్చింది. లష్కరేకు చెందిన సాజిద్ జట్, సజ్జద్ గుల్, సలీం రెహ్మానీ టీఆర్ఎఫ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. 2023 జనవరిలో కేంద్ర హోం శాఖ ఈ సంస్థపై నిషేధం విధించింది.


ఆస్పత్రిలో ఉగ్రదాడి క్షతగాత్రులు

● పోయి.. మోదీకి చెప్పు..!!

"పో.. ఇక్కడి జరిగింది మోదీకి చెప్పు".. నన్ను కూడా చంపేయండి అని తన భర్తను చంపిన ఉగ్రవాదుల ఎదుట రోదించిన మహిళకు ఓ ఉగ్రవాది ఇచ్చిన సమాధానమిది. కర్ణాటకలోకి షిమోగకు చెందిన మంజునాథ్, పల్లవి, తమ కుమారుడు అభిజయ్‌తో కలిసి కశ్మీరు పర్యటనకు వెళ్లి పహల్గాం సందర్శనకు వెళ్లగా.. మంజునాథ్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. "ముగ్గురు, నలుగురు మాపై దాడి చేశారు. నా కళ్ల ముందే నా భర్తను కాల్చారు. ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నా భర్తను చంపారుగా నన్ను కూడా చంపేయండి.. అని వాళ్లని అడిగా.. మేము నిన్ను చంపం.. పోయి ఇక్కడ జరిగింది మోదీకి చెప్పు.. అని వాళ్లలో ఒకరు బదులిచ్చారు" దాడి అనంతరం పల్లవి చెప్పిన మాటలివి.

● హనీమూన్‌లో విషాదం...

"నేను, నా భర్త బేల్‌పూరీ తింటున్నాం. తుపాకీ పట్టుకున్న ఓ వ్యక్తి హఠాత్తుగా వచ్చి.. మీది ఏ మతం అని అడిగాడు. హిందువు అని నిర్ధారించుకుని నా భర్త తలపై తుపాకీ ఎట్టి కాల్చేశాడు".. ఈ మధ్యనే పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని అందంగా ప్రారంభించాలని హనీమూన్‌కు కశ్మీరు వచ్చి ఉగ్రదాడిలో భర్తను కోల్పోయిన యువతి ఆ షాక్ నుంచి కాస్త తేరుకున్న తర్వాత చెప్పిన మాటలివి. రక్తపుమడుగులో పడి ఉన్న భర్త మృతదేహం పక్కన విషణ్ణ వదనంతో ఆ యువతి కూర్చున్నప్పుడు తీసిన ఓ ఫొటో ఆమె ఆవేదనను వివరించింది.



శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా.. అధికారులతో సమీక్ష

కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం రాత్రికి శ్రీనగర్ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, నిఘా విభాగం డైరెక్టర్ తపన్ డేకాతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీరు డీజీపీ నళిన్ ప్రభాత్ పహల్గాం ఉగ్రదాడి వివరాలను తెలియజేశారు. పహల్గాంలో పరిస్థితిపై ఉన్నతాధికారులతో షా సమీక్షించారు. బుధవారం ఆయన ఘటనా స్థలానికి వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి.

వాళ్లు జంతువులు: జమ్మూకశ్మీరు సీఎం ఒమర్

బైసారన్‌లో ఉగ్రదాడి ఘటన తెలిసి షాక్‌కు గురైనట్లు జమ్మూకశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. పర్యాటకులపై కాల్పులకు తెగబడడం అత్యంత హేయమైన చర్య అని, వారు జంతువులని పేర్కొన్నారు. ఈ దాడిని ఖండించడానికి ఇంతకంటే మాటలు రావడం లేదన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల సంఖ్య పెరుగుతోందని, ఆ వివరాలను ఇప్పుడే చెప్పలేమని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జమ్మూకశ్మీరులో పౌరులపై నేరుగా జరిగిన అతిపెద్ద ఉగ్ర దాడి ఇదేనన్నారు.

అమర్‌నాథ్ యాత్ర వేళ..

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న వేళ.. ఈ ఉగ్రదాడి జరగడం గమనార్హం. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జూలై 3 నుంచి ప్రారంభం కానుంది. లక్షలాది మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం మార్గంలోనే యాత్ర 48 కి.మీ. మేర ఉంది. 14 కి.మీ. మార్గం గండేర్బల్ జిల్లా మీదుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడడం ఆందోళన కలిగిస్తోంది.



కర్ణాటక వ్యాపారి మృతి..

ఉగ్రవాదుల దాడిలో కర్ణాటకకు చెందిన స్థిరాస్తి వ్యాపారి మంజునాథ రావు మరణించారు. ఆయన భార్య పల్లవి, ఎనిమిదేళ్ల కుమారుడు క్షేమంగా ఉన్నారు. కశ్మీరు పర్యటనకు వెళ్లిన పలువురు కన్నడిగులు ప్రమాదంలో ఉండడంతో సీఎం సిద్దరామయ్య అప్రమత్తమయ్యారు. మంగళవారం సాయంత్రం సీఎస్, పోలీసు ఉన్నతాధికారులు అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. కర్ణాటక వాసులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అధికారులను వెంటనే కశ్మీరుకు పంపారు. ఉగ్రదాడిలో మరణించిన మంజునాథ శివమొగ్గలోని విజయ్‌నగర్ వాసి. భార్య, కుమారుడితో కలిసి ఈ నెల 19న కశ్మీరు పర్యటనకు వెళ్లారు.

రక్తం మరిగిపోతోంది: సిన్హా

పహల్గాం ఉగ్రదాడి బాధ్యులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. ఈ దాడిపై యావత్ దేశం ఆగ్రహం వ్యక్తం చేస్తోందని, మన బలగాల రక్తం మరిగిపోతోందని పేర్కొన్నారు. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు మన బలగాలు రంగంలోకి దిగాయన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.


అనంత్‌నాగ్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద క్షతగాత్రులను తరలించిన అంబులెన్స్

ఆ ఉగ్రమూకను వదిలిపెట్టం: మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: పహల్గామ్‌లో ఉగ్రదాడిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. అమాయకులైన పౌరులు, పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమని 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాన'ని రాష్ట్రపతి పేర్కొన్నారు. అత్యంత హేయమైన ఉగ్రదాడి వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని, వారిని వదిలిపెట్టబోమని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదని, ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం మరింతగా బలపడుతుందని పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనకు సౌదీ అరేబియా వెళ్లిన ప్రధాని.. ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో పర్యటనను కుదించుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం రాత్రి సౌదీ ప్రభుత్వ అధికారిక విందులోనూ మోదీ పాల్గొనలేదు. బుధవారం ఆయన భారత్‌కు తిరిగి రావాల్సి ఉండగా.. మంగళవారం రాత్రే బయల్దేరుతున్నట్లు తెలిపారు. అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులు కఠిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి మానవత్వానికి మచ్చ అని, ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఏకతాటిపై నిలుస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయంటూ డొల్ల ప్రకటనలను కట్టిపెట్టి, బాధ్యత తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించారు. ఇలాంటి దారుణాలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి వార్త కలచివేస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు మద్దతుగా నిలుస్తామని ట్రంప్‌తో పాటు ఇజ్రాయెల్, అర్జెంటినా దేశాలు కూడా తెలిపాయి.

కఠినంగా వ్యవహరించాలి: రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించారు. ఇలాంటి దొంగదెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని పేర్కొన్నారు. ఉగ్రమూకల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రదాడి పాశవిక చర్య అని, దోషులను వదలిపెట్టే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి తెలిపారు. ఉగ్రవాదులది పిరికిపంద చర్య అని, దాడికి పాల్పడినవారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపడం అమానవీయ చర్య అని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కె.లక్ష్మణ్, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు ఉగ్రదాడిని ఖండించారు.

ప్రశాంత కశ్మీరంలో.. మళ్లీ ఉగ్ర కలకలం

జమ్మూకశ్మీర్, ఏప్రిల్ 22: జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉంటూ.. కశ్మీరీలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో.. పహల్గాం ఘటన మళ్లీ ఉగ్ర కలకలాన్ని రేపింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రేరేపిత లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రమూకలకు అడ్డాలుగా ఉన్న ప్రాంతాలు క్రమంగా శాంతి నెలకొంటున్న క్రమంలో.. మరోమారు కల్లోలం రేగింది. ఇప్పుడిప్పుడే పర్యాటకం జోరందుకుంటున్న దశలో.. ఉగ్రవాదుల దాడితో పర్యాటకుల భద్రత మళ్లీ ప్రశ్నార్థకంలో పడుతోంది.

బాలీవుడ్ గీతాలకు నెలవు

"యే చాంద్ స రోషన్ చహరా.. జుల్ఫోంకీ రంగ్ సునెహరా.." అంటూ 1980ల వరకు బాలీవుడ్ పాటలకు కేరాఫ్‌గా కశ్మీర్ లోయలోని అందమైన సరస్సులు.. హిమనీనదాలు నిలిచాయి. ఆ తర్వాతి కాలంలో ఉగ్రమూకలు కశ్మీరీ పండిట్ల ఊచకోతలతో అట్టుడికించారు. అడపాదడపా అమర్నాథ్ యాత్రికులను, జవాన్లను టార్గెట్‌గా చేసుకుని, దాడులు చేస్తున్నారు. 2016 సెప్టెంబరు 18న ఉడీలోని సైనిక శిబిరంపై దాడిలో 17 మంది జవాన్లు.. 2019 ఫిబ్రవరి 14న జవాన్ల కాన్వాయ్‌పై జరిగిన మానవబాంబు దాడిలో 44 మంది దుర్మరణంపాలయ్యారు. ఆ తర్వాత అతిపెద్ద ఉగ్రదాడి మంగళవారం నాటిదే..!

ప్రశాంతత నెలకొంటుండగా..

2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేశాక.. జమ్మూకశ్మీర్ రెండుగా విడిపోయింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత కశ్మీరీ పండిట్లు క్రమంగా తమ స్వస్థలాలకు రావడం ప్రారంభించారు. నియోజకవర్గాల పునర్విభజన పూర్తై.. మళ్లీ ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం ఏర్పాటై, ఇప్పుడిప్పుడే పర్యాటకం ఊపందుకుంటోంది. ఈ క్రమంలో పహల్గాం ఉగ్రదాడితో మరోమారు కలకలం రేగుతోంది.


అనంతనాగ్‌లో భద్రతా దళాల తనిఖీలు


ఉగ్రదాడికి వ్యతిరేకంగా కశ్మీర్‌లో స్థానికుల నిరసన ప్రదర్శన

మతం అడిగి మారణకాండ

పేర్లు అడిగి, ఖురాన్ సూక్తులు చెప్పించి..

ముస్లింలు కాదని నిర్ధారించుకుని మరీ కాల్చివేత

హిందువులు, పురుషులే లక్ష్యంగా ఉగ్రవాదుల దాడి

రక్తపు మడుగులు, ఆ మడుగుల్లో అక్కడక్కడా మృతదేహాలు.. ఆ మృతదేహాల పక్కన రక్తంతో తడిచి, విషణ్ణ వదనంతో కూర్చున్నవారు కొందరు.. అయినవారిని తమ కళ్ల ముందే ఎవరో తుపాకీతో కాల్చేస్తే చూసి గుండెలవిసేలా ఏడుస్తున్నవారు మరికొందరు. భయ్యా.. నా భర్తను కాపాడండి.. దయచేసి సాయం చేయండి, మమ్మల్ని రక్షించండి.. అని చేతులు జోడించి వేడుకుంటున్న వారు ఇంకొందరు.. హనీమూన్‌కు వచ్చి భర్తను కోల్పోయి రోదిస్తున్న నవవధువు ఓ వైపు ఉంటే.. తండ్రి చావుని చూసి రోదిస్తున్న కుమార్తె మరో వైపు.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం రక్తధారలతో తడిచిన పచ్చికబయళ్లలో కనిపించిన హృదయ విదారక పరిస్థితి ఇది. ఎక్కడి నుంచో హఠాత్తుగా వచ్చిన ఉగ్రవాదులు.. హిందువులు, మరీ ముఖ్యంగా పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. పేర్లు, మతం అడిగి.. ఖురాన్‌లోని సూక్తులు పలికించి.. మతాన్ని నిర్ధారించుకుని మరీ తలపై తుపాకీలు పెట్టి కాల్చిపారేశారు. ఇదంతా ఎందుకు జరిగిందో ? వారు చేసిన తప్పేంటో? ప్రాణాలు కోల్పోయిన వారికి తెలియదు. ఇక, అయినవారిని కళ్ల ఎదుటే కోల్పోయిన వారి ఆవేదనలు హృదయాలను కలచి వేస్తుండగా.. అందాల కశ్మీరం రక్తకన్నీరు పెట్టింది.

ఖురాన్ సూక్తులు పలికించి మా నాన్నని కాల్చేశారు..

"ఖురాన్‌లో ఏవో మాటలను సరిగ్గా పలకలేకపోయేసరికి మా నాన్న తలపై తుపాకీతో కాల్చేశారు. ఆ తర్వాత చెవి భాగంలో, వీపుపైనా కాల్చేశారు" ఉగ్రదాడిలో తండ్రి చావును కళ్లారా చూసిన పుణెకు చెందిన అస్వారి(26) అనే యువతి కన్నీటిపర్యంతమవుతూ చెప్పిన మాటలివి. అస్వారి కథనం ప్రకారం.. పుణెకు చెందిన సంతోష్ జగదలే దంపతులు, వారి కుమార్తె అస్వారి మరో ఇద్దరు కలిసి కశ్మీర్ పర్యటనకు వచ్చారు. కాల్పులు శబ్దం వినగానే వీరంతా సమీపంలోని ఓ గుడారంలోకి వెళ్లి నేలపై పడుకున్నారు. కాసేపటికి ఆ గుడారం వద్దకు వచ్చిన ఉగ్రవాదులు.. చౌదరి గారు బయటికి రండి అంటూ బెదిరించగా వారంతా బయటికి వచ్చారు. అనంతరం ప్రధాని మోదీని దూషించిన ఉగ్రవాదులు.. ఖురాన్‌లోని కొన్ని మాటలు పలకమని అస్వారి తండ్రిని ఆదేశించారు. ఆ మాటలు చెప్పలేకపోయే సరికి ఉగ్రవాదులు ఆయన్ను కాల్చేశారు. అనంతరం వారితో ఉన్న మరో వ్యక్తిని కూడా ఉగ్రవాదులు హతమార్చారు.

ప్రాణభయంతో ఉరుకులు పరుగులు

ఉగ్రదాడి మొదలైన తర్వాత ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. ఘటనాస్థలిలో ఉన్న స్థానికులు, పెద్ద సంఖ్యలో పర్యాటకులు ప్రాణభయంతో ఉరుకులు పరుగులు పెట్టారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో పలువురు గాయాలపాలయ్యారు. అయితే, ఉగ్రదాడి నుంచి త్రుటిలో తప్పించుకున్న నాగ్‌పూర్‌కు చెందిన దంపతులు తమకు ఎదురైన భయానక అనుభవాన్ని విలేకరులకు వెల్లడించారు. ఉగ్రదాడి మొదలవ్వడానికి సరిగ్గా 20 నిమిషాల ముందు తాము ఘటనాస్థలి నుంచి దూరంగా వచ్చి ప్రాణాలతో బయటపడ్డామని పేర్కొన్నారు. ఇక, పరుగెత్తే క్రమంలో కాలు విరిగి ఆస్పత్రిపాలైన అతని భార్య విలేకరులతో మాట్లాడుతూ.. కాల్పులు జరుగుతున్నాయి, పారిపోండి.. అంటూ జనం కేకలు పెడుతూ పరుగెత్తారని, చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రాణభయంతో అందరూ పరుగులు తీశారన్నారు.

హీరో మహేష్ బాబుకు ఈడీ నోటీసు

» 27న విచారణకు రావాలని పిలుపు



హైదరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ హీరో మహేష్‌బాబును ఈ నెల 27న విచారణకు హాజరు కావాలని ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని సురానా డెవలపర్స్, సాయిసూర్య డెవలపర్స్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ రెండు సంస్థలు రియల్ ఎస్టేట్ అక్రమాలకు పాల్పడ్డాయని, ఒకే ప్లాట్ పది మందికి అమ్మారని, వంద కోట్ల రూపాయలు పైగా నగదు రూపంలో డబ్బు తీసుకున్నారని ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ కంపెనీలకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో మహేష్‌బాబు నటించారు. అందుకు గాను సదరు కంపెనీ నుంచి మహేష్‌బాబు రూ.5.9 కోట్ల పారితోషికం తీసుకున్నారు. ఇందులో చెక్ రూపేణా మూడు కోట్ల 40 లక్షల రూపాయలు తీసుకోగా, నగదు రూపంలో రెండున్నర కోట్ల రూపాయలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ పారితోషికానికి సంబంధించి విచారణ నిమిత్తం మహేష్‌బాబును ఈడీ అధికారులు పిలిచారు. మహేష్‌బాబు చేసిన ప్రకటనలు చూసి చాలా మంది ఈ సంస్థల్లో ప్లాట్లు బుక్ చేసుకున్నారని, తర్వాత సంస్థ వ్యవహార శైలిపై అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారని సమాచారం. పలువురు బాధితుల నుంచి దాదాపు వంద కోట్ల రూపాయలను సురానా, సాయిసూర్య డెవలపర్స్ నగదు అడ్వాన్స్ రూపంలో తీసుకుని, వారిని మోసం చేశారన్న ఆరోపణల కేసులో హైదరాబాద్ పోలీసులతో పాటు, ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

శనివారం పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు

వాటికన్ సిటీ, ఏప్రిల్ 22: కేథలిక్ పవిత్ర గురువు పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఇటలీ కాలమానం ప్రకారం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వాటికన్ ప్రకటించింది. అంతిమ సంస్కారాలు ఎప్పుడు నిర్వహించాలనే అంశంతో పాటు తదుపరి పోప్‌ను ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభంపై అందుబాటులో ఉన్న కార్డినల్స్‌తో మంగళవారం కీలక సమావేశం జరిగింది. బుధవారం నుంచి ఫ్రాన్సిస్ భౌతికకాయాన్ని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చ్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అలాగే పోప్ భౌతికకాయం ఫొటోలను కూడా వాటికన్ మొదటిసారిగా విడుదల చేసింది. గతంలో మరణించిన పోప్‌ల అంత్యక్రియల సుదీర్ఘ క్రతువుకు భిన్నంగా అతి సాధారణంగా నిర్వహించాలని పోప్ కోరుకున్నారు. తనను ఇతర పోప్‌లను ఖననం చేసిన సెయింట్ పీటర్స్ బాసిలికాలో కాకుండా వాటికన్ వెలుపల ఉన్న సెయింట్ మేరీ మేజర్ బాసిలికాలో పూడ్చిపెట్టాలన్న ఆయన కోరికకు అనుగుణంగానే అంత్యక్రియల విధానాన్ని మార్చారు.

పార్లమెంటే సుప్రీం: ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్, పార్లమెంటే సుప్రీం.. అని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థ పార్లమెంట్ పరిధిలోకి ప్రవేశించకూడదని, ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తారని తేల్చి చెప్పారు. రాజ్యాంగ పదవులు అలంకారప్రాయమైనవని ఇటీవల కొందరు అభిప్రాయ పడుతున్నారన్నారు. 'రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులే అంతిమ నిర్ణేతలు. రాజ్యాంగంలో పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనది ఉందని ఎక్కడా చెప్పలేదు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు చెప్పే ప్రతి మాట జాతీయ ప్రయోజనాలను ఉద్దేశించినదే అయి ఉంటుంది.' అని ఆయన స్పష్టం చేశారు. ధన్‌ఖడ్ వ్యాఖ్యలపై ఎంపీ కపిల్ సిబాల్ కౌంటరిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్దేశించిన పనులను ఆయా శాఖలు సరిగా చేయకపోతే జోక్యం చేసుకునే హక్కు న్యాయవ్యవస్థకు ఉందని స్పష్టం చేశారు.

మా జడ్జీల తోలు మందం: జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: "న్యాయవ్యవస్థపై, న్యాయమూర్తులపై దాడి సాధారణంగా మారిపోయింది. రోజూ ఇలాంటివి జరుగుతున్నాయి. మా న్యాయమూర్తులకు కాస్త తోలు మందం. కోర్టు ధిక్కరణ వంటి అంశాలను పెద్దగా పట్టించుకోరు" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. 2010 నాటి ఓ కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తదితరులు చేసిన విమర్శలు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

మహారాష్ట్రలో 'హిందీ తప్పనిసరి' వాయిదా

ముంబై, ఏప్రిల్ 22: మహారాష్ట్ర పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మూడో భాషగా హిందీ తప్పనిసరిని ఆ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజులపాటు వాయిదా వేసింది. హిందీ తప్పనిసరిపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న వేళ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే ప్రకటించారు. పాఠశాలల్లో హిందీ తప్పనిసరిని కొన్ని రోజుల పాటు వాయిదా వేశామని ఆయన చెప్పారు. త్వరలో మరో కొత్త తీర్మానం తీసుకొస్తామని తెలియజేశారు. కాగా, మహారాష్ట్ర పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మూడో భాషగా హిందీని తప్పనిసరి అన్న నిర్ణయాన్ని ఆ రాష్ట్ర భాషా ప్యానెల్ కూడా వ్యతిరేకించింది.

విద్య, ఉద్యోగాల్లో ఒకే కులానికి రెండు రిజర్వేషన్లు సరికాదు

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాల కోసం ఒకే కులానికి రెండు వేర్వేరు కేటగిరీల్లో రిజర్వేషన్లు అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని కర్ణాటక హైకోర్టు తేల్చిచెప్పింది. బలిజ, బణిజగ కులాల పేరిట చేసిన వర్గీకరణను సవాలు చేస్తూ చామరాజనగర జిల్లా కొల్లేగాలకు చెందిన సుమిత్ర దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. బలిజ, బణిజగ కులస్థులకు గ్రూప్-బీ కేటగిరీలోనే రిజర్వేషన్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వర్గీకరణ ప్రకారం ఈ కులాలకు విద్యకు సంబంధించి గ్రూప్-బీ ఆర్టికల్ 15(4) కింద, ఉద్యోగాలకు సంబంధించి గ్రూప్-డీ ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్ వర్తింపజేస్తున్నారు. ఇది వివక్షతో కూడినదని, రాజ్యాంగ వ్యతిరేకమని కోర్టు అభిప్రాయపడింది. కేటగిరీ-బీకి చెందిన సుమిత్ర 1993లో ఓబీసీ కోటాలో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా నియమితులయ్యారు. అయితే ఉద్యోగాల విషయంలో ఆమె కులాన్ని గ్రూప్-డీ కిందకు వర్గీకరించినట్లు 1996లో అధికారులు నోటీసు జారీ చేశారు. ఉద్యోగ సంబంధిత రిజర్వేషన్ కోసం గతంలో ఆమె సమర్పించిన కుల ధ్రువీకరణ పత్రం చెల్లదని పేర్కొన్నారు. దీనిపై ఆమె కోర్టును ఆశ్రయించారు. ఆమె వాదనలను సమర్థించిన జస్టిస్ సూరజ్ గోవింద రాజ్.. ఆర్టికల్-14 ప్రకారం చట్టం ముందు సమానత్వం అనే సూత్రం రిజర్వేషన్లలో కూడా సమానంగా వర్తిస్తుందన్నారు. సందర్భానికి అనుగుణంగా ఒకే కులాన్ని వేర్వేరు కేటగిరీల్లో చేర్చలేమని స్పష్టం చేశారు.

హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు.. ఇక ఐఏఎస్!

» గిరిజన విద్యార్థి సాయిచైతన్య జాదవ్‌కు 68వ ర్యాంకు



సాయిచైతన్య జాదవ్

ఉట్నూర్ / డిచ్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఒక హెడ్ కానిస్టేబుల్ కుమారుడు.. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికైతే? ఆ తండ్రి ఆనందం ఎలా ఉంటుందో.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన జాదవ్ గోవింద్‌ను అడిగితే తెలుస్తుంది. ఎందుకంటే.. ఆయన కుమారుడు సాయిచైతన్య జాదవ్ యూపీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి 68వ ర్యాంకు సాధించారు. గిరిజన యువకుడైన సాయిచైతన్య సివిల్స్ రాయడం ఇది ఐదోసారి. నాలుగో ప్రయత్నంలో 138వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. దీంతో మరోసారి ప్రయత్నించి.. మెరుగైన ర్యాంకు సాధించారు. సాయిచైతన్య తల్లి కవిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కాగా.. తండ్రి జాదవ్ గోవింద్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వాన్స్.. వంటల్లో బెస్ట్!

పిల్లలకు రామాయణ, మహాభారతాలంటే మక్కువ.. భారతదేశ చరిత్రనూ చదివారు

» ఇక్కడి ఆహారాన్ని ఇష్టంగా తింటారు

» పర్యటన జీవితాంతం గుర్తుంటుంది

» ఓ ఇంటర్వ్యూలో ఉషా వాన్స్

జైపూర్, ఏప్రిల్ 22: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు భారతీయ వంటకాలంటే ఇష్టమని, కొన్ని వంటకాలను ఆయనే స్వయంగా చేస్తారని వాన్స్ భార్య ఉషా వాన్స్ ప్రశంసించారు. తమ పిల్లలకు రామాయణ, మహాభారతాలంటే మక్కువని ఆమె తెలిపారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జేడీ వాన్స్ కుటుంబంతో కలిసి మంగళవారం జైపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార రుచులను ఎంతగా ఆస్వాదించారో ఉషా వాన్స్ వివరించారు.

పిల్లల గురించి..

"మా కుటుంబం ఆంధ్రప్రదేశ్‌కు చెందినదే. అయినప్పటికీ, మా పిల్లలు(ఇవాన్, వివేక్, మిరాబెల్) ఎప్పుడూ ఇక్కడకు రాలేదు. కానీ, వారు భారతదేశ చరిత్ర చదివారు. వారికి ఇక్కడి చరిత్ర గురించి ఎంతో కొంత అవగాహన ఉంది. వారికి రామాయణ, మహాభారతాలపై ఎంతో ఆసక్తి ఉంది. పిల్లలు భారతీయ ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే ఎక్కువ సార్లు దీన్నే తింటారు.

జేడీ వాన్స్ వంట నైపుణ్యాల గురించి..

వాన్స్ చాలా బాగా వంట చేస్తారు. వంటింట్లో ఎప్పుడూ కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటారు. ఆయనకు భారతీయ వంటకాలంటే చాలా ఇష్టం. చనా మసాలా, మటన్ వంటి వంటకాలను కూడా వండుతారు. అలాగే, మా అమ్మ, అమ్మమ్మ అద్భుతంగా వంట చేస్తారు. మా నాన్న దోశ వేస్తే తిరుగుండదు. మేము వంటలకు కావాల్సిన పదార్థాలను కూడా భారతీయ దుకాణాల నుంచే కొనుగోలు చేస్తాం.



జైపూర్‌లోని అంబర్ కోట వద్ద జేడీ వాన్స్ కుటుంబం

వివాహం గురించి..

భారతీయ కుటుంబానికి చెందిన వ్యక్తిని. కాబట్టి హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకోవడం ముఖ్యమని భావించా. అందుకే హిందూ, క్రైస్తవ మత సంప్రదాయ పద్ధతుల్లో వివాహం చేసుకున్నాం. (ఉషా వాన్స్ హిందూ మతాన్ని ఆచరిస్తోంది. కాగా ఆమె భర్త జేడీ వాన్స్ ఒక క్రైస్తవుడు. కానీ, 2019లో వాన్స్ కాథలిక్ మతంలోకి మారారు.)

మొదటి భారత పర్యటన..

"జేడీ వాన్స్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన ఆయనకు చాలా ప్రత్యేకమైనది. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు వాన్స్‌కు ఎంతగానో నచ్చాయి. అంబర్ కోటను సందర్శించడం మా కుటుంబానికి మరపురాని అనుభూతినిచ్చింది. నా పిల్లలు రాజస్థానీ నృత్యానికి, సంగీతానికి ముగ్ధులయ్యారు. వారు నిన్న రాత్రంతా దాని గురించి మాట్లాడుతూనే ఉన్నారు. ఈ పర్యటన జీవితాంతం గుర్తుండిపోతుంది. నా చిన్న కుటుంబంతో కలిసి భారత్‌లో పర్యటించడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని ఉషా వాన్స్ తెలిపారు.

ప్రధాని మోదీ నివాసంలో..

ప్రధాని మోదీ నివాసంలో రామాయణానికి సంబంధించిన తోలుబొమ్మలాటను చూసి ఎంతో సంతోషించాం. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తోలు బొమ్మలు పిల్లలను ఎంతగానో ఆకట్టుకున్నాయి."

విధి విధానాలు సిద్ధం!

» వాణిజ్య ఒప్పందానికి మార్గం సుగమం..

మోదీ ప్రజాదరణ అసూయ కలిగిస్తోంది

» అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: వాణిజ్య సంప్రదింపులకు సంబంధించి భారత్-అమెరికాలు విధివిధానాలు అధికారికంగా ఖరారు చేశాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. దాంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి మార్గం సుగమమైందని అన్నారు. మంగళవారం ఆయన జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. భారత్ అణు ఇంధన లక్ష్యాలు నెరవేర్చడానికి అమెరికా ఉపయోగపడుతుందని అన్నారు. భారత ప్రధాని మోదీ ప్రజాదరణ స్థాయి చూస్తుంటే తనకు అసూయగా ఉందని వాన్స్ వ్యాఖ్యానించారు. ఇదే విషయం ఆయనకు సోమవారం విందు సందర్భంగా ఆయనకు స్వయంగా చెప్పానన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రజాస్వామిక దేశాధినేత అయిన మోదీని బైడెన్ ప్రభుత్వం తరచూ విమర్శించేదని వాన్స్ ప్రస్తావించారు. బైడెన్ ప్రభుత్వం భారత్‌ను కారుచౌకగా శ్రామిక శక్తి లభించే దేశంగా మాత్రమే చూసిందని వ్యాఖ్యానించారు. అక్షరధామ్ ఆలయాన్ని కుటుంబంతో కలిసి చూడటం తన అదృష్టమని వాన్స్ అన్నారు. భారత్‌కు పురాతన శిల్ప సంపద అందాలు, గొప్ప చరిత్రతో పాటు భవిష్యత్తు పట్ల స్పష్టత కూడా ఉన్నాయని కొనియాడారు. ప్రపంచంలో చాలా దేశాలు తిరిగానని, అన్నిచోట్ల అనుకరణ తాపత్రయం ఉండేదని, భారతదేశంలో మాత్రమే అది కనబడలేదని వ్యాఖ్యానించారు. భారతీయుడని చెప్పుకోవడం గర్వించదగ్గ విషయమని అన్నారు. తన పిల్లలు మోదీని ఎంతో ఇష్టపడ్డారని వాన్స్ చెప్పారు.



ఎగుమతిదార్లకు ఊరట

వాన్స్ ప్రకటన భారతదేశ ఎగుమతిదారులకు గొప్ప ఊరటనిస్తుందని పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి. కొత్త ట్యారిఫ్ విధానానికి ట్రంప్ 90 రోజుల విరామం ప్రకటించిన నేపథ్యంలో గడువు ముగిసిన తర్వాత పరిస్థితిపై పరిశ్రమల వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం జేడీ వాన్స్, ఉష దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి ఉదయాన్నే జైపూర్‌లోని అంబర్ ఫోర్టును సందర్శించారు. అక్కడ రెండు గంటలు గడిపారు.

లోకం తీరు



అమెరికా విద్యావ్యవస్థలో అనవసర రాజకీయ జోక్యం!

» ట్రంప్ సర్కారు చర్యలను ఖండించిన 100కుపైగా యూనివర్సిటీలు

» రూ.17 వేల కోట్ల గ్రాంట్ల నిలిపివేతపై హార్వర్డ్ వర్సిటీ దావా

వాషింగ్టన్/బోస్టన్, ఏప్రిల్ 22: విద్యావ్యవస్థలో ట్రంప్ సర్కారు అనవసర రాజకీయ జోక్యాన్ని ఖండిస్తూ అమెరికా వ్యాప్తంగా 100కుపైగా యూనివర్సిటీలు, కాలేజీలు ఒక సంయుక్త లేఖను విడుదల చేశాయి. గతంలో ఎప్పుడూ ఇలా జరుగలేదని మంగళవారం రాసిన ఆ లేఖలో పేర్కొన్నాయి. హార్వర్డ్, ప్రిన్స్‌టన్, బ్రౌన్ తదితర ప్రఖ్యాత యూనివర్సిటీల నుంచి చిన్న కాలేజీల వరకు వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు ఆ లేఖపై సంతకాలు చేశారు. క్యాంపస్‌లపై ప్రభుత్వ అనవసర నియంత్రణలను తిరస్కరిస్తున్నామని ఆ లేఖలో తేల్చిచెప్పారు. ఈ పరిణామాలు అమెరికా ఉన్నత విద్యావ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమించాయని పేర్కొన్నారు. మరోవైపు హార్వర్డ్ యూనివర్సిటీకి రూ.17,039 కోట్ల(2 బిలియన్ డాలర్లు) గ్రాంట్లను నిలిపివేసిన ట్రంప్ సర్కారుపై ఆ వర్సిటీ బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో దావా వేసింది. వర్సిటీ క్యాంపస్‌లో కార్యకలాపాలపై పరిమితులు విధించేందుకు, అడ్మిషన్ విధానాల్లో మార్పులు, నాయకత్వ సంస్కరణల కోసం ట్రంప్ యంత్రాంగం చేసిన ఆదేశాలను ధిక్కరించడమే గ్రాంట్ల నిలిపివేతకు కారణం. క్యాంపస్ కార్యకలాపాలపై ఆడిట్ నిర్వహించాలని, కొన్ని విద్యార్థి క్లబ్‌ల గుర్తింపును నిలిపివేయాలని సూచిస్తూ ఈనెల 11న ట్రంప్ యంత్రాంగం హార్వర్డ్ వర్సిటీకి లేఖ రాసింది. అయితే, అలాంటి డిమాండ్లకు తాము తలొగ్గేది లేదని వర్సిటీ అధ్యక్షుడు అలాన్ గర్బర్ తేల్చిచెప్పారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే వర్సిటీకి బిలియన్ డాలర్ల ఫెడరల్ ఫండింగ్‌ను ప్రభుత్వం నిలిపివేసింది.



తల్లిదండ్రులు రాజు, రజితతో సాయి శివాని

ఫోన్, సోషల్‌మీడియాకు దూరం

సివిల్స్‌ను లక్ష్యంగా నిర్దేశించుకుని.. క్రమశిక్షణతో చదివేవారికి ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. నేను ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఫోన్‌ను అస్సలు వినియోగించలేదు. సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉన్నాను. ఐఏఎస్ సాధించాలనే పట్టుదలతో రోజుకు 10 నుంచి 12 గంటలు చదివా. స్ట్రాంగ్ మైండ్‌సెట్‌తో ప్రిపేర్ అయ్యా. సిలబస్‌ను పూర్తిస్థాయిలో విభజించుకొని ఏ రోజు చదవాల్సిన సిలబస్‌ను అదే రోజు పూర్తి చేసేదాన్ని. మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్ పూర్తి చేయలేకపోయాను. రెండో ప్రయత్నంలో పూర్తిస్థాయిలో కృషి చేశాను. ఇక ఇంటర్వ్యూ విషయానికి వస్తే.. ప్రశ్నలకు సమాధానాల రూపంలో కాకుండా సంభాషణ రూపంలో మాట్లాడేలా సాధన చేశాను. నాకు మా నాన్నే స్ఫూర్తి. తల్లిదండ్రులతో పాటు నేను కూడా చిన్నప్పటి నుంచి ఐఏఎస్ కావాలనే కలలు కన్నాను. నన్ను ప్రోత్సహించిన అమ్మానాన్నలకు నేను సదా కృతజ్ఞురాలిని.

- సాయి శివాని, 11వ ర్యాంకర్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి..

» 15వ ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లావాసి వెంకటేశ్

» 2023లో ఐపీఎస్‌కు.. తాజాగా ఐఏఎస్‌కు ఎంపిక



నరసన్నపేట/ జలుమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐఐటీ చదివి, చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి.. గతంలో రెండుసార్లు సివిల్స్ రాసి.. రెండోసారి ఐపీఎస్‌కు ఎంపికయ్యారాయన. దాంతో సంతృప్తి చెందక.. మరోసారి పరీక్ష రాసి ఈసారి 15వ ర్యాంకు సాధించి ఐఏఎస్ కలను సాకారం చేసుకున్నారు. ఆయనే.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన బి.వెంకటేశ్. అల్లాడపేట ఓ కుగ్రామం. ఈ గ్రామానికి గతంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో అద్దోనంపేటగా కూడా పిలిచేవారు. అటువంటి గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వెంకటేశ్.. ఉన్నత చదువులు చదివి, సివిల్స్‌లో సత్తాచాటి ఔరా అనిపించారు. ఆయన ఐఏఎస్‌కు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు చంద్రరావు, రోహిణి, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్‌కు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్‌లో అభినందనలు తెలిపారు.

సివిల్స్‌లో వరంగల్

(మొదటిపేజీ తరువాయి)

అదరగొట్టగా.. రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు సాధించారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకుతో టాప్-20లో నిలిచారు. అభిషేక్ శర్మ (38), చింతకింది శ్రవణ్ కుమార్ రెడ్డి (62), సాయి చైతన్య జాదవ్ (68), చక్కా స్నేహిత్ (94), ఎన్.చేతనరెడ్డి (110), చెన్నం రెడ్డి శివగణేశ్ రెడ్డి (119), చల్లా పవన్ కల్యాణ్ (146), నెలటూరు శ్రీకాంత్ రెడ్డి (151), నెల్లూరు సాయితేజ (154), కొలిపాక శ్రీకృష్ణసాయి (190) తదితరులు మెరుగైన ర్యాంకులు సాధించారు. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన 'సివిల్స్ 2024' తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌కు చెందిన శక్తి దూబె తన తొలి ప్రయత్నంలోనే టాపర్‌గా నిలవగా.. హరియాణాలో జన్మించి గుజరాత్‌లో పెరిగిన హర్షిత గోయల్ రెండోస్థానంలో నిలిచారు. తర్వాతి స్థానాల్లో వరుసగా అర్చిత్ పరాగ్ (3), షా మార్గి చిరాగ్ (4), ఆకాశ్ గార్గ్ (5) నిలిచారు. ఈ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాప్ 25 జాబితాలో నిలిచినవారిలో 14 మంది పురుషులు, 11 మంది మహిళలు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 42,560 మంది ప్రిలిమినరీ పరీక్షకు హాజరు కాగా.. వారిలో 600 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. వారిలో దాదాపు 100 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. 40 మందికి పైగా తుదిజాబితాలో చోటు సాధించారు. తెలంగాణకు చెందిన చాలా మంది అభ్యర్థులు రెండేళ్లుగా గ్రూప్-1 పరీక్షలకు హాజరవడానికి ఇష్టపడ్డారని.. అందుకే గతంతో పోలిస్తే ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైనవారి సంఖ్య ఒకింత తక్కువగా కనిపిస్తోందని సివిల్స్ కోచింగ్ సెంటర్ 'బ్రెయిన్ ట్రీ' డైరెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు.



ఆలిండియా టాపర్లు శక్తి దూబే (1), హర్షిత గోయల్ (2), అర్చిత్ పరాగ్ (3)

ఇదీ లెక్క

యూపీఎస్సీ ఈ పరీక్షలను 1129 పోస్టుల భర్తీకి నిర్వహించింది. అందులో ఏయే ఉద్యోగాల సంఖ్య ఎంతంటే..

ఐఏఎస్	180
ఐఎఫ్ఎస్	55
ఐపీఎస్	147
గ్రూప్ ఏ	605
గ్రూప్ బి	142

1129 పోస్టుల భర్తీకి..

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 1129 పోస్టుల భర్తీకి గత ఏడాది ఫిబ్రవరిలో యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. జూన్ 16న ప్రిలిమినరీ, సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకూ దశల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించింది. 5,83,213 మంది ప్రిలిమ్స్ పరీక్ష రాశారు. వీరిలో మెయిన్స్ రాత పరీక్షకు 14,627 మంది అర్హత సాధించగా, ఇంటర్వ్యూలకు 2,845 మంది ఎంపికయ్యారు. జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 నడుమ ఇంటర్వ్యూలు నిర్వహించి.. వారిలో 1,009 మంది అభ్యర్థులను సివిల్స్‌కు ఎంపిక చేసినట్టు యూపీఎస్సీ ప్రకటించింది. వారిలో జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద 109, ఓబీసీ కేటగిరీ కింద 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీలో 87 మంది ఎంపికైనట్టు వివరించింది. 241 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని ప్రొవిజనల్ జాబితాలో ఉంచి.. ఒకరి ఫలితాన్ని విత్‌హెల్డ్‌లో ఉంచినట్టు తెలిపింది. సివిల్స్ అభ్యర్థుల మార్కుల జాబితాను 15 రోజుల్లో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు యూపీఎస్సీ వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల నుంచి మరికొందరు ర్యాంకర్లు..

సివిల్స్ ఫలితాల్లో 200కు పైగా ర్యాంకు సాధించిన తెలుగువారిలో.. బొల్లం ఉమామహేశ్వర్‌రెడ్డి (221), పూల ధనుష్ (232), పోతరాజు హరిప్రసాద్ (255), పి.లక్ష్మీప్రియ (297), ఎస్.సాయికిరణ్ (298), కె.శ్రీనివాస కీర్తిరెడ్డి (316), ఎం.ఉదయ్ కృష్ణారెడ్డి (350), ఎం.పవన్‌కుమార్ రెడ్డి (375), రాపర్తి ప్రీతి (451), పి.భార్గవ్ (455), సి.రాహుల్ (462), జె.భానుప్రకాశ్ (523), సి.భరత్ (567), గుబ్బల ఏఆర్‌వీ సూర్యతేజ (647), దోనేపూడి విజయ్‌బాబు (681), ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ (700), పి.ఇంద్రార్చిత (739) శనగవరపు సాయిభార్గవ (798), టి.సూర్యతేజ (799), వావిలపల్లి భార్గవ (830), గుగులోతు జీతేందర్‌నాయక్ (855), బి.మౌర్యతేజ (856) బి.వెంకట రామ్‌యజ్ఞ (863), వడ్లాది సాయిరోహన్ (892), కోకా ప్రియతం మనోహర్ (915), జి.ఆంజనేయులు (934), బానోతు శ్రీనికేశ్‌నాయక్ (938), జి.ప్రసాద్ (944), ఆర్.సుధాకర్ (949), చలవాది శ్రావణ సౌమ్య (951), ఆర్.సాయి మోహిని మానస (975) తదితరులున్నారు.

రైతులకు సేవ చేసేందుకే..

» 46వ ర్యాంకర్ రావుల జయసింహారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్త అయిన రావుల ఉమారెడ్డి కుమారుడు.. రావుల జయసింహారెడ్డి సివిల్స్‌లో 46వ ర్యాంకు సాధించారు. వరంగల్‌కు చెందిన జయసింహారెడ్డికి.. చిన్నప్పటి నుంచి వ్యవసాయం మీద ఆసక్తి. తన తండ్రిని కలిసేందుకు రైతులు వచ్చేవారని.. వారికి సేవ చేసేందుకే తాను సివిల్స్ రాశానని ఆయన తెలిపారు. "హైదరాబాద్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేశాను. 2019లో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. అప్పటి నుంచీ సివిల్స్ రాయడం మొదలు పెట్టాను. మొదటి రెండు విడతల్లో రాలేదు. మూడో విడతలో ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం శిక్షణలో ఉన్నాను.. నాలుగో విడత రాస్తే 104వ ర్యాంకు వచ్చి మళ్లీ ఐపీఎస్ వచ్చింది. నాకు ఐపీఎస్ ఇష్టమే అయినా.. పేదలకు సేవ చేయడానికి ఐఏఎస్ అయితే బాగుంటుందని ఐదోసారి మళ్లీ ప్రయత్నం చేశా. ఇప్పుడు 46వ ర్యాంకు వచ్చింది" అని జయసింహారెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే తాను ఈ ర్యాంకు సాధించగలిగానన్నారు.

అద్భుత విజయం.. అభినందనలు: సీఎం

'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' కింద సాయం.. ఏడుగురికి ర్యాంకులు



సివిల్స్‌కు ఎంపికై సత్తా చాటిన తెలుగు రాష్ట్రాలవారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యూపీఎస్సీ పరీక్షల్లో తెలంగాణ యువత అత్యుత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని జపాన్ పర్యటనలో ఉన్న సీఎం 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశసేవలో పాలుపంచుకునేందుకు అద్భుతమైన అవకాశాన్ని సాధించారని ప్రశంసించారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద.. ఇంటర్వ్యూలకు ఎంపికైన 20 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థికసాయం అందించిన సంగతి తెలిసిందే. వారిలో ఏడుగురు అభ్యర్థులు క్వాలిఫై కావడం విశేషం. ఆ ఏడుగురూ.. 11వ ర్యాంకర్ సాయిశివాని, హరిప్రసాద్ పోతరాజు (255), ప్రీతి రాపర్తి (451), నాగరాజ నాయక్ బానోతు (697), సూర్యతేజ తాగరు (799), అంజనేయులు గోకమల్ల (934), రాంటెంకి సుధాకర్ (949). జాతీయస్థాయి పరీక్షలకు సన్నద్ధమవుతున్న తెలంగాణ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం కొనసాగిస్తుందని ఈసందర్భంగా సీఎం తెలిపారు. కాగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సంస్థ చైర్మన్ ఎన్.బలరామ్ కూడా సివిల్స్ ర్యాంకర్లకు అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏపీ నుంచి రాజ్యసభకు అన్నామలై!

- ఆయన్ను మంత్రివర్గంలోకీ తీసుకుంటారని ప్రచారం
- మందకృష్ణ, స్మృతి ఇరానీ పేర్లపైనా ఊహాగానాలు
- అమిత్ షా, చంద్రబాబుతో మందకృష్ణ మాదిగ భేటీ



చెన్నై/న్యూఢిల్లీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి తమ పార్టీ తరఫున అభ్యర్థిని నిలబెట్టాలని బీజేపీ భావిస్తోంది. ఇదే విషయాన్ని మంగళవారం ఢిల్లీలో తనను కలిసిన సీఎం చంద్రబాబుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టు తెలిసింది. బీజేపీ అభ్యర్థికి మద్దతు తెలిపేందుకు చంద్రబాబు కూడా సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. కాగా, విజయసాయిరెడ్డి స్థానంలో బీజేపీ ఎవరిని ప్రతిపాదిస్తుందన్న విషయంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. తమిళనాడు బీజేపీ అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన అన్నామలైకు రాజ్యసభ సీటు ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు చర్చ జరుగుతోంది. త్వరలో జరిగే కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ఆయన్ను మంత్రివర్గంలోకి కూడా తీసుకుంటారని భోగట్టా. మరోవైపు మాదిగ దండోరా నేత మందకృష్ణ మాదిగకు అవకాశం కల్పించే అంశంపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. ఢిల్లీలోనే ఉన్న మందకృష్ణ మాదిగ... మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో వెళ్లి అమిత్ షాను, చంద్రబాబును కలుసుకున్నారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేరు కూడా బీజేపీ వర్గాల్లో ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఏదేమైనా ఆ సీటును మళ్లీ విజయసాయి రెడ్డికే కేటాయిస్తారంటూ వచ్చిన ప్రచారంలో వాస్తవం లేదని అటు బీజేపీ, ఇటు టీడీపీ వర్గాలు ధ్రువీకరించాయి.

బత్తుల సిద్దేశ్వర్ ఆమరణ దీక్ష విరమణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, తెలంగాణ బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ గత 22 రోజులుగా ఢిల్లీలో బీసీ ఆజాది ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్ ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ పార్లమెంటరీ నేత సంజయ్ సింగ్ దీక్షను విరమింపజేశారు.

కుల బహిష్కరణలపై బీసీ కమిషన్ సీరియస్

- పది రోజుల్లో నివేదిక సమర్పించాలని డీజీపీకి లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కరీంనగర్, మెదక్ తదితర జిల్లాల్లో కుల బహిష్కరణ సంఘటనలను రాష్ట్ర బీసీ కమిషన్ తీవ్రంగా పరిగణించింది. వీటిపై పది రోజుల్లో నివేదిక సమర్పించాలని డీజీపీకి ఆ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆదేశాల మేరకు గౌడ కులానికి చెందిన మహిళలను ఆలయంలోకి అనుమతించక పోవడంపై సమగ్ర విచారణ జరిపించాలని సూచించారు. పోలీసుల నుంచి నివేదిక రాకుంటే క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవాలు తెలుసుకుంటామని చెప్పారు.

ఆర్ట్స్ కాలేజీకి ట్రేడ్ మార్క్ గుర్తింపు

- తాజ్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాల తర్వాత దేశంలోని మూడో కట్టడంగా ఘనత

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ముఖ చిత్రంగా ఉన్న ఆర్ట్స్ కళాశాల భవనానికి మరో అరుదైన గుర్తింపు దక్కింది. దేశంలోని ప్రసిద్ధ ట్రేడ్ మార్క్ భవనాల జాబితాలో ఈ నిర్మాణం చోటు దక్కించుకుంది. ముంబైలోని తాజ్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాల తర్వాత ట్రేడ్ మార్క్ కలిగిన మూడో కట్టడంగా ఆర్ట్స్ కళాశాల భవనం నిలిచింది. ఈ మేరకు మంగళవారం ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ ధ్రువ పత్రాన్ని ఓయూ పూర్వ విద్యార్థి సుభజిత్ సాహా.. ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్‌కు అందించారు. సుభజిత్ సాహా ఆర్ట్స్ కళాశాల భవనానికి ట్రేడ్ మార్క్ కోసం గత ఏడాది దరఖాస్తు చేశారు. ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ ద్వారా ఓయూ అనుమతి లేకుండా ఆర్ట్స్ కళాశాల భవనాన్ని ఎలాంటి వాణిజ్య ప్రకటనలు, వాణిజ్య అవసరాలకు వాడేందుకు అవకాశం ఉండదు. ఆర్ట్స్ కళాశాల భవనం ఉస్మానియా విశ్వ విద్యాలయానికి ముఖ చిత్రంగా ఉందని వీసీ ఎం కుమార్ అన్నారు. ఇప్పటికే ఎంతో గుర్తింపు, ప్రాధాన్యం ఉన్న ఈ భవనానికి ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ దక్కడం మరింత గొప్ప విషయమని, ఓయూ విద్యార్థులకు ఇది గర్వకారణమని ఆయన అన్నారు.

ఆర్టీసీలో సమ్మెకు సై...జేఏసీకి సంఘాల మద్దతు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని పలు కార్మిక సంఘాలు ప్రకటించాయి. మే 7 నుంచి సమ్మె చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో.. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించింది. ఇందులో పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని.. సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడారు. ఆర్టీసీ యూనియన్ల మధ్య భేదాభిప్రాయాలను, భేషజాలను విడనాడాలని కోరారు. కాగా, సమ్మె అనివార్యమైతే దానికి మద్దతుగా నిలుస్తామని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్-సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. ఇక అన్ని సంఘాలు సమ్మెలో పాల్గొనేందుకు ముందుకొస్తే తాము మద్దతిస్తామని స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి తెలిపారు.

రేవంత్‌కు సిగ్గుంటే రాజీనామా చేయాలి

- ఎన్‌హెచ్‌ఆర్‌సీ నివేదిక సీఎంకు చెంపపెట్టు : కేటీఆర్

అధికార మదంతో విర్రవీగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి చర్యలకు జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నివేదిక చెంపపెట్టులాంటిదని.. ఆయనకు సిగ్గుంటే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మంగళవారం నందినగర్ నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ లగచర్ల దళిత, గిరిజన ఆడబిడ్డలను పోలీసులు వేధింపులకు గురిచేశారని మానవ హక్కుల కమిషన్ తేల్చిందన్నారు. పరిగి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు రైతుల్ని విపరీతంగా కొట్టారని, పైగా ఈ విషయాన్ని మెజిస్ట్రేట్‌కు చెబితే మీ ఇంట్లోవాళ్లను కూడా తీసుకొచ్చి కొడతామని బెదిరించారన్నారు. ఘటన జరిగిన రోజు అక్కడలేని వ్యక్తులను, ఆ సంఘటనతో సంబంధంలేని రైతులను కూడా తీసుకొచ్చి పోలీసులు కొట్టారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ నివేదిక ఇచ్చిందని తెలిపారు. బాధ్యులైన పోలీసులపై ఆరు వారాల్లోపు చర్యలు తీసుకోవాలని, వారిని సర్వీస్ నుంచి తొలగించాలని కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఒకవేళ ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే తామే తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించిందన్నారు. సొంత నియోజకవర్గంలోని ప్రజలపై పోలీసుల దాష్టీకానికి హోం మంత్రిగానూ వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మూడేళ్లలో మళ్లీ బీఆర్‌ఎస్సే అధికారంలోకి వస్తుందని, రేవంత్‌రెడ్డికి ప్రైవేటు సైన్యంలాగా ఓవర్ యాక్షన్ చేస్తున్న పోలీసులను, ఆశాఖ అధికారులను వదిలిపెట్టేది లేదన్నారు.

హైకోర్టు జడ్జీల బదిలీని నిలిపేయండి

- న్యాయవాదుల సంఘం ఏకగ్రీవ తీర్మానం

తెలంగాణకు చెందిన ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలను నిలిపేయాలని హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (టీహెచ్‌సీఏఏ) మంగళవారం డిమాండ్ చేసింది. సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. కొంతమంది జడ్జీలను లక్ష్యంగా చేసుకొని బదిలీలు చేయడం అన్యాయమని అభిప్రాయపడింది. తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ కే సురేందర్, జస్టిస్ పి. శ్రీసుధను ఇతర హైకోర్టులకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొంతమంది న్యాయమూర్తులను ఎంపిక చేసుకుని బదిలీ చేస్తున్న విధానంపై నిరసన తెలిపేందుకు అత్యవసరంగా టీహెచ్‌సీఏఏ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ.. హైకోర్టు న్యాయమూర్తుల బదిలీల్లో పారదర్శకత లేదని తెలిపారు.

రూ.12,062 కోట్లు..

30,500 ఉద్యోగాలు


జపాన్ పర్యటనలో తెలంగాణకు పెట్టుబడులు.. రాష్ట్రానికి దిగ్గజ కంపెనీలు.. ప్రభుత్వంతో ఒప్పందాలు

ముగిసిన రేవంత్ జపాన్ పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన విజయవంతమైందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వారంరోజుల పర్యటనలో సుమారు 30,500 ఉద్యోగాలు, రూ.12,062 కోట్ల పెట్టుబడులు సాధించారని వెల్లడించింది. ఈ మేరకు జపాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నట్లు పేర్కొంది. కంపెనీల రాకతో పరోక్షంగా వేల మందికి ఉపాధి అవకాశాలు మెరుగు పడనున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన మంగళవారంతో ముగిసింది. ఈ నెల 16న తెలంగాణ రైజింగ్ బృందంతో కలిసి ముఖ్యమంత్రి జపాన్ వెళ్లిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం ఆయన రాష్ట్రానికి రానున్నారు. చివరి రోజైన మంగళవారం హిరోషిమాలో రేవంత్ బృందం పర్యటించింది. హిరోషిమా శాసన సభ్యుల బృందం రేవంత్ రెడ్డిని గాంధీ మెమోరియల్, హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్‌ల వద్దకు తీసుకెళ్లింది. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి రేవంత్ నివాళి అర్పించారు. శాంతి స్మృతి వనం వద్ద అణుబాంబు ఘటనలో మృతిచెందిన వారికి పుష్పాంజలి ఘటించారు. 1945లో హిరోషిమాపై జరిగిన దాడి నాటి భవన శిథిలం 'ఆటమిక్ బాంబ్ డోమ్'ను కూడా రేవంత్ సందర్శించారు. అనంతరం హిరోషిమా డిప్యూటీ గవర్నర్ మికాయొకొటాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై చర్చలు జరిపారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైదరాబాద్లో విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలపై చర్చించారు. విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారం, తెలంగాణ సంస్కృతి, శాంతి, పర్యాటకం, పీస్ పార్క్, సాంస్కృతిక ప్రదర్శనలు, బౌద్ధ వారసత్వానికి సహకరించాలని కోరారు.

హిరోషిమాకు రావడం గౌరవంగా ఉంది

హిరోషిమా రాష్ట్ర ప్రభుత్వ అసెంబ్లీని రేవంత్ బృందం సందర్శించింది. స్పీకర్ తకాషి నకమోటో సాదరస్వాగతం పలికారు. శాసనసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "హిరోషిమా అంటే ఆశ. ప్రజలు కలిసికట్టుగా పని చేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం" అని చెప్పారు. పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ సందర్శనకు రావాలని అక్కడి అధికారులను, పారిశ్రామికవేత్తలను కోరారు. హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు.



హిరోషిమాలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి దుద్దిళ్ల

జయ జయహే తెలంగాణ

గాంధీ మెమోరియల్ దగ్గర సీఎంకు స్థానికంగా చదువుతున్న హాసిని, హరిణి పాటలతో స్వాగతం పలికారు. రేవంత్ అభివాదం చేస్తున్న ఫొటోను ఆర్ట్‌గా గీసి బహుమతిగా అందించారు. గాంధీ విగ్రహం దగ్గర.. "జయ జయహే తెలంగాణ" అంటూ రాష్ట్ర గేయాన్ని పాడి వినిపించారు. ఫొటోలను రేవంత్ చూసి మురిసిపోయారు. ఆ చిన్నారులతో కొద్ది సేపు ముచ్చటించారు.

పెట్టుబడుల వివరాలు

- మారుబెని కంపెనీ: హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఒప్పందం. రూ.1000 కోట్లతో ప్రారంభ పెట్టుబడి, రూ.5 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెరిగే అంచనా. దాదాపు 30 వేల ఉద్యోగాల కల్పన అంచనా.
- ఎన్‌టీటీ డేటా, నెయిసా: ఈ రెండు కంపెనీలు సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం. రూ.10,500 కోట్ల మేర పెట్టుబడులతో ఒప్పందం.
- తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా(టీటీడీఐ) రుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామగ్రి తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు. రూ.562 కోట్ల పెట్టుబడులు.
- కార్మిక ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్).. జపాన్‌లోని టీజీయూకే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్(టెర్న్), రాజ్ గ్రూపులతో ఒప్పందం. రెండింటి ద్వారా 500 మంది తెలంగాణవారికి ఉద్యోగాల కల్పనకు ఒప్పందం.

మీ భావాల స్ఫూర్తితో గర్వించే భవిష్యత్తును రూపొందిస్తాం

రాహుల్ లేఖకు రేవంత్ స్పందన

రోహిత్ వేముల చట్టం రూపకల్పన సంకేతం

హైదరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రాసిన లేఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా బదులిచ్చారు. జపాన్‌లోని చారిత్రక నగరమైన హిరోషిమాలో.. మహాత్మాగాంధీ విగ్రహం ఉన్న పవిత్ర స్థలాన్ని సందర్శించడానికి ముందు లేఖ చదివానని, ఆ లేఖలో రాహుల్‌గాంధీ స్ఫూర్తిదాయక మాటలు తనను కదిలించాయని పేర్కొన్నారు. తాము గర్వించదగిన భవిష్యత్తును రూపొందించేందుకు రాహుల్‌గాంధీ ఆలోచనలు, భావాల స్ఫూర్తితో ముందుకు వెళతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన రాజస్థాన్ ఇంధన శాఖ మంత్రి హీరాలాల్ నగర్

ఇంధన రంగంలో రాష్ట్రాలు సహకరించుకోవాలి

- తెలంగాణ-రాజస్థాన్ మధ్య ఒప్పందం సుపరిణామం : భట్టి

హైదరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేశంలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీయూఎన్‌ఎల్) మధ్య 3100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం జరగడం మంచి పరిణామమని తెలిపారు. తెలంగాణ-రాజస్థాన్ మధ్య కుదిరిన సోలార్, థర్మల్ విద్యుత్ ఒప్పందాలను ముందుకు తీసుకువెళ్లేందుకు భట్టి, రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ భేటీ అయ్యారు. తెలంగాణ, రాజస్థాన్ ప్రభుత్వ రంగ సంస్థల మధ్య జరిగిన ఒప్పందం సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనమని భట్టి అన్నారు. ఒప్పందంలో భాగంగా తెలంగాణలో నెలకొల్పనున్న 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లలో ఒకటైన సింగరేణి 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ పనులకు మే రెండో వారంలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక 3100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఇరు కంపెనీలు సంయుక్త భాగస్వామ్య కంపెనీని నెలకొల్పడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే రాజస్థాన్‌లో ఏర్పాటు చేయనున్న 1500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల కోసం భూ పరిశీలన పూర్తయిందని, మరోసారి అధికారుల బృందం అక్కడికి వెళ్లి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఇరు రాష్ట్రాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుపై మంచి పురోగతి ఉండటంపై రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

సింగరేణి ఉపకార వేతనం.. రూ.16 వేలకు పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ తదితర ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికులు, అధికారుల పిల్లలకు ఇప్పటి వరకు ఇస్తున్న వార్షిక ఉపకార వేతనాన్ని రూ.10 వేల నుంచి రూ. 16 వేలకు పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అలాగే ఇప్పటి వరకు దీనికి అర్హతగా 2000లోపు ర్యాంకు తెచ్చుకోవాల్సి ఉండగా... దాన్ని 8000 వరకు పెంచారు. ఈ ఉత్తర్వులు 2024-25 విద్యా సంవత్సరంలో ఆయా ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులకు కూడా వర్తిస్తాయని, అన్ని ఏరియాల నుంచి జూన్ 15లోపు దరఖాస్తులు పంపించాలని అధికారులు కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి

10 లక్షల ఆర్థికసహాయం చేసిన జగ్గారెడ్డి

భర్త చనిపోగా ఇద్దరు ఆడపిల్లలతో దయనీయ జీవితం గడుపుతున్న ఆమనికి భరోసా

- చికిత్స కోసం ఇప్పటికే 7లక్షలు అప్పు చేశాం
- ఆత్మహత్యకు సిద్ధమయ్యా: బాధితురాలు
- సదాశివపేటలో ఆమె ఇంటికి వెళ్లి నగదు అందించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్
- పబ్లిసిటీ కోసం కాదు..బాధితులకు ఎవరైనా అండగా నిలవాలనేదే నా తపన
- బాధితుల చికిత్స సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని వెల్లడి

సంగారెడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): క్యాన్సర్ వ్యాధితో చిన్నాభిన్నమైన ఓ కుటుంబానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. తమ తల్లి ఆమని క్యాన్సర్‌తో బాధపడుతోందని ఇద్దరు ఆడపిల్లలు ఇటీవల జగ్గారెడ్డి వద్ద విలపించారు. చలించిన జగ్గారెడ్డి సదాశివపేటలోని ఆమె ఇంటికి వెళ్లి బాధితురాలితో మాట్లాడారు. చికిత్సకోసం ఇప్పటికే రూ.7లక్షలు అప్పు చేశానని, డబ్బులు లేక ఆత్మహత్యకు సిద్ధమయ్యానని, పిల్లల కోసమే బతుకుతున్నానంటూ బాధితురాలు రోదించింది. దీంతో జగ్గారెడ్డి ఆమెకు రూ.10లక్షల నగదు ఇచ్చి ఆదుకున్నారు. తాను పబ్లిసిటీ కోసం ఇవ్వలేదని, తనకు పబ్లిసిటీ ఇష్టం ఉండదని, ఇలాంటి వారి బాధలు తీర్చడానికి దాతలు ముందుకు రావడానికే సాయం చేశానని జగ్గారెడ్డి వెల్లడించారు. చికిత్స పొందే బాధితుల సమస్యలను సైతం సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన అన్నారు.



సదాశివనగర్‌కు చెందిన క్యాన్సర్ బాధితురాలు ఆమనికి రూ.10 లక్షల సాయం చేస్తున్న జగ్గారెడ్డి

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు

- ఫిర్యాదు చేసేందుకు భూ భారతిలో అవకాశం
- ఎల్ఆర్ఎస్ గడువు మళ్లీ పెంచం: పొంగులేటి



యాదాద్రి/హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇతర సంస్థల భూములను కబ్జా చేస్తే ఎంత పెద్దవారిపైనైనా చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రామాల్లో భూదాన్, వక్ఫ్, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం భూ భారతి చట్టంలో ఉందన్నారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా తప్పులు చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఆనాటి పెద్దలు భూములను అక్రమంగా లాక్కుంటే చట్టప్రకారం రికవరీ చేస్తామని తెలిపారు. అయితే తమ ప్రభుత్వం కక్షపూరితంగా మాత్రం వ్యవహరించబోదని చెప్పారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ నెలాఖరులోగా ఈ నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. అంతకన్నా ముందు.. మే 1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామని ప్రకటించారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న వారిలో అర్హులు ఉంటే ఇందిరమ్మ పట్టా ఇచ్చేందుకు ఈ చట్టంలో పొందుపరిచామని తెలిపారు. కాగా, ప్రభుత్వ ఆలోచనలు, ప్రాథమ్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని మంత్రి పొంగులేటి అన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి రాష్ట్ర సచివాలయం నుంచి భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరపాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇక ఎల్ఆర్ఎస్‌కు గడువు ఈ నెల 30తో ముగుస్తుందని, మరోసారి గడువు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పారు.

టైప్ 2 డయాబెటిస్ నిర్ధారణకు సెన్సార్

- రక్త నమూనా అవసరం లేదు
- ఏయూ బయో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అపరంజి పూసర్ల ఆవిష్కరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అపరంజి పూసర్ల టైప్ 2 డయాబెటిస్ నిర్ధారణకు రూపొందించిన పోర్టబుల్ బయో సెన్సార్‌కు పేటెంట్ లభించింది. ఈ విభాగానికి లభించిన తొలి పేటెంట్ ఇదే కావడం గమనార్హం. పేటెంట్ పొందిన డాక్టర్ అపరంజి పూసర్లను మంగళవారం ఏయూ ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా తయారు చేసిన తీరు, వినియోగించిన టెక్నాలజీని అడిగి తెలుసుకున్నారు. రక్త నమూనా సేకరించాల్సిన అవసరం లేకుండానే డయాబెటిస్, ఇతర సంక్రమణ వ్యాధులను తొందరగా గుర్తించేందుకు ఈ పోర్టబుల్ బయోసెన్సార్ ఉపకరిస్తుందని డాక్టర్ అపరంజి వెల్లడించారు. సాధారణంగా షుగర్‌తో పాటు ఇతర పరీక్షలు చేసేందుకు రక్త నమూనాలను సేకరిస్తారు. కానీ, అపరంజి డిజైన్ చేసిన పోర్టబుల్ బయో సెన్సార్ విభిన్నమైన రీతిలో పనిచేస్తుంది. ఇందులో రక్త నమూనాలకు బదులు సదరు వ్యక్తి నుంచి సేకరించిన చెమట, లాలాజలం నమూనాలను వేయడం ద్వారా మాలిక్యూల్స్‌ను గుర్తిస్తారు. వాటి ఆధారంగా వ్యాధిని నిర్ధారిస్తారు. ఎక్కువసార్లు రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాల్సిన వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్ అపరంజి తెలిపారు.

పెరిగిన కొలొరెక్టల్ క్యాన్సర్ ముప్పు!

- కాంటినెంటల్ ఆస్పత్రి అధ్యయనంలో వెల్లడి
- మూడు వేల మందికి కొలోనోస్కోపీ స్క్రీనింగ్
- 25.27 శాతం మందిలో కణితుల గుర్తింపు
- వీరిలో 50 ఏళ్లలోపు వయసు వారు కూడా..
- ప్రాథమిక దశలో కణితుల తొలగింపుతో క్యాన్సర్‌కు చెక్
- 45 ఏళ్లు దాటిన వారు పరీక్షలు చేయించుకోవాలి
- ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొలొరెక్టల్ (పెద్దపేగు-పురీషనాళం) క్యాన్సర్... ఇది 50 సంవత్సరాల వయసు పైబడిన వారికే వస్తుందని చాలామంది అనుకుంటారు. ఇది ఇంతకు ముందున్న పరిస్థితి. కానీ, మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఊబకాయం, మద్యం, ధూమపానం వంటి కారణాల వల్ల ఇప్పుడు 30, 40 ఏళ్ల వారిలో కూడా కొలొరెక్టల్ క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నాయి. గతంలో 50 ఏళ్లు అనుకున్న వయోపరిమితిని ఇప్పుడు 45గా పరిగణించాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇతర క్యాన్సర్లపై ఉన్న అవగాహన కొలొరెక్టల్ క్యాన్సర్ (సీఆర్‌సీ) విషయంలో ఉండడం లేదు. అయితే పరీక్షలు చేయించుకోవడం ద్వారా మున్ముందు వచ్చే సీఆర్‌సీకి ప్రాథమిక దశలోనే చెక్ పెట్టవచ్చని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంటారాలజిస్టు డాక్టర్ గురు ఎన్ రెడ్డి తెలిపారు. మూడేళ్ల పాటు సీఆర్‌సీపై చేసిన విస్తృత అధ్యయనంలో దాని తీవ్రత దేశంలో ఎక్కువగానే ఉన్నట్లు తేలిందని చెప్పారు. అధ్యయనం ఫలితాలను ఆయన మంగళవారం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత మూడేళ్లలో తమ ఆస్పత్రిలో కొన్ని వేల మందికి కొలొనోస్కోపీ స్క్రీనింగ్ చేసినట్లు చెప్పారు. వీరిలో 28.03 శాతం మంది పురుషులు, 21.15 శాతం మంది మహిళల్లో ప్రీ-క్యాన్సర్ కణితుల (పాలిప్స్)ను గుర్తించినట్లు తెలిపారు. ముఖ్యంగా 45 నుంచి 49 ఏళ్ల వయస్సు పురుషుల్లో 10.3 శాతం మందిలో పాలిప్స్ ఉన్నాయన్నారు. తగిన చికిత్స ద్వారా కొలొరెక్టల్ క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. పాలిప్స్‌ను గుర్తించి వెంటనే తొలగించకపోతే అవి కొలొరెక్టల్ క్యాన్సర్‌కు దారి తీసి ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చని పేర్కొన్నారు.

మూడేళ్ల పాటు అధ్యయనం

'కాంటినెంటల్ ఆస్పత్రి వైద్య బృందం 2022 జనవరి నుంచి 2024 డిసెంబరు వరకు 2,998 మందిపై ఈ అధ్యయనం నిర్వహించింది. వీరిలో 1,798 మంది పురుషులు, 1,200 మంది మహిళలు! 45 ఏళ్ల వయసు పైబడిన పురుషులు 1,181 మంది, మహిళలు 841 మంది ఉన్నారు. 45 ఏళ్లలోపు వారు పురుషులు, మహిళలు కలిపి 976 మంది' అని డాక్టర్ గురు ఎన్ రెడ్డి తెలిపారు. 'ప్రపంచవ్యాప్తంగా మొత్తం క్యాన్సర్ కేసుల్లో సీఆర్‌సీ కేసులు 10 శాతం ఉంటాయి. క్యాన్సర్ సంబంధిత మరణాల్లో రెండో స్థానం సీఆర్‌సీదే. భారతదేశంలో మిజోరాం, జమ్మూ కశ్మీర్, కేరళలో, దక్షిణాదిలో ముఖ్యంగా కొల్లం, తిరువనంతపురం, బెంగళూరులో వ్యాధి తీవ్రత, మరణాలు ఎక్కువగా ఉన్నాయ'ని పేర్కొన్నారు. ముందుజాగ్రత్తగా 45 ఏళ్లు దాటిన పురుషులు, మహిళలు కొలొనోస్కోపీ స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు.


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ జయకేతనం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో జె.అంజన 997 మార్కులు సాధించి రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచింది. ఎంపీసీలో 1000 మార్కులకు కె.రుత్విక్ 996 మార్కులు సాధించాడు. పి. శ్రీనిత్యరెడ్డి 995, ఎం.రుత్విక 995, ఎ.లక్ష్మీప్రసన్న 995, ఎస్. సేవిత 994, వి.రుషికేష్ 994, వి.సాహితి 994, ఎస్.కార్తికేయ 994, జి.లక్ష్మీప్రసన్న 994, ఎస్.కీర్తి 994, ఎస్.అక్షత 994, వి. సాహితి 994, కె.వర్షిణి 994, ఎం.కీర్తి 994 మార్కులు సాధించారు. 128 మంది విద్యార్థులు 990 ఆపై మార్కులు సాధించగా 900 మార్కులు ఆపై సాధించిన విద్యార్థులు 2293 మంది ఉన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 470 మార్కులకు ఎస్.లహరి 468, హప్సహస్నాన్ 468, తహరానూర్ 468, టి.అన్వితరెడ్డి 468, సీహెచ్ అమతౌరాజ్ 468, పి.కిర్తిశ్రీ 468, జె.ప్రసూనాశ్రీ 468, ఎన్.కృష్ణవేణి 468, జి.తరుణ్ 468, డి.నాగాసాగర్ 468, జె. ప్రణవ్‌తేజ 468, ఎ.శశివర్ధన్‌రెడ్డి 468, ఎల్.హాసిని 468, ఎం. శ్వేత 468, కె.పల్లవి 468, కె.అనుపమ 468, ఎ.నిచిత 468, జి.తరుణ్ 468, జి.లక్ష్మీప్రియ 468, మొత్తం 20 మంది విద్యార్థులు 468 మార్కులు సాధించారు. 66 మంది 467 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు నభిలాతరీమ్ 438, సామాపి రదోష్ 438 మార్కులు, 10మంది విద్యార్థులు 437 ఆపై మార్కులు సాధించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. రాబోయే నీట్, ఎంసెట్ ఫలితాల్లోనూ తమ విద్యార్థులు అఖండ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ హవా

హైదరాబాద్, ఏప్రిల్, 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారని నారాయణ విద్యాసంస్థలు తెలిపింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో తమ విద్యార్థిని పి.వర్షిణి 470కి 469 మార్కులు సాధించిందని విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను 13 మంది 995 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 13 మంది 440కి 438 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్లో 132 మంది 468 మార్కులు సాధించారని, 487 మంది 467 మార్కులు, 856 మంది 466 మార్కులు సాధించి సత్తా చాటారని డైరెక్టర్లు పేర్కొన్నారు. తమ కళాశాలలో అందిస్తున్న ప్రత్యేక బోధన పద్ధతులతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీ చైతన్య

హైదరాబాద్, ఏప్రిల్, 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 103 మంది విద్యార్థులు 468 మార్కులు సాధించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 462 మంది 467, ఆపైన మార్కులు సాధించినట్లు, 1073 మంది 466 ఆపైన మార్కులు, 4490 మంది 460 ఆపైన, 8479 మంది 450 ఆపైన మార్కులు సాధించారని వెల్లడించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకుగాను 26 మంది 438 మార్కులు సాధించారని తెలిపారు. 136 మంది 437 ఆపైన మార్కులు, 304 మంది 436 ఆపైన, 459 మంది 435 ఆపైన, 1495 మంది 430 ఆపైన మార్కులు సాధించారన్నారు. అలాగే సీనియర్ ఇంటర్లో తమ విద్యార్థి 996 మార్కులు సాధించారని, ఏడుగురు 995 మార్కులు సాధించారని పేర్కొన్నారు. సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణతో ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.

చెన్నమనేని రమేశ్‌పై సీఐడీ కేసు

హైదరాబాద్/వేములవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భారత పౌరసత్వం లేకున్నా తప్పుడు పత్రాలతో గతంలో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌పై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. హైకోర్టు తీర్పు తర్వాత చెన్నమనేని రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గత నెల 17వ తేదీన డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీజీపీ ఆదేశాల మేరకు సీఐడీ అధికారులు గత నెలలోనే రమేశ్‌పై ఐపీసీ 465, 468, 471, ఇండియన్ పాస్‌పోర్టు యాక్ట్ సెక్షన్ 12, ఫారినర్స్ యాక్ట్ సెక్షన్ 14, ఇండియన్ సిటిజన్‌షిప్ యాక్ట్ సెక్షన్ 17 ప్రకారం కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈక్రమంలో ఫిర్యాదుదారుడైన ఆదిశ్రీనివాస్ వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఆయనను బుధవారం సీఐడీ కార్యాలయానికి పిలిచారు.

రాష్ట్రంలో ఠారెత్తిస్తున్న ఎండలు

నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. మంగళవారం నిర్మల్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అత్యధికంగా 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 44.4, జగిత్యాల జిల్లాలో 44.1, పెద్దపల్లి జిల్లాలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. కరీంనగర్ జిల్లాలో 44 డిగ్రీలు, కుమరం భీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో 43.8, మంచిర్యాల జిల్లాలో 43.7, కామారెడ్డి జిల్లాలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. రాబోయే రెండు రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొంది. ములుగు, హనుమకొండ, కరీంనగర్, భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో గురువారం 45 నుంచి 47 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. ఆ ఎనిమిది జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

లేడీ అఘోరీ అరెస్టు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): లేడీ అఘోరీ అలియాస్ శివ విష్ణు బ్రహ్మ అల్లూరి శ్రీనివాస్‌ను మోకిల పోలీసులు అరెస్టు చేశారు. పూజల పేరిట ఓ మహిళను రూ.9.80 లక్షల మేర మోసం చేసిందనే ఆరోపణలపై నమోదైన కేసులో పోలీసులు చర్యలు తీసుకున్నారు. లేడీ అఘోరీ పూజల పేరుతో తన వద్ద రూ.9.80 లక్షలు వసూలు చేసి మోసం చేసిందని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని ప్రగతి రిసార్ట్స్‌కు చెందిన ఓ మహిళ ఫిబ్రవరి 25న మోకిల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు లేడీ అఘోరీని ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం అదుపులోకి తీసుకున్నారు.

ఎలక్ట్రానిక్ ఆధారాలు చూపించలేదు

కేసు కొట్టివేయండి.. కౌశిక్‌రెడ్డి వినతి

'శవయాత్రకు రండి' వ్యాఖ్యల కేసుపై హైకోర్టులో వాదనలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన ఎన్నికల కేసును కొట్టివేయాలని కోరుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. 'ఎమ్మెల్యేగా గెలిస్తే విజయయాత్రకు వస్తాను.. ఓడిపోతే మీరు నా కుటుంబం శవయాత్రకు రావాలి' అని 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసినట్టు చెబుతున్న వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేసేలా ప్రవర్తించారంటూ ఎన్నికల అధికారుల ఫిర్యాదుతో హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆయన తరఫు న్యాయవాది వాదిస్తూ.. కేవలం వీడియో వైరల్ అయిందన్న ఏకైక కారణంతో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఆధారాలు పోలీసుల వద్ద లేవని తెలిపారు. దానిని సేకరించడంలో, కోర్టు ఎదుట సమర్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అందువల్ల కేసును కొట్టేయాలని కోరారు.

ఇంటర్‌లో ఫలితాల రికార్డు!

గత ఐదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత నమోదు.. ఫస్టియర్‌లో 66.89%, సెకండియర్‌లో 71.37% పాస్

అమ్మాయిల్లో 74.01 శాతం, అబ్బాయిల్లో 57.56 శాతం ఉత్తీర్ణత

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులు ఫలితాల్లో అదరగొట్టారు. గత ఐదేళ్లతో పోలిస్తే ఈసారి అత్యధిక ఉత్తీర్ణత నమోదు చేశారు. అందులోనూ అమ్మాయిలు ముందంజలో నిలిచారు. ఈసారి 4,39,302 మంది ప్రథమ సంవత్సర పరీక్షలు రాయగా.. 2,93,852 మంది (66.89%) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,99,943 మంది హాజరవగా.. 2,85,435 మంది (71.37%) ఉత్తీర్ణత సాధించారు. ఇక ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 4,99,440 మంది అమ్మాయిలు పరీక్షలు రాయగా.. 3,69,679 మంది (74.01%) ఉత్తీర్ణత సాధించారు. అబ్బాయిలు 4,97,572 మంది పరీక్షలు రాయగా.. 2,86,420 మంది (57.56%) ఉత్తీర్ణులు అయ్యారు. అమ్మాయిలు, అబ్బాయిల మధ్య ఉత్తీర్ణత తేడా 16.45 శాతం కావడం గమనార్హం. జిల్లాల వారీ ఫలితాల్లో ఫస్టియర్‌లో మేడ్చల్ (77.21%), సెకండియర్‌లో ములుగు (81.06) ప్రథమ స్థానంలో నిలిచాయి. ఫస్టియర్‌లో రంగారెడ్డి (76.36%), ఆసిఫాబాద్ (70.52%).. సెకండియర్‌లో ఆసిఫాబాద్ (80.24%), మేడ్చల్ (77.91%) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.


మధుశ్రీ, ఎంపీసీ (994)


సంజన, ఎంపీసీ (994)

రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తులు

విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం బుధవారం నుంచి ఈ నెల 30 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రీకౌంటింగ్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.100 చొప్పున చెల్లించాలని తెలిపారు. రీవెరిఫికేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ. 600 చెల్లించాలని, వారికి సమాధాన పత్రాల స్కాన్ కాపీ కూడా అందిస్తామని వెల్లడించారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు వచ్చే నెల 22 నుంచి రోజూ రెండు సెషన్లలో నిర్వహిస్తామని, ప్రాక్టికల్స్ జూన్ 3 నుంచి 6 వరకు ఉంటాయన్నారు.

పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి భేష్: డిప్యూటీ సీఎం

మంగళవారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్ ఫలితాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులను భట్టి ప్రశంసించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించా రు. కాగా, ఇంటర్ విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. "భవిష్యత్‌లో మీరు ఉన్నత చదువులు చదివి, జీవితంలో గొప్పగా రాణించాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

గురుకుల విద్యార్థుల సత్తా

ఇంటర్ ఫలితాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్టీ గురుకుల విద్యార్థులు 84.64శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యాసంస్థలకు చెందిన కె.అఖిల (దేవరకొండ) బైపీసీ విభాగంలో 1000 మార్కులకు 996, కె.స్రవంతి (పరిగి) ఎంపీసీ విభాగంలో 994 మార్కులు సాధించారు. ఇక తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ విద్యార్థులు ఏకంగా 89.51శాతం ఉత్తీర్ణత పొందారు. సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 86.16%, ప్రథమ సంవత్సరంలో 77.48% ఉత్తీర్ణత సాధించారు. బీసీ గురుకులాల్లో సెకండియర్‌లో 83.17శాతం, ఫస్టియర్‌లో 78.15శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ముగ్గురు విద్యార్థుల బలవన్మరణం..

ఇంటర్ పరీక్షల్లో ఫెయిలయ్యామనే మనస్తాపంతో ముగ్గురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపురానికి చెందిన రాసాల మల్లేశం, సునీత దంపతుల మూడో కుమారుడు అరవింద్ యాదవ్ (17) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఇక పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జీడీనగర్‌లో తాపల్లె ఎల్లయ్య కుమార్తె శశిరేఖ (17) ద్వితీయ సంవత్సరంలో ఒక సబ్జెక్టు ఫెయిలైంది. దీనితో ఆవేదన చెంది ఇంట్లోనే ఉరి వేసుకుంది. మరోవైపు హైదరాబాద్‌లోని తట్టిఅన్నారం వైఎస్సార్ కాలనీకి చెందిన సుక్క అరుంధతి (17) ఇంటర్‌లో ఫెయిలైన ఆవేదనతో ఉరివేసుకుంది. కాగా, పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడిన జోగుళాంబ గద్వాల జిల్లా మల్లెందొడ్డి గ్రామానికి చెందిన వినోద్.. ఉత్తీర్ణత సాధించాడు.

గ్రూప్‌ల వారీగా ఫలితాలు

గ్రూప్	ఇంటర్-1 విద్యార్థులు	ఉత్తీర్ణత (శాతం)	ఇంటర్-2 విద్యార్థులు	ఉత్తీర్ణత (శాతం)
ఎంపీసీ	2,23,996	76.65	2,34,916	72.23
బైపీసీ	98,646	67.88	98,958	71.93
సీఈసీ	92,745	45.56	1,03,713	46.92
ఎంఈసీ	14,600	65.53	15,316	56.96
హెచ్‌ఈసీ	8,959	34.51	9,031	46.26
మొత్తం	4,38,946	66.88	4,61,934	65.46

అమ్మాయిలు-అబ్బాయిల ఫలితాలు ఇలా..

సంవత్సరం	మొత్తం అమ్మాయిలు	ఉత్తీర్ణత (శాతం)	మొత్తం అబ్బాయిలు	ఉత్తీర్ణత (శాతం)
ప్రథమ	2,48,267	73.83	2,40,163	57.83
ద్వితీయ	2,51,173	74.21	2,57,409	57.31
మొత్తం	4,99,440	74.01	4,97,572	57.56

యాజమాన్యాల వారీగా ఫలితాల తీరు..

విభాగం	ఇంటర్-1 విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం	ఇంటర్-2 విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం
ప్రైవేటు	3,33,808	69.08	3,46,697	65.83
ప్రభుత్వ	68,100	42.49	74,161	53.44
మోడల్ స్కూల్స్	17,749	51.91	19,056	62.52
సాంఘిక సంక్షేమ	15,664	77.66	15,900	84.38
కేజీబీవీ	14,271	73	12,419	79.1
బీసీ వెల్ఫేర్	13,105	78.4	13,279	81.98
టీఎంఆర్‌జేసీ	9,370	77.79	9,467	82.2
ట్రైబల్ వెల్ఫేర్	7,882	69.97	8,052	81.53
ప్రైవేటు ఎయిడెడ్	5,670	49.68	6,850	46.16
టీఎస్ఆర్‌జేసీ	2,560	92.73	2,465	92.9
కేంద్ర ప్రభుత్వ కాలేజీలు	158	72.78	169	81.66
టీజీఎస్ఆర్‌టీసీ	68	82.35	29	86.21
ప్రభుత్వ స్పోర్ట్స్ కాలేజీ	25	80	39	76.92

ఆటోడ్రైవర్ కూతురికి అత్యుత్తమ ర్యాంకు

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన ఆటోడ్రైవర్ ఇస్లావత్ జానునాయక్ కుమార్తె.. ఇస్లావత్ పల్లవి ఇంటర్ బైపీసీలో 995 మార్కులు సాధించి.. రాష్ట్రస్థాయి ర్యాంకర్‌గా నిలిచింది. ఎంపీసీ విభాగంలో రంగారెడ్డి జిల్లా జాపాలకు చెందిన బకున సంజన, బోడ మధుశ్రీ 994 (ఆమనగల్లు), కాసుల ప్రజ్వలిత 993 (సిద్దిపేట జిల్లా శ్రీగిరిపల్లి), శంకర్‌పల్లికి చెందిన నందిని 992 మార్కులు సాధించారు. ఇక ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకుగాను.. హైదరాబాద్ మణికొండకు చెందిన సి.అక్షయ 469, సిద్దిపేట జిల్లా తిమ్మాయిపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, చేవెళ్లకు చెందిన శృతిలయ 468, మంచిర్యాల జిల్లా కాసిపేటకు చెందిన స్వతంత్ర, చేవెళ్లకు చెందిన కిరణ్‌గౌడ్, సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన స్పందన, మెదక్ జిల్లా డి.ధర్మారానికి చెందిన రుత్విశ్రీ, ఆమనగల్లుకు చెందిన పల్లె సరిత, గజ్వేల్ సంగుపల్లికి చెందిన మ్యాక అరవింద 467 మార్కులు సాధించారు.


పల్లవి, బైపీసీ 995 మార్కులు

సైబర్ చెర నుంచి నలుగురికి విముక్తి

» బర్మాలో బందీలుగా తెలుగు యువత

» బండి సంజయ్ చొరవతో స్వదేశానికి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మంచి ఉద్యోగం వస్తుందని బ్రోకర్ల మాటలు నమ్మి మయన్మార్ వెళ్లి.. అక్కడ బలవంతంగా సైబర్ క్రైమ్‌లు చేస్తూ చిక్కుపోయిన నలుగురు తెలుగు యువత కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో స్వరాష్ట్రాలకు చేరుకున్నారు. వీరిలో ముగ్గురు తెలంగాణ వారు కాగా, ఒకరు ఏపీ వ్యక్తి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకుని వీరిని స్వదేశానికి రప్పించారు. బ్యాంకాక్‌లో మంచి జాబ్ ఉందని, ప్రతి నెలా రూ.లక్షల జీతం వస్తుందని బ్రోకర్ ఆశ చూపడంతో బాధితులు మోసపోయారు. ఇదే విషయమై రంగారెడ్డి జిల్లా కోహెడకు చెందిన రాకేశ్‌రెడ్డి మాట్లాడారు. "మా ప్రాంతంలో ఉండే యశ్‌నాథ్‌గౌడ్ బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగం ఉందని ఆశ చూపాడు. జగిత్యాలలోని బ్రోకర్ల ఏజెంట్(టీం లీడర్) వంశీ కృష్ణ వద్దకు తీసుకువెళ్లాడు. వంశీకృష్ణ నన్ను ఇంటర్వ్యూ చేశాడు. బ్యాంకాక్‌కు 200 కి.మీ దూరంలో జాబ్ అని చెప్పి తీసుకుపోయారు. అక్కడికిపోతే రోజుకు 16 గంటల పని. అది సైబర్ క్రైమ్. ఆ పని చేయకపోతే భోజనం పెట్టేవారు కాదు. 5 నెలలు ఆ కంపెనీలో పనిచేశా. అలాంటి పనిచేయడం ఇష్టంలేక మొండికేశా. దీంతో వాళ్లు నా పాస్‌పోర్ట్ గుంజుకున్నారు. అన్నం పెట్టకుండా హింసించారు. అయినా వినకపోవడంతో మేం దొంగతనంగా ఆ దేశానికి వచ్చామని ఆర్మీ వాళ్లకు పట్టించారు. వాళ్లు మమ్మల్ని జైల్లో వేశారు. ఇటీవల మయన్మార్ నుండి వందలాది మంది నాలాంటి బాధితులను కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వదేశానికి రప్పించారని తెలుసుకుని నా కుటుంబసభ్యులకు సమాచారమిచ్చా. మా నాన్న యాదిరెడ్డి లేఖ రాసిన వెంటనే బండి సంజయ్ స్పందించి మమ్మల్ని స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. బండి సంజయ్‌కి మా కుటుంబమంతా రుణపడి ఉంటుంది" అని రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. రాకేశ్‌రెడ్డితోపాటు కోహెడకు చెందిన శివశంకర్, కరీంనగర్ జిల్లాకు చెందిన కనూరి గణేశ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆకుల గురు యువకిశోర్ స్వదేశానికి తిరిగి వచ్చారు. సైబర్ క్రైం వెట్టి చాకిరీ చేస్తున్న వారందరినీ త్వరలోనే స్వదేశానికి రప్పిస్తామని బండి సంజయ్ తెలిపారు.

పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ వ్యాపారిని డబ్బుల కోసం బెదిరించిన ఆరోపణలపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై సోమవారం కేసు నమోదైంది. సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీలో నివాసం ఉంటున్న కట్టా మనోజ్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గంలో గ్రానైట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన భర్త మనోజ్‌రెడ్డిని బెదిరించి రూ.25 లక్షలు తీసుకున్నారని, మళ్లీ ఈ నెల 18న మనోజ్‌రెడ్డికి ఫోన్ చేసి రూ.50 లక్షలు ఇవ్వాలని ఆయన భార్య ఉమాదేవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బు ఇవ్వకపోతే తన నియోజకవర్గంలో ఉన్న గ్రానైట్ క్వారీ నడవనివ్వనని, కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించారని అందులో పేర్కొన్నారు. దీనితో మనోవేదనకు గురైన తన భర్త ఆరోగ్యం క్షీణించిందని తెలిపారు. తన భర్త మనోజ్‌రెడ్డికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. గతంలో కౌశిక్‌రెడ్డికి, మనోజ్‌రెడ్డికి మధ్య పరిచయం ఉందని, ఈ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

చికెన్ చాక్లెట్.. అగ్వకు ఎనీమియా టెస్ట్!

సీఎస్ఐఆర్ క్యాంపస్‌లో స్టార్టప్ కాంక్లేవ్.. హైదరాబాద్ 2025లో ఆకట్టుకుంటున్న స్టార్టప్‌లు

- 70కు పైగా స్టార్టప్‌ల ప్రతినిధుల హాజరు
- రూ.100కే సికెల్‌సెల్ ఎనీమియా పరీక్ష
- చాక్లెట్ మాదిరిగానే షాపులో దొరికే చికెన్‌పీస్
- మధుమేహ రోగుల కోసం ప్రత్యేక స్నాక్స్
- కాంక్లేవ్‌ను ప్రారంభించిన కేంద్ర శాస్త్ర, సాంకేతిక సహాయ మంత్రి జితేంద్రసింగ్

హైదరాబాద్‌సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చికెన్ తినాలనిపిస్తే ప్రత్యేకంగా వండుకోనవసరం లేదు. షాపుకెళ్తితే ఇన్‌స్టెంట్‌గా లభిస్తుంది. చాక్లెట్ ముక్కను ఎలాగైతే రేపర్ తీసేసి నోట్లో వేసుకుంటామో.. అలాగే చికెన్ ముక్కను నోట్లో వేసుకోవొచ్చు. ఇవేకాదు.. అరటి బోదె గుజ్జుతో తయారైన శానిటరీ న్యాప్‌కిన్స్.. కేవలం రూ.100కే సికెల్‌సెల్ ఎనీమియా పరీక్ష.. తీరిగ్గా ఇంట్లో కూర్చుని పొలం వద్ద ఉన్న పంపుసెట్‌ను ఆన్ చేయగలిగే రిమోట్‌కంట్రోల్ వ్యవస్థ.. ఇలా వినూత్న ఆవిష్కరణలకు వేదికైంది ఆ స్టార్టప్ కాంక్లేవ్!! శాస్త్ర పరిశోధనల పట్ల యువతరానికి అవగాహన, వ్యాపార పరంలో దూసుకుపోయేందుకు తోడ్పాటునందించేందుకు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్‌ఐలు హైదరాబాద్‌లో స్టార్టప్ కాంక్లేవ్ హైదరాబాద్ 2025ను నిర్వహిస్తున్నాయి. రెండ్రోజులపాటు ఐఐసీటీలోని జెడ్‌ఎం స్కూల్ గ్రౌండ్ వద్ద జరగనున్న ఈ కాంక్లేవ్‌ను మంగళవారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక సహాయమంత్రి జితేంద్రసింగ్ ప్రారంభించారు. సీఎస్ఐఆర్‌కు చెందిన హైదరాబాద్‌లోని మూడు ల్యాబ్‌లు-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ), నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లతో అనుబంధం కలిగిన దాదాపు 70కి పైగా స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను, పరిశోధనలను వెల్లడిస్తూ ఓ ప్రదర్శనను ఏర్పాటు చేశాయి. ఈ స్టాల్స్‌ను ఓ సారి పరిశీలిస్తే..

అరటిబోదె గుజ్జుతోనూ శానిటరీ న్యాప్కిన్స్

మార్కెట్‌లో ఉన్న శానిటరీ ప్యాడ్స్ ఖర్చు ఎక్కువే! అయితే అతి తక్కువ ఖర్చుతో, అదీ పర్యావరణ హితమైన శానిటరీ ప్యాడ్స్ అందించేందుకు ఆకార్ ఇన్నోవేషన్స్ కృషి చేస్తోంది. అరటి బోదె గుజ్జుతో శానిటరీ ప్యాడ్స్ తయారుచేయడానికి సంస్థ సిద్ధమైంది. ప్రయోగాత్మక దశలో అపూర్వ విజయం సాధించిందని, క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి త్వరలోనే మార్కెట్‌లోకి తీసుకురానున్నామంటున్నారు సంస్థ ప్రతినిధి ఉత్కర్ష్. లీకేజీని ఆరేడు గంటలపాటు ఈ ప్యాడ్స్ అడ్డుకుంటాయని, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న శానిటరీ ప్యాడ్స్‌తో పోలిస్తే తక్కువ ధరకే అందించనున్నామని చెప్పారు



రూ.100కే సికెల్‌సెల్ ఎనీమియా పరీక్ష





ఒక్క రక్తపు చుక్కచాలు.. అతి భయంకరమైన సికెల్‌సెల్ ఎనీమియాను కనిపెట్టవచ్చు అనంటున్నారు. లైటెనింగ్ లైఫ్స్ ఎల్‌ఎల్‌పీ వ్యవస్థాపకులు సీసీఎంబీ పూర్వ శాస్త్రవేత గిరిరాజ్ రతన్ చందక్. సికెల్‌సెల్ ఎనీమియాను ముందుగానే సమస్యను గుర్తిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవడం సాధ్యమవుతుందని.. అతి తక్కువ ఖర్చుతో సికెల్‌సెల్ ఎనీమియా పరీక్ష చేసేందుకు కిట్లను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. సికెల్ సెల్ బారిన పడ్డారా? వాహకాలుగా ఉన్నారా? లాంటివన్నీ కేవలం రూ.100తో నిర్ధారించుకోవచ్చున్నారు. ఇప్పటి వరకూ చేసిన పరిశోధనలు 99 శాతంకు పైగా కచ్చితత్వంతో ఫలితాలందించాయని... భవిష్యత్తులో ఈ కిట్ ఖర్చును మరింత తగ్గించే దిశగా ప్రయోగాలు చేస్తున్నామని వివరించారు.

రిమోట్ పంపుసెట్‌ను ఆన్ చేయొచ్చు



రిమోట్‌తో టీవీ ఆన్ చేసినట్లు.. ఇంట్లో కూర్చొని, పొలం దగ్గర మోటారు ఆన్ చేయగలిగితే? బాగుంటుంది కదా! పల్లె సృజన సంస్థ కిసాన్ రిమోట్‌ను తీసుకువచ్చింది. దేశంలో మొట్టమొదటిసారిగా రిమోట్‌తో వ్యవసాయ పంపుసెట్ మోటర్‌ను నిర్వహించవచ్చునని చెబుతోంది.. దాదాపు కిలోమీటరున్నర దూరం నుంచే ఈ రిమోట్‌ను నియంత్రించవచ్చునని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ రిమోట్‌ను రూ.1900కే రైతులకు అందిస్తున్నామంటున్నారు.



మధుమేహులకు సూపర్ స్నాక్స్

షుగర్ వచ్చిందంటే మనసుకు నచ్చింది తినలేం. ఒకరకంగా నోరు ఒకరకంగా కట్టేసుకోవాల్సిందే. ప్రత్యేకించి బయటకెళ్లినప్పుడు ఆకలివేస్తే ఏదిపడితే అది తినలేం. ఇలాంటి పరిస్థితుల్లో మధుమేహులకు ఈ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సూపర్‌ఫుడ్స్ సంస్థ చక్కని స్నాక్స్ అందుబాటులోకి తెచ్చింది. నూనె లేకుండా తయారుచేసిన ఈ ఆహార పదార్థాలు 100% సహజమైనవి. పైగా ప్రొటీన్ ఎక్కువగా లభిస్తుంది. అందునా ఈ స్నాక్స్‌కు ఎలాంటి షుగర్స్ జోడించలేదు. నిల్వ ఉంచడం కోసం ఎలాంటి రసాయనాలూ జోడించలేదు. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉండే ఈ స్నాక్స్ ఊబకాయులకు కూడా ఆరోగ్యం అందిస్తాయని అంటున్నారు. ఈ ప్యాక్‌లు రూ.249 నుంచి మొదలవుతాయి.

చికెనే.. చాక్లెట్‌లా తినేయొచ్చు!





ఎవరికైనా అప్పటికప్పుడు చికెన్ ముక్క తినాలిపిస్తే? దుకాణానికి వెళితే చాక్లెట్ మాదిరిగా రేపర్ తీసి.. చికెన్ ముక్క నోట్లో పెట్టుకోగలిగితే? చికెన్ ప్రియులకు ఈ వెసులుబాటు త్వరలోనే రానుంది. చికెన్ ముక్క కొరకాలని మనసు పుడితే షాప్‌కు వెళ్లి చికెన్ ప్రీమియర్ మీట్ బార్ కొనుక్కొని తినేయొచ్చంటోంది ఇండీ మీట్ స్టార్టప్. ఐసీఏఆర్ నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వద్ద తయారైన ఈ ఇండీ మీట్ ప్రొటీన్ బార్‌లో హిమాలయన్ వనమూలికలు, చిరుధాన్యాలు కూడా జోడించారు. వందశాతం స్వచ్ఛమైన చికెన్ మీట్‌తో స్మోక్డ్ చికెన్ కూడా అందిస్తున్నారు. ఈ చికెన్ షెల్ఫ్ లైఫ్ తక్కువే ఉంటుందేమోనన్న అనుమానమూ అక్కర్లేదంటున్నారు సంస్థ కో -ఫౌండర్ సయానికా. ఆరు నెలలకు పైగానే నిల్వ ఉంటుందంటున్నారు ఆమె. 200 గ్రాముల చికెన్‌లెగ్ ఖరీదు రూ.249. అయితే, బోన్‌లెస్ రూ.289 వసూలు చేస్తున్నారు. ప్రీమియం బార్ రూ.249కు అందిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.